# జనబలం

ప్రజలే ప్రభువులు

జూన్ 2022 | లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాస పత్రిక | రూ.10/-



## ఆహ్వానించదగ్గ పరిణామం..
## చట్ట బద్ధపాలనే పరిష్కారం




## వంట నూనెల ధరల తగ్గింపు
## తాత్కాలిక పరిష్కారమే...
## ఉత్పత్తి పెంపుపై దృష్టి సారించాలి





## శ్రీలంకకు
## రాజకీయ పరిష్కారమే మార్గం



# ఎజెండా ప్రాతిపదికన ఎవరితోనైనా కలిసి పనిచేస్తాం

ప్రజల జీవితాల్లో నిజమైన మార్పు తెచ్చే నాణ్యమైన విద్య, మంచి ప్రమాణాల ఆరోగ్యం, చట్టబద్ధపాలన, ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతిలేని సేవలు, స్థానిక ప్రభుత్వాల సాధికారత తదితర అంశాల ప్రాతిపదికన ఎవరితోనైనా కలిసి పనిచేయటానికి లోక్‌సత్తా సిద్ధమేనని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. సామాజిక న్యాయం, ప్రజాస్వామ్యం ఈ ఎజెండాతోనే సాధ్యమన్నారు.

తెలంగాణ బహుజన ఫ్రంట్ చైర్మన్ నారగోని, కో కన్వీనర్ సలీం పాషా, నవసమాజ్ రాష్ట్ర కన్వీనర్/విశ్రాంత జాయింట్ కలెక్టర్ సూర్యనారాయణ, ఉన్నత విద్య విశ్రాంత జాయింట్ డైరెక్టర్ రామనర్సయ్య, పీపుల్స్ ఎడ్యుకేషన్ సెంటర్ చైర్మన్ బాలకృష్ణ తదితరులు హైదరాబాద్‌లోని ఎఫ్‌డీఆర్ కార్యాలయంలో జేపీతో సమావేశమయ్యారు. సమావేశంలో లోక్‌సత్తా పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మనపల్లి శ్రీనివాసు, ఉపాధ్యక్షుడు నందిపేట రవీందర్ కూడా పాల్గొన్నారు.

సమాజంలో మార్పు కోసం కలిసివచ్చే వారందరితో ఉమ్మడి కార్యాచరణను రూపొందించుకోవాలని, ఆ తర్వాత రెండు తెలుగు రాష్ట్రాలలో సమావేశాలు నిర్వహించాలని నేతలకు జేపీ సూచించారు. లోక్‌సత్తా ప్రతిపాదిస్తున్న నిర్మాణాత్మక ఎజెండా చుట్టూ జరిగే సదస్సుల్లో పాల్గొనటానికి తనకెటువంటి అభ్యంతరం లేదని, ఇవి లేకుండా కేవలం ఎన్నికల్లో పోటీ లక్ష్యంగా పనిచేస్తే ప్రయోజనముండదన్నారు. రాష్ట్రాల్లో ముఖ్యమంత్రులను ప్రత్యక్షంగా ఎన్నుకునే పద్ధతి, దామాషా ఎన్నికల విధానంతో డబ్బు ప్రభావం గణనీయంగా తగ్గి కులం, డబ్బుతో సంబంధం లేకుండా సమర్థులు, సేవాభావం కలవారు చట్టసభలకు ఎన్నిక కాగలుగుతారని, ఈ ఎన్నికల సంస్కరణల కోసం కలసికట్టుగా కృషి చేయటం అవసరమన్నారు.



ప్రజలే ప్రభువులు

# జనబలం

లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాసపత్రిక

| సంపుటి | సంచిక | సంపాదకవర్గం | వర్కింగ్ ఎడిటర్ |
|---|---|---|---|
| 25 | 06 | బండారు రామ్మోహనరావు | దూసనపూడి |
| జూన్ 2022 | | శిరమణి నరేష్ | సోమసుందర్ |


## జనబలం చందా రుసుము వివరాలు

| | |
|---|---|
| సంవత్సర చందా | రూ. 100.00 |
| మూడు సంవత్సరాలకు చందా | రూ. 290.00 |
| ఐదు సంవత్సరాలకు చందా | రూ. 475.00 |
| జీవితకాలపు చందా | రూ. 1200.00 |

*జనబలంలో ప్రచురితమవుతున్న వ్యాసాలలో రచయిత(త్రు)లు వెలిబుచ్చే అభిప్రాయాలు కేవలం వారి సొంతం. జనబలం సంపాదకవర్గం ఆ అభిప్రాయాలతో ఏకీభవిస్తున్నట్టు కాదు.*

### చందాదారులకు విజ్ఞప్తి

చందా మొత్తాలను, ప్రకటనల ధర మొత్తాలను చెక్కుగాని, డి.డి. ద్వారా గాని FOUNDATION FOR DEMOCRATIC REFORMS పేర పంపవచ్చును. NEFT సౌకర్యము ద్వారా పంపదలచినవారు SBI PUNJAGUTTA BRANCHలోని SB A/C. No. 52086568057కి IFSC CODE No. SBIN0020072కు పంపి, Transaction I.D. No. మరియు తారీఖు తప్పనిసరిగా తెలియజేయవలెను. నగదు రూపంలో చెల్లించదలచిన వారు లోక్‌సత్తా సంస్థ కేంద్ర కార్యాలయంలో ఇచ్చి రశీదు పొందవలెను.

## కార్టూన్ కార్నర్




**కార్యాలయ చిరునామా :** H.NO. **6-3-678, B-106 , పాషా కోర్టు, 71 , సోమాజీగూడ, త్రిబువన్‌దాస్ జ్యూయలరీ వెనుక, హైదరాబాద్-500 082 ఫోన్: 040-23310288, 040-23419949**
Email: accountsdept@loksatta.org

సంపాదకీయం

# మోదీ ఎనిమిదేళ్ల పాలన చేజారిన సువర్ణావకాశం

భారత ప్రధానమంత్రిగా నరేంద్రమోదీ బాధ్యతలు చేపట్టి ఎనిమిదేళ్లు పూర్తయ్యింది. నరేంద్రమోదీ సైద్ధాంతిక, రాజకీయ భావజాలంతో ఏకీభవించని వారు సైతం విస్మరించడానికి వీల్లేని ఒక శక్తిగా ఆయన రూపొందారు. 2014లో తొలిసారి పార్లమెంటులో సంపూర్ణ ఆధిక్యంతో ఆయన ప్రధాని అయ్యారు. 2019లో పెరిగిన ఆధిక్యంతో రెండోసారి అధికారం చేపట్టారు. మూడు దశాబ్దాలుగా దేశంలో సంకీర్ణ ప్రభుత్వాలు అస్థిర పాలనను అందిస్తూ వచ్చాయి. కానీ మున్నెన్నడూ లేనంత స్పష్టమైన ఆధిక్యతతో నరేంద్రమోదీ సుస్థిర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. ఆయనపై ప్రజలు ఎన్నో ఆశలు, ఆకాంక్షలు పెంచుకున్నారు. ఆయనపై గొప్ప విశ్వాసం వ్యక్తం అయ్యింది. బీజేపీ హిందుత్వ ఆధిక్యతా సిద్ధాంతం గురించి తెలిసినప్పటికీ అత్యధిక సంఖ్యాక ప్రజలు ఆ పార్టీని, ముఖ్యంగా నరేంద్రమోదీని విశ్వసించారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా మోదీ అమలు చేసిన నమూనా గురించిన ప్రచారం ప్రజలను ఆకట్టుకున్నది. గుజరాత్ మారణహోమంలో మోదీ పాత్ర గురించిన అభిప్రాయాలను ప్రజలు పక్కనబెట్టారు. ముఖ్యమంత్రిగా ఎలా ఉన్నప్పటికీ, ప్రధానమంత్రిగా ఆయన తన గతాన్ని విస్మరించి దేశానికి గట్టిమేలు చేయగలరని ప్రజలు విశ్వసించారు. 2014 ఎన్నికల్లో నరేంద్రమోదీ అధిక ధరలు, నిరుద్యోగం, అవినీతి, నల్లధనం, రైతుల ఆత్మహత్యలు, పెట్రోలు, డీజిలు ధరలు వంటి అంశాలను ప్రముఖంగా ప్రస్తావించారు. హిందుత్వ ఆధిక్యత గురించిన అభిప్రాయాలతో ఏకీభవించని వర్గాలు సైతం పెద్ద ఎత్తున మోదీకి ఓటు వేశాయి. బీజేపీ తొలిసారిగా 31 శాతం ఓట్లను పొందగలిగింది. 2019లో ఓట్లశాతం 37.4కు పెరిగింది. గత ఎనిమిదేళ్లుగా నరేంద్రమోదీ మన దేశంలో ఒక అత్యధిక మద్దతు కలిగిన జనాకర్షక నేతగా తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్నారు. ఇప్పటికీ జనప్రియనేతగా మోదీ తన అగ్రస్థానాన్ని నిలబెట్టుకుంటున్నారు.

వరుసగా జరిగిన రాష్ట్రాల శాసనసభ ఎన్నికల్లో తన పార్టీని విజయతీరాలకు చేర్చగలిగిన ఎన్నికల పోరాట యోధునిగా మోదీ పేరు పొందారు. ఎన్నికల నినాదాల రూపకల్పనలో, వ్యూహచతురతలో, ప్రచారంలో మోదీ-షా ద్వయం ఆరితేరిపోయింది. ప్రతిపక్షాలకు అందనంత దూరంలో ముందంజవేసి విజయాలు సాధించింది.

గుజరాత్ మారణహోమం నేపథ్యంలో మోదీని వెలివేసిన అగ్రరాజ్యం అమెరికా అనంతర కాలంలో ఆయన్ని అక్కున చేర్చుకున్నది. అనేకదేశాలు పోటీపడి మోదీని ఆహ్వానించాయి. గౌరవసత్కారాలుతో ఆదరించాయి. రెండు ధ్రువాల ప్రపంచంగా అంతర్జాతీయ సమాజం విభజితమైన కాలం మారింది. బహుళపక్ష వేదికల యుగం నడుస్తోంది. నరేంద్రమోదీ పలు వేదికలకు స్వయంగా హాజరై భారత్ స్థానాన్ని దాంతోపాటు తన వ్యక్తిగత ప్రతిష్టను సుస్థిరం చేశారు. ఎక్కడికి వెళ్లినా ఆయనకు బ్రహ్మరథం పట్టారు.

మోదీ ఎనిమిదేళ్ల పాలన గురించిన సంబరాలు మొదలయ్యాయి. ఆ పార్టీనేతలు, కేంద్రమంత్రులు తమ పాలనా విజయాలను కీర్తిస్తూ పెద్ద ఎత్తున ప్రచారాన్ని ప్రారంభించారు. అందులో సహజంగానే అతిశయోక్తులూ, అసత్యాలూ చాలా ఉన్నాయి. విదేశాంగ విధానంలో పెద్దగా విజయాలు లేకపోయినా తమ నేతకు లభిస్తున్న స్వాగత సత్కారాలను చూపించి అదే ఘనతగా సంకీర్తనం చేయడం చూస్తున్నాం. విశ్వగురు స్థానానికి చేరువలో భారత్ ఉన్నదని వారెంత గొప్పగా చెప్పినా అంతర్జాతీయ సమాజం దృష్టిలో భారత్ తన గత ప్రాభవాన్ని కోల్పోతున్నదని పలు సర్వేలు చెబుతున్నాయి.

ప్రపంచ ఆకలి సూచికలో 2014లో 55వ స్థానంలో ఉన్న భారత్ 2022 నాటికి 101వ స్థానానికి దిగజారింది. ఆహార భద్రత సూచికలో 59వ స్థానం నుండి 71వ స్థానానికీ, సామాజిక అభివృద్ధి సూచికలో 102వ స్థానం నుంచి 115వ స్థానానికీ, చట్టబద్ధ పాలనా సూచికలో 35వ స్థానం నుండి 79వ స్థానానికీ, ప్రజాస్వామ్య పాలనా సూచికలో 27వ స్థానం నుండి 41వ స్థానానికీ, పత్రికా స్వేచ్ఛా సూచికలో 96వ స్థానం నుండి 150 స్థానానికీ, లింగ నిష్పత్తి సూచికలో 114 స్థానం నుండి 140 స్థానానికీ భారత్ దిగజారింది. ఈ సూచికలన్నీ అంతర్జాతీయ సంస్థలు రూపొందించినవన్న సంగతి గమనంలో ఉంచుకోవాలి.

భారత్‌లో నిరుద్యోగిత 45 ఏళ్లలో ఎన్నడూ లేనంగా 7.9శాతానికి చేరుకున్నది. ఈ మధ్యకాలంలో ఉపాధి కోల్పోయిన వారి సంఖ్య 22 కోట్లకు చేరింది. దాదాపు 60 లక్షల సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు మూతపడ్డాయి. ప్రభుత్వ ఉద్యోగాలు ఖాళీగా పడి ఉన్నవి 62 లక్షలని ప్రభుత్వమే ప్రకటించింది. అందులో ప్రధానంగా విద్య, వైద్యం, శిశు, స్త్రీ సంరక్షణ, రక్షణ రంగాల్లో ఉద్యోగాలే ఎక్కువగా ఉన్నాయి.

జీడీపీ 4.75 దగ్గర, ద్రవ్యోల్బణం 4.2 శాతం దగ్గర తచ్చాడుతున్నాయి. గత 70 సంవత్సరాలలో దేశం చేసిన అప్పు 55 లక్షల కోట్లు కాగా కేవలం గత ఎనిమిదేళ్లలో మోదీ ప్రభుత్వం తెచ్చిన అప్పు రూ. 80 లక్షల కోట్లకు చేరింది. బ్యాంకింగు రంగంలో నిరర్థక ఆస్తుల విలువ 21 లక్షల కోట్లు ఉండగా గత ఎనిమిదేళ్లలో మోదీ ప్రభుత్వం 11 లక్షల కోట్ల రుణాలను రద్దు చేసింది. సుమారు ఐదున్నర లక్షల కోట్ల రూపాయల మేరకు బ్యాంకు కుంభకోణాలు జరిగాయి. రైతుల ఆదాయం రెట్టింపు చేయడం మాట ఎలా ఉన్నా రైతుల రుణభారం పెరుగుతూనే ఉన్నది. కోట్లాది జన్‌ధన్ ఖాతాలు ప్రారంభించినా అందులో ఒక్క రూపాయి కూడా లేని ఖాతాలే అత్యధికం. కోట్లాది మందికి ఉజ్వల పథకం కింద గ్యాసు పొయ్యి, గ్యాస్ సిలిండర్‌ను అందచేసినా 60శాతం పైగా మహిళలు రెండోసారి సిలిండర్ తీసుకోలేకపోయారు.

సమస్యలు పరిష్కారం కాకపోయినా తమనే ఎన్నుకుంటున్నారు కాబట్టి తమది మంచి పాలనగానే పాలకపక్ష నేతలు వాదిస్తూ ఉంటారు. పార్లమెంటరీ ఆధిక్యత, ఎన్నికల విజయాలు మాత్రమే ప్రజాస్వామ్యం అని చెప్పడానికి వీల్లేదు. ఎన్నికల విజయాలలో చాలా పరిమితులు ఉంటాయి. పార్లమెంటు పనివిధానం, స్వతంత్రంగా పనిచేయాల్సిన రాజ్యాంగ వ్యవస్థలు, అధికార వికేంద్రీకరణ, సమాఖ్యస్ఫూర్తి, చట్టబద్ధపాలన, పత్రికాస్వేచ్ఛ, పౌరహక్కులు వంటి అంశాలలో గత ఎనిమిదేళ్ల పాలన గాడి తప్పిందని చెప్పక తప్పదు. స్వేచ్ఛ, సమానత్వం, సామాజిక న్యాయం, బహుళత్వం వంటి మన రాజ్యాంగ విలువలను మోదీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. తనకు లభించిన ఒక సువర్ణావకాశాన్ని వినియోగించుకోవడంలో మోదీ నిరాశపరిచారని ఎనిమిదేళ్ల పాలన తేటతెల్లం చేసింది.

డి. సోమసుందర్

# ఆహ్వానించదగ్గ పరిణామం.. చట్టబద్ధపాలనే పరిష్కారం

## *రాజద్రోహ చట్టం అమలు నిలిపివేత ఓ ముందడుగు*

**- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ -**



భారతీయ శిక్షా స్మృతి(ఐపీసీ)లోని సెక్షన్ 124 ఎ నిబంధనపై కేంద్రప్రభుత్వం పున:సమీక్ష జరిపి తదుపరి నిర్ణయం తీసుకునేంత వరకు దాని అమలును నిలిపేస్తూ దేశ సర్వోన్నత న్యాయస్థానం కీలకమైన ఆదేశాలిచ్చింది. రాజద్రోహ చట్ట రాజ్యాంగబద్ధత అంశం ప్రభుత్వ పున:పరిశీలనలో ఉన్నందున దీని కింద కొత్తగా కేసులు నమోదు చేసే విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయమనం పాటించాలని స్పష్టం చేసింది. ఇప్పటికే ఐపీసీ సెక్షన్ 124ఎ కింద నమోదైన అన్ని కేసులు, అప్పీళ్లు, ప్రొసీడింగ్స్‌నూ ప్రస్తుతానికి నిలిపివేస్తున్నట్లు పేర్కొంది. ఒకవేళ ఎవరిపైనైనా ఈ సెక్షన్‌తో పాటు ఇతర సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి ఉంటే మిగిలిన సెక్షన్ల కింద విచారణ కొనసాగించవచ్చని తెలిపింది. ఎప్పుడో బ్రిటీష్ పాలకుల హయాంలో అమల్లోకి తెచ్చిన ఈ సెక్షన్ ప్రస్తుత సామాజిక పరిస్థితులకు అనుగుణంగా లేదని, అందువల్ల దీన్ని పున:పరిశీలించాలన్న కోర్టు సూచనను అంగీకరిస్తూ కేంద్ర ప్రభుత్వం అఫిడవిట్ దాఖలు చేసిన నేపథ్యంలో ధర్మాసనం తన నిర్ణయాన్ని వెలువరించింది. వేధింపులకూ, రాజకీయ కక్ష సాధింపులకూ సాధనంగా మారిన భారతీయ శిక్షాస్మృతి(ఐపీసీ)లోని సెక్షన్ 124ఎ అమలు నిలిపివేసే నిర్ణయంతో చట్టాల దుర్వినియోగం సంపూర్ణంగా మారకపోయినా, కనీసం ఇదొక ముందడుగు.

1880లో అమలులోకి వచ్చిన శిక్షాస్మృతిలో ఈ చట్టాన్ని చేర్చలేదు. తర్వాత 1890లో ఐపీసీలో 124 ఎ సెక్షన్ కింద రాజద్రోహాన్ని చేర్చారు. అప్పట్లో పూర్ణజీవిత కాలం ఖండాంతర శిక్ష విధించేవారు. అండమాన్ జైళ్లకు పంపించేవారు. 1955లో ఆ శిక్షను యావజ్జీవ శిక్షగా మార్చారు. స్వాతంత్ర్యం వచ్చి రాజ్యాంగం అమలులోకి వచ్చినా, ఎన్నికలు క్రమబద్ధంగా జరుగుతున్నా, ఎన్నికైన ప్రభుత్వ పాలన వచ్చినా మౌలికంగా మన చట్టాలు కానీ, మన పాలనా పద్ధతులు కానీ పాలన నిర్మాణం కానీ మారలేదు. కొంతమంది విమర్శకులు అంటుంటారు.. జెండా మారింది కానీ పెద్దగా మారలేదని. అది వాస్తవం కాదు. ప్రజాస్వామ్యం అమలు మౌలికమైన మార్పు. కానీ అనుకున్నంత మార్పులు రాలేదు. దాంతో రాజ్యాంగం విలువలకు, వలస కాలం నుంచి కొనసాగుతున్న చట్టాలకు మధ్య అంతరం ఏర్పడింది. కాలక్రమేణా వాటిని మార్చే ప్రయత్నం చేస్తున్నాం. ఉదాహరణకు ఆడపిల్లకు ఆస్తి హక్కు ఇటీవల వరకు లేదు. సంప్రదాయంగా మగపిల్లవాడికే హక్కు అనేది కొనసాగింది. ఇటీవలే మార్పు వచ్చింది. బహుశా ఆంధ్రప్రదేశ్‌లో ఎన్టీరామారావు పాలనలోనే ఇది మొదలైంది.

జాతీయ స్థాయిలో చాలా రాష్ట్రాల్లో క్రమక్రమంగా మార్పులు వస్తున్నాయి. మన చట్టాలలో, సంప్రదాయాలలో మహిళ మగవాడి ఆస్తి అనే భావన అంతర్లీనంగా ఉంటుంది. క్రమక్రమంగా దాన్నుంచి బయటపడుతున్నాం. కులవ్యవస్థ నుంచి బయటపడుతున్నాం. ఈ మార్పును అందరూ ఆహ్వానించాలి. సుప్రీంకోర్టు ఎట్టకేలకు రాజద్రోహ చట్టం అక్కర్లేదని ఓ నిర్ధారణకు వచ్చినట్టు కనిపిస్తోంది. లాంఛనప్రాయంగా వాళ్లు సమీక్ష చేయాలి. సంతోషం ఏమిటంటే భారత ప్రభుత్వం కూడా ఇది ఇంక అక్కర్లేదనుకుంటున్నాం, సమీక్ష చేస్తాం..ఈ చట్టాన్ని తీసే అంశాన్ని పరిశీలిస్తామని చెబుతున్నారు..ఈ లోగా కొత్త కేసులు నమోదు చేయడానికి వీలు లేకుండా ఉన్న కేసులు కొనసాగకుండా ఒక ఏర్పాటు చేశారు..దాన్ని మనస్ఫూర్తిగా ఆహ్వానించాలి.

మన ప్రజాస్వామ్యంలో ఇంకా జవసత్వాలు ఉన్నాయి. దేశభద్రత, సమగ్రత కాపాడాలంటే మనకి అనేక మార్గాలున్నాయి. కచ్చితంగా వ్యక్తిస్వేచ్ఛ, దేశ సమగ్రత కలపాలి. దీన్ని కాదని ఎవరూ అనరు. కానీ మన రాజ్యాంగంలో వ్యక్తి స్వేచ్ఛకు చాలా హేతుబద్ధమైన పరిమితులు ఉన్నాయి. దాని గురించి ఆందోళన చెందక్కర్లేదు. ఉదాహరణకు దేశం మీద ఎవరైనా దాడి చేసే అవకాశం ఉంటే టెర్రరిస్టు చట్టాలు ఉన్నాయి. మన దేశం మీద గూఢచర్యం ఉంటే దానికి చట్టాలు ఉన్నాయి. ఈ రాజద్రోహం చట్టాలు అవసరం లేదు. థాయ్‌లాండ్ లాంటి దేశాల్లో అక్కడ రాజును ఎవరైనా పల్లెత్తు మాట అంటే, కొద్దిగా అగౌరపరిస్తే తీవ్రమైన శిక్షలు పడే అవకాశం ఉంది. మన దేశం అలాంటి దేశం కానక్కర్లేదు. కాబట్టి ఇది ప్రజాస్వామ్యంలో మరో ముందడుగు..ప్రభుత్వం కూడా కలిసి రావడం చాలా సంతోషం. దీంతో పాటు ఇలాంటి ఇంకా అవసరమైన మార్పులు తీసుకొస్తారని ఆశిద్దాం.

**అద్భుతాలు జరిగాయని అనుకోవద్దు..**
**కానీ ఆహ్వానించదగిన పరిణామం**

మౌలికంగా చట్టబద్ధపాలన తీసుకురావాలి. చట్టాలు ఇలా గందరగోళంగా ఉన్నప్పుడు, పొరపాటుగా ఉన్నప్పుడు పోరాడటం తేలిక. ఇవాళ కాకపోతే రేపైనా మార్పు వస్తోంది. చట్టాలు కాగితం మీద బాగుండి, రాజ్యాంగ వ్యవస్థ కాగితం మీద బాగుండి వాస్తవంగా అమలుకాకపోతే దాని పరిస్థితి ఏంటి? దేశంలో చట్టబద్ధ పాలన లేదు. ఈ దేశంలో ఎన్నో రాష్ట్రాల్లో దేశవ్యాప్తంగా ఏపార్టీ అధికారంలో ఉన్నా బడితె ఉన్న వాడిదే బర్రె అవుతోంది. సామాన్యుడికి కాగితం మీద అధికారం సమానంగా, హక్కులు సమానంగా ఉన్నా కూడా వాస్తవానికి అమల్లోకి రావడం లేదు. ఎందరో అమాయకులు లాయర్లను పెట్టుకోలేని వారు, ఆర్థిక స్థోమత లేని వారు జైళ్లలో మగ్గుతున్నారు. నూటికి 70 మంది అమాయకులు, నిరుపేదలు, ఇంకా చార్జ్‌లు కూడా ఫ్రేమ్ కాని వాళ్లు జైళ్లలో మగ్గుతున్నారు. ఈ దేశంలో చట్టబద్ధ పాలన ఇంకా సరిగా ఏర్పాటు కాలేదు. ఇవన్నీ కూడా కాలక్రమేణా ఏవో ముక్కలు ముక్కలుగా కాకుండా ఏర్పాటు చేయాలి. మౌలికంగా ఓ చట్టబద్ధ పాలన పోలీసు యంత్రాంగం, నేర పరిశోధన, ప్రాసిక్యూషన్, నేరవిచారణ, ఇవన్నీ కూడా స్వతంత్ర ప్రతిపత్తితో న్యాయంగా, జవాబుదారీగా, పారదర్శకంగా, సమర్థంగా, వేగంగా అందరికీ సమన్యాయం అందేలా ఏర్పాటు చేయాలి. దానికి దీన్ని తొలి అడుగుగా భావిద్దం. అంతేకానీ దీంతో అద్భుతాలు జరిగాయని అనుకోవద్దు. కానీ కచ్చితంగా ఇది తొలి అడుగు.

**అన్ని పార్టీలదీ అదే బాట**

ఈ పార్టీ ఆపార్టీ అని కాదు..రాష్ట్రాలలో అధికారంలో ఉన్న వాళ్లు కానీ, జాతీయ స్థాయిలో అధికారంలో ఉన్నవాళ్లు కానీ తమ ప్రయోజనాల కోసం ఈ చట్టాన్ని దుర్వినియోగం చేశారు. ఇది అన్ని పార్టీలు చేశాయి. కొంతమంది ప్రభుత్వాధినేతలు సంయమనం పాటించి ఉండొచ్చు. ఒకసారి అధికారంలోకి వస్తే ఒక రాచరిక స్వభావం వాళ్లలోకి వస్తోంది. పార్టీ బయట..పార్టీ లోపల, చట్టసభ లోపల కానీ, చట్టసభ బయట కానీ తమ మాటకు ఎదురు ఉండకూడదు. తమను రారాజులుగా గౌరవించాలి, గుర్తించాలనే భావన పాలకవర్గాల్లో బల పడుతోంది. ప్రజలే ప్రభువులు– తాము సేవకులమని మరిచి పోతున్నారు.

**ప్రజాస్వామ్య సంస్కృతి ఇంకా అలవడలేదు**

ప్రజాస్వామ్య సంస్కృతి మన పాలకవర్గాల్లో కానీ, ప్రజల్లో కానీ ఇంకా రాలేదు. ప్రజాసామ్యాన్ని ఓటు హక్కు, ద్వారా రాజ్యాంగంలో కల్పించాం, స్వేచ్ఛను రాజ్యాంగం ద్వారా కల్పించాం ఇచ్చాం తప్ప మన ప్రవర్తనలో, మన చర్చలో, మన నిర్ణయాల్లో ప్రజాస్వామ్య సంస్కృతి ఇంకా రాలేదు. కాబట్టి పార్టీలు, పక్షపాతాలు పక్కన పెడితే అన్ని చోట్లా ఇలానే జరుగుతోంది. జాతీయ స్థాయిలో చట్టం చేసే అవకాశం ఉంది కానీ ఆ చట్టాలను అమలు చేసేది రాష్ట్రాలు. బహుశా ప్రపంచంలోని ఏ ఫెడరల్ దేశంలోనూ జాతీయస్థాయి ప్రభుత్వానికి ఇంత పరిమితమైన పాత్ర ఉండదు. నేరపరిశోధనలోనూ కొన్ని ప్రత్యేక అంశాలలో తప్ప నేరపరిశోధన, పోలీసు యంత్రాంగం, కోర్టులు మొత్తం రాష్ట్రాల పరిధిలో ఉన్న అంశం. కాబట్టి ఇదేదో జాతీయ స్థాయిలో ప్రభుత్వాలు చేస్తున్నాయని అనుకోవడం పొరపాటు. యూపీఏ కావొచ్చు, ఎన్డీఏ కావొచ్చు. మౌలికంగా రాజ్యాధికారంలో ఉన్న పార్టీలు అధికార దుర్వినియోగాన్ని సహజమైన అధికార ప్రక్రియగా మార్చేశారని అర్థం చేసుకోవాలి. ఒకవైపు దేశసమగ్రత, దేశభద్రత సార్వభౌమత్వం పరిరక్షించాలి, మరోవైపు ప్రజల హక్కులు, స్వేచ్ఛ, వాక్ స్వాతంత్ర్యం గౌరవించాలి..మరీ అతిగా వెళ్లినా కూడా ప్రమాదం. సుప్రీంకోర్టు కూడా ఈ మాట అంది.

**చట్టబద్ధ పాలనకు కృషి చేయాలి**

కచ్చితంగా మనకు చట్టబద్ధ పాలనలో వైఫల్యం ఉంది. రిటైల్ అంశాలమీద ఆందోళన కంటే ప్రధానంగా మనం దీనికోసం పోరాటం చేయాలి. అక్రమాలకు పాల్పడిన వాళ్లకు

అధికారమో, పలుకుబడో, డబ్బో ఉంటే శిక్ష పడుతుందనే భయం లేదు. అమాయకుడికి రక్షణ ఉంటుందన్న నమ్మకం లేదు. రాజీవ్‌గాంధీ లాంటి మహానాయకుడ్ని టెర్రరిస్టులు చంపేస్తే శిక్షపడడానికి 18 ఏళ్లు పట్టింది. ఇక సామాన్యుల సంగతి ఏంటి?..తీర్పులు రావడానికి ఏళ్ల తరబడి సమయం పడుతోంది. బలమైన చట్టాలు ఉన్నాయి..కానీ అమలు కావడం లేదు. పోలీసు అధికార యంత్రాంగం మొత్తం అధికారంలో ఉన్న వాళ్ల సొత్తు అయిపోయింది. పోలీసు అధికారుల్లో కొంతమంది వ్యక్తిగతంగా సమర్థులు, నిజాయితీ పరులు, మంచివాళ్లు ఉండొచ్చు.. కానీ పైవారి ఆదేశాలు కనుక పాటించకపోతే శంకరగిరి మాన్యాలు పట్టిస్తారు. నేరపరిశోధన పూర్తిగా వారి చేతుల్లో ఉంది. నేరపరిశోధనను వేరు చేయాలి. శాంతిభద్రతలు ప్రభుత్వం చేతిలో ఉండాలి. విద్యార్థులు ఉద్యమం చేసినప్పుడు కొన్ని అనుకోని సంఘటనలు జరగొచ్చు కానీ క్రూరంగా అణిచివేయలేం. కానీ మతకలహాలు వచ్చినప్పుడు క్రూరంగా అణిచివేయాలి. కాబట్టి అక్కడ ప్రభుత్వం కచ్చితంగా రాజకీయ నీతిని ప్రదర్శిస్తోంది. శాంతిభద్రతలు వేరు.. చట్టం వేరు. చట్టబద్ధ పాలన వేరు. నేరపరిశోధనలో ప్రభుత్వ జోక్యం ఎందుకు ఉండాలి. మనం అన్నీ కలగాపులగం చేసి ఎస్ఐ నుంచి డీజీపీ వరకు మొత్తం పోలీసు యంత్రాంగం అంతా వారి చేతుల్లో ఉండేలా చేశాం. ఎమ్మెల్యేకు సలామ్ కొట్టకపోతే, వారి చెప్పుచేతల్లో లేకపోతే వారికి బతుకు లేకుండా చేశాం. దాన్ని మార్చాలి. ప్రాసిక్యూషన్‌ను బలహీనపర్చాం, దాన్ని మార్చాలి. కోర్టులకెళితే తరాలుపడుతోంది. దాన్ని మార్చాలి. ఇది జరగకుండా ఈ ప్రజాస్వామ్యం చాలా అపరిపక్వమైన ప్రజాస్వామ్యం. మన ప్రజాస్వామ్యం కేవలం ఎన్నికల్లో ఓటుకు, ఓటు ద్వారా వచ్చే అధికారానికి పరిమితం చేశాం. నిరసనకు పరిమితం చేశాం. దాన్నుంచి దాటి వెళ్లాలి.

**అవసరమైతే ప్రత్యామ్నాయాన్ని ఆలోచించాలి**

ఈ చట్టాన్ని తీసేసినప్పుడు ఒక కొరత కనిపించొచ్చు. ఉదాహరణకు అమెరికా ఎన్నికల్లో ట్రంప్ ఓడిపోయిన తర్వాత పచ్చి అబద్ధాలు చెప్పాడు. ఓడిపోలేదని సామాన్య ప్రజల్ని మాయలోపెట్టి హింసను ప్రేరేపించి అమెరికన్ కాంగ్రెస్‌పై దాడి చేసి, ఒకరకంగా ప్రపంచంలో గొప్ప ప్రజాస్వామిక దేశంలో ప్రజాస్వామ్యాన్ని నాశనం చేసే దశకు తీసుకువచ్చాడు. చట్టరీత్యా అక్కడ అది నేరం కాదు. కాబట్టి అలాంటి నేరాల గురించి ఆలోచించాలి. హింసాత్మక ప్రవృత్తితో రాజ్యాంగాన్ని కూలదోసే ప్రయత్నం చేస్తే , మౌలిక ప్రజాస్వామిక వ్యవస్థను కూలదోసే ప్రయత్నం కనుక చేస్తే దానికి ఒక శిక్ష ఉండేలా చేయాలి. ఇప్పుడున్న విస్తృతార్థంలో కాకుండా, మౌలికంగా రాజ్యాన్ని కూలదోయడం వేరు, వ్యవస్థను కూలదోయడం వేరు, ప్రభుత్వం మీద విమర్శలు చేయడం వేరు. దానికోసం ఓ ఆలోచన చేయాలి, అది కూడా పకడ్బందీగా చేయాలి. మేధావులు, న్యాయ కోవిదులు కూర్చుని దీనిపై ఆలోచించాలి. ప్రత్యామ్నాయం కావాలంటే అందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలి.

**స్వాతంత్ర్య పోరాట సమయంలో బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజల్లో వెల్లువెత్తుతున్న ఆగ్రహజ్వాలల్ని అణిచివేసేందుకు ఈ చట్టాన్ని తెచ్చారు. బ్రిటీష్ ఇండియా తొలి లా కమిషనర్ థామస్ మెకాలే ఈ రూపొందించిన ఈ చట్టాన్ని 1890లో 124 ఎ సెక్షన్ కింద భారత శిక్షా స్మృతిలో చేర్చారు. 1891లో తొలిసారిగా ఈ సెక్షన్ కింద కేసు నమోదైంది. గాంధీ మొదలుకుని తిలక్ వరకు స్వాతంత్రోద్యమ నాయకులందరిపైనా కేసులు నమోదు చేసి జైలు పాలు చేశారు.**

**సెక్షన్ 124ఎ లో ఏం ఉంది: ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన ప్రభుత్వంపై ఎవరైనా మాటలతో, చేతలతో, సంకేతాలతో, ప్రదర్శనలతో, విద్వేషపూరిత వ్యాఖ్యలతో శత్రుత్వాన్ని ప్రదర్శిస్తే దేశద్రోహ నేరం కిందికి వస్తోంది. దీని కింద కేసు నమోదైతే బెయిల్ లభించదు. ముందస్తు నోటీసు లేకుండా అరెస్ట్ చేయొచ్చు. నేరం రుజువైతే మూడేళ్ల నుంచి యావజ్జీవ కారాగార శిక్ష పడుతుంది.**

# శ్రీలంక సంక్షోభ నివారణకు రాజకీయ పరిష్కారమే మార్గం

- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్

**ఆహార, ఆర్థిక సంక్షోభంతో శ్రీలంక అల్లాడుతోంది. నిత్యావసర ధరలు అమాంతం పెరిగిపోవడంతో ప్రజలు తినడానికి తిండిలేక ఆకలితో అలమటిస్తున్నారు. నిత్యావసరాల కోసం క్యూలైన్లలో బారులు తీరి అవస్థలు పడుతున్నారు. మరోవైపు ఈ ఆర్థిక సంక్షోభం రాజకీయ సంక్షోభానికి దారి తీసింది. అతి తీవ్రమైె పౌరసమాజం మూకుమ్మడిగా రాజపక్సలకు వ్యతిరేకంగా హింసాత్మక ఘటనలకు దారి తీసింది.**

**శ్రీలంక ఆర్థిక, రాజకీయ సంక్షోభం ప్రజా తిరుగుబాటు నేపథ్యంలో..మరోచర్చ తెరపైకి వచ్చింది. శక్తికి మించి అప్పులు, ఉచిత పథకాలు మనదేశ ఆర్థిక వ్యవస్థను దిగజార్చుతాయని, త్వరలోనే మన దేశం కూడా శ్రీలంకలా తయారవుతుందనే ప్రచారం జోరుగా సాగుతోంది. కొంతమంది ఆ దిశగా విశ్లేషణలు చేస్తున్నారు. ఇందులో వాస్తవం ఎంత? శ్రీలంకలో సంక్షోభానికి దారి తీసిన పరిస్థితులు, లంక సంక్షోభం నుంచి మనం నేర్చుకోవాల్సిన గుణపాఠాలు ఏంటనే అంశాలపై విశ్లేషణ.**

వర్తమాన ప్రజాస్వామ్యంలో ఆర్థిక వ్యవస్థను ఛిన్నాభిన్నం చేసి, రాజకీయాన్ని ప్రైవేటు ఆస్తిలా, అధికారాన్ని కుటుంబ వ్యవహారంలా మారిస్తే ఏమవుతుందో శ్రీలంక పరిణామాలు ప్రస్ఫుటం చేస్తున్నాయి. రాజకీయ జవాబుదారీతనం లేకుండా ఓట్లేసి గెలిపించిన ప్రభుత్వం ఇష్టారీతిగా వ్యవహరిస్తే దేశం ఏ స్థాయికి దిగజారుతుందో శ్రీలంక అనుభవం మన కళ్లకు కడుతోంది.

అక్కడా మనదేశంలో లాగే అపశ్రుతులు ఉన్నాయి. అయితే కొన్ని మంచి అంశాలు కూడా ఉన్నాయి. మనతో పోలిస్తే విద్య బాగుంటుంది. ఆరోగ్యం మనకంటే మెరుగు, తలసరి ఆదాయం కూడా మనకంటే ఎక్కువ. సహజవనరులు ప్రకృతి రమణీయత ఉన్న పచ్చటి ద్వీపం. కానీ గతంలో చేసిన కొన్ని భయంకరమైన తప్పిదాల వల్ల దేశం సంక్షోభంలో కూరుకుపోయింది. పరీక్షల నిర్వహణకు అవసరమైన కాగితాలు, ఇంకు కూడా లేక పరీక్షలను వాయిదా వేయాల్సిన స్థితికి వెళ్లిపోయింది. ఆయిల్ రేట్లు విపరీతంగా పెరగడంతో స్కూళ్లు, కార్యాలయాలకు కూడా సెలవులు ప్రకటించారు.. బహుశా ప్రపంచంలో ఎక్కడా ఈ తరహా పరిస్థితి ఎదురై ఉండదు.

శ్రీలంకలో రెండే రెండు భాషలు సింహళం, తమిళం. ఆ



రెండు భాషల మధ్య సమన్వయం కుదర్చలేకపోయారు. సింహళభాష ఆధిపత్యం చేయాలని చూడగా 30 ఏళ్లపాటు నరమేధం జరిగింది. అది గతం. కానీ ఇప్పుటి ఆర్థిక సంక్షోభాన్ని పరిశీలిస్తే ప్రధాన కారణాలు ఇవీ...

### తిప్పలు తెచ్చిన అప్పులు

ముందు చూపు లేకుండా ప్రభుత్వాలు వ్యవహరించాయి. ఎడాపెడా అప్పులు చేశాయి. విదేశీరుణం పెరిగిపోవడం, విదేశీ మారకద్రవ్య నిల్వలు పడిపోవడం కారణంగా ఆర్థిక పరిస్థితి మరింత దిగజారింది. ఆ దేశానికి ఉన్న అప్పుల్లో 84 శాతం విదేశీ అప్పులున్నాయి. అదే మన దేశంలో మన అప్పుల్లో 16 శాతం మాత్రమే విదేశీ అప్పులు. 84 శాతం దేశం లోపల తీసుకున్న అప్పులు ఉన్నాయి. దేశంలో అప్పులు తీర్చడం కోసం మంచో చెడో మన తంటాలు మన పడతాం. కానీ విదేశీ అప్పులు తీర్చాలంటే డాలర్లు కావాలి. టూరిజం, ఎగుమతుల ద్వారా డాలర్లు కనుక రాకపోతే దేశం సంక్షోభంలో పడడం అనివార్యం.

శ్రీలంక జాతీయాదాయంలో 10 శాతం టూరిస్టుల ద్వారా వస్తోంది. 2019లో ఈస్టర్ బాంబు దాడులతో శ్రీలంకలో పర్యాటకరంగం పతనం మొదలైంది. ఈ ఉగ్రదాడుల కారణంగా కరోనా కంటే ముందే విదేశీ మారకద్రవ్యాన్ని కోల్పోయింది. మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్టు కరోనా మహమ్మారి ఆ దేశపర్యాటక రంగాన్ని మరింత దెబ్బతీసింది. ఆదాయాన్ని గణనీయంగా కోల్పోయింది.

రెండోది..ఈ ప్రభుత్వం వచ్చాక..జనాకర్షణ కోసమో, వెర్రిమొర్రి ఆలోచనలతోనో తుగ్లక్ చర్యలకు పూనుకుంది..విపరీతంగా పన్నులు తగ్గించింది. ఆదాయం

తగ్గిపోయి..ఖర్చు అలాగే ఉంటే ఆర్థిక సంక్షోభం అనివార్యం అవుతోంది.

### రసాయన ఎరువుల దిగుమతిపై నిషేధం

ఆర్గానిక్ పద్ధతుల్లోనే వ్యవసాయం చేయాలని పేర్కొంది. కచ్చితంగా ప్రకృతితో సమతూకం ఉండాలి. అయితే ఎటువంటి ముందస్తు సన్నద్ధత లేకుండా కేవలం ఒక నెల వ్యవధిలో వ్యవసాయరంగం మొత్తం సేంద్రియపద్ధతిలోకి మారడం వల్ల ఆహార ఉత్పత్తుల దిగుబడిపై ప్రభావం చూపింది. ఒక్కసారిగా దేశంలో ఉత్పత్తి సగం కంటే పడిపోయింది. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఆహార ఉత్పత్తి లేకపోతే తిండిలేక సమాజం మలమలమాడిపోతుంది..దేశం ఛిన్నాభిన్నం అయిపోతోంది. అది అర్థం చేసుకోకుండా..ఒక్కసారిగా సేంద్రియ వ్యవసాయానికి మారడంతో తీవ్ర ఆహార సంక్షోభానికి దారి తీసింది. ఇవన్నీ కలిసి ఆ సమాజాన్ని అతలాకుతలం చేశాయి. అదే సమయంలో రాజకీయ నాయకత్వానికి గనుక విశ్వసనీయత, ప్రతిష్ట ఉంటే సంక్షోభాన్ని ఎలాగోలాగా తట్టుకోవచ్చు. ఏకోన్ముకంగా పోరాడొచ్చు. కానీ ఒకే కుటుంబం ఆధిపత్యంతో అక్కడున్న ప్రభుత్వంపై విశ్వాసం సన్నగిల్లింది..

### పాలన అంతా ఒకే కుటుంబం చేతిలో

రాజకీయం అంతా వారి కుటుంబం చుట్టు తిరుగుతోంది. గటుబోయ రాజపక్స ప్రస్తుత అధ్యక్షుడు. గతంలో ఆయన అన్నగారు రాష్ట్రపతిగా ఉండగా ఈయన రక్షణ మంత్రి. ఆయన అన్నగారు మొన్నటి వరకు ప్రధానమంత్రి..మరో ఐదుగురు కీలక మంత్రులు రాజపక్సలే. వారి పార్టీ కూడా మొత్తం కుటుంబ సొంతం చేసేశారు. అవినీతి కూడా ఉంది. దీంతో ప్రజలకు విశ్వాసం లేకుండా పోయింది. ప్రజలు శాంతియుతంగా నిరసన చేస్తుంటే వారిని తిప్పకొట్టాలని గూండాలను పంపాడు. దీంతో ప్రజల్లో ఆవేశం మరింత పెల్లుబికింది. అప్పటి ప్రధాని నివాసం సహా, రాజపక్స కుటుంబీకుల గృహాలపై ఆందోళనకారులు దాడులకు దిగారు. దీంతో అప్రతిష్ట పాలై ఆర్మీని దింపాడు. తుపాకులతో తాత్కాలికంగా ఏదైనా చేయగలం కానీ సమాజాన్ని నిర్మించలేం. రాజకీయ పరిష్కారం లేకుండా ఆర్థిక సంక్షోభాన్ని సాధించలేం. రాజకీయ పరిష్కారం అత్యవసరం. ప్రధాని రాజీనామా చేస్తే సరిపోదు. అధ్యక్షుడి చేతుల్లో నిజమైన అధికారం ఉంది. ఈ రాజపక్స పోయినా ఆ రాజపక్స ఉన్నాడు..కుటుంబం చేతిలో పాలన ఉంది. కావున ఆయన రాజీనామాకు సిద్ధపడాలి. వెంటనే కాకపోయినా మూడు నాలుగు నెలల్లో రాజీనామా చేస్తానని ప్రకటించాలి. అన్ని పార్టీలతో కలిసి మంత్రివర్గం ఏర్పాటు చేయాలి. సంక్షోభనివారణకు పార్టీల కతీతంగా అందరి సహకారం తీసుకోవాలి. అంతర్జాతీయ సమాజం సూచనలు తీసుకోవాలి. వెంటనే కాకపోయినా మూడు నాలుగు నెలల్లో పరిస్థితిని కొంత చక్కబర్చి ఎన్నికలు నిర్వహించాలి. ప్రజలు స్వేచ్ఛగా ఎన్నికల్లో పాల్గొని కొత్త ప్రభుత్వాన్ని ఎన్నుకునే అవకాశం కల్పించాలి. అప్పుడే అంతర్జాతీయ సమాజానికి నమ్మకం కలుగుతుంది. ఆర్థికసాయానికి ముందుకు రావొచ్చు.

ఇప్పటికే మన దేశం 1.9 బిలియన్ డాలర్లు ఇచ్చింది. మరో 1.5 బిలియన్ డాలర్లు ఇవ్వడానికి సిద్ధపడుతున్నాం. మన శక్తికి మించి సాయం అందిస్తున్నాం. అయితే బయటవాళ్ల సాయం కంటే ఆ దేశం సంక్షోభం నుంచి బయటపడే విధానాలపై ఆలోచించాలి.

1991లో పీవీ నరసింహారావు ప్రభుత్వానికి మెజార్టీ కూడా లేదు. నమ్రతతో వ్యవహరించారు. అన్ని పార్టీలను కలుపుకుపోయారు. పద్ధతి ప్రకారం నిర్ణయాలు తీసుకున్నారు. ఆనాటి సంక్షోభాన్ని గట్టెక్కడమే కాకుండా మౌలిక సంస్కరణలకు నాంది పలికారు. అది లేకపోతే ఈ దేశం ఆ రోజు అధ్వానంగా ఉండేది. దేశంలో ఈ రోజు మనకు పనికొచ్చేది ఏది చూసినా 1991 సంస్కరణల తర్వాత వచ్చిందే. కాబట్టి ప్రభుత్వానికి విశ్వసనీయత ఉండాలి. రాజకీయ స్థిరత్వం ఉండాలి. అన్ని పార్టీలను కలుపుకుని వెళ్లాలి.

### చైనాతో స్నేహం వికటించిందా?

చైనా అమెరికాకు దీటుగా ప్రబలశక్తిగా ఎదగాలని చూస్తోంది. చాలా మేరకు ఎదిగింది. టెక్నాలజీ, సైనిక రంగాలలో కొద్ది పాటి తేడా మినహా ఈ రోజు ప్రపంచంలో అతి ఎక్కువ ఉత్పత్తి చైనాలో ఉంది. అతి ఎక్కువ విదేశీ మారక నిల్వలు చైనాలో ఉన్నాయి. ఇలా అన్ని రంగాల్లో టెక్నాలజీ రంగంలో ఎవరూ పెట్టనన్ని పెట్టుబడులు పెట్టి కొత్త ఆవిష్కరణలకు నాంది పలికింది. యూనివర్శిటీలను బాగు చేసి సైన్ అండ్ టెక్నాలజీ, పరిశోధనలను మెరుగుపరిచి ప్రపంచంలో అప్రతిహతంగా దూసుకుపోతోంది. వారి దగ్గర డబ్బులు విపరీతంగా ఉన్నాయి. భారతదేశం చుట్టుపక్కల ఉన్న దేశాలను వశం చేసుకోవాలంటే ప్రపంచాన్ని శాసించాలి..శ్రీలంకలో ఓడరేవు నిర్మాణం చేశారు..శ్రీలంక అప్పుల్లో 10శాతం చైనా నుంచి చేసినవే.మరీ ఎక్కువ కాదు కానీ గణనీయంగా ఉన్నాయి. చైనా ఎక్కడ పెట్టుబడులు పెట్టినా ఆ దేశ ప్రజలను గౌరవించదని. కేవలం తమ పెట్టుబడులు, లాభాల గురించే ఆలోచిస్తుందని, తమ కాంట్రాక్టర్లు, వర్కర్లనే పంపిస్తుందని, ఉపాధి కూడా తమ వారికే లభించేలా చూస్తుందని..వస్తువులు కూడా తమ కంపెనీల నుంచే కొనుగోలు చేయాలనే నిబంధన పెడుతుందనే పేరు ఉంది. చైనా అప్పులు వల్లే శ్రీలంక పరిస్థితి ఈ విధంగా అయ్యిందనే ప్రచారం కూడా జరుగుతుంది. అయితే ప్రధానంగా అదొక్కటే కాదు. అది కూడా దోహదం చేసింది. అయితే మనం భారతదేశంలో ఉన్నాం కాబట్టి చైనా గురించి ఆ విధంగా మాట్లాడతాం. కానీ మౌలికంగా దీర్ఘ కాలిక సమస్యలు, ఈ ప్రభుత్వం చేపట్టిన మూర్ఖపు నిర్ణయాలు, కోవిడ్ సమస్య..అదే సమయంలో రాజకీయంగా ప్రజల్లో ప్రతిష్టను కోల్పోయిన పరిస్థితి..కుటుంబ పాలన ఇవన్నీ కలిపి ఒక తీవ్రమైన సంక్షోభానికి దారి తీశాయి.

### రాష్ట్రాలకు శ్రీలంక పరిస్థితి వస్తోందా?

మనదేశం శ్రీలంక లాగా అయ్యే పరిస్థితి లేదు. మన విదేశీ

నిల్వలు జాతీయ స్థాయిలో 600 బిలియన్ డాలర్లు ఉన్నాయి. అంటే ఒక సంవత్సర కాలం దిగుమతులు రాకపోయిన సరిపడినన్ని డబ్బులు మన దగ్గర ఉన్నాయి. శ్రీలంక వద్ద కేవలం 2.41 బిలియన్ల విదేశీ మారక నిల్వలు మాత్రమే ఉన్నాయి. మనదేశం నుంచి ఎగుమతులు పెరుగుతున్నాయి. ఆర్థిక ప్రగతి కూడా ఏడు నుంచి ఎనిమిది శాతం పెరిగే అవకాశం ఉంది. విదేశీ మారకద్రవ్యాన్ని సంపాదించగల సామర్థ్యం కూడా మన దేశానికి ఎక్కువ..శ్రీలంతో పోలిస్తే మన దిగుమతులు తక్కువ. శ్రీలంక లాగా నిత్యావసరాలు, ఆహారపదార్థాలను కూడా దిగుమతి చేసుకునే పరిస్థితి మన దేశానికి లేదు.

మనం జాగ్రత్త పడాలి కానీ భయపడాల్సిన పనిలేదు. జాతీయస్థాయిలో కొంత పొదుపరితనం పాటించడం వల్ల కేంద్రంలో కొంత బాగానే ఉంది. కానీ రాష్ట్రాల్లో ఇబ్బందులు ఉన్నాయి. రాష్ట్రాల్లో ఖర్చులు కట్టడి చేయడానికి జాతీయ స్థాయి ప్రభుత్వానికి అలాగే చట్టంలో వెసులుబాటు ఉంది. ఎఫ్ఆర్‌బీఎం చట్టం ఉంది. ఆ చట్టాన్ని తూచా తప్పకుండా పాటించాలి. ఇటీవల కోవిడ్ సంక్షోభం వల్ల కొంత సడలించుకున్నాం..సంక్షోభ సమయంలో ప్రజల్ని ఆదుకోవాలి.. కాబట్టి కొంత సహకరించాలి. కానీ ఇప్పుడు క్రమశిక్షణ పాటించకపోతే సమస్యల్లో పడతాం.

### అప్పులకు ఓ పరిమితి విధించాం

రాజ్యాంగంలో 293(3) అధికరణం ప్రకారం రాష్ట్రప్రభుత్వం అప్పు చేయాలంటే ప్రతీ అప్పుకు కూడా జాతీయస్థాయి ప్రభుత్వం అనుమతి కావాలి. కానీ అప్పుల విషయంలో ఇటీవల కాలంలో పదేళ్లుగా జాతీయస్థాయిలో ఏ పార్టీ ఉన్నా కూడా రాజకీయంగా చూసీ చూడనట్టు వదిలేస్తున్నాయి. రాజ్యాంగపరంగా వారికి ఆ బాధ్యత ఉన్నా కూడా పట్టించుకోవడం లేదు. రాజకీయ అంశాలు కూడా కారణం కావొచ్చు. మనం జాగ్రత్త పడకపోతే సంకటంలో పడతాం. కావున ఇవాళ ఎఫ్ఆర్‌బీఎం చట్టం అమలు, అప్పుల మీద ఉన్న పరిమితిని పాటించేలా జాతీయప్రభుత్వం రాష్ట్రాలను కట్టడి చేయాలి. అయితే ఇది చేసేటప్పుడు మళ్లీ పక్షపాతం అనేది లేకుండా అందరికీ ఒకే నియమాలను పాటించాలి. బహిరంగంగా, పారదర్శకంగా ప్రజల ముందు పెట్టి దాన్ని తూచా తప్పకుండా అమలు చేయాలి. ప్రతీ నెలా కూడా ఏం చేస్తున్నాం..ఎక్కడ అప్పుల కోసం కోరితే అనుమతించాం, ఎక్కడ తిరస్కరించాం..అనుమతించడానికి కారణాలు ఏంటి? తిరస్కరించడానికి కారణాలు ఏంటి? మనకు అర్థం అయ్యేలా చెప్పాలి. లేదంటే రాజకీయమయం అవుతుంది. లేదంటే రోజూ ఉద్యమాలు, ధర్నాలతో దేశ ఆర్థికపరిస్థితి గురించి ఆలోచన ఉండదు. ఆవిధంగా జాతీయస్థాయిలో నియమాలు పాటించినట్టయితే మనం కచ్చితంగా దాన్ని అదుపు చేయగలం. కానీ క్రమశిక్షణ కావాలి. జాతీయస్థాయి ప్రభుత్వం దీన్ని పట్టించుకోవాలి. అది పారదర్శకంగా జరుగుతుందని దేశంలోని అన్ని రాష్ట్రాల ప్రజలకు నమ్మకం ఉండాలి.

## కాలుష్యం కారణంగా దేశంలో 24 లక్షల మంది మృతి

కాలుష్యభూతం మనిషి ప్రాణాలను నిలువునా తీస్తోంది. 2019 సంవత్సరంలో అంతర్జాతీయంగా సంభవించిన ప్రతీ ఆరు మరణాల్లో ఒకదానికి కాలుష్యమే కారణమని లాన్సెట్ తాజా అధ్యయనం వెల్లడించింది. ఆ ఏడాది కాలుష్యం కారణంగా చనిపోయిన 90 లక్షలమందిలో మనదేశ వాసులు సుమారుగా 24 లక్షల మంది ఉన్నట్టు ఆ నివేదిక వెల్లడించింది. ప్రపంచ దేశాలన్నింటిలో 2019లో సంభవించిన కాలుష్య మరణాలు భారత్‌లోనే అత్యధికమని తెలిపింది. కాలుష్య మరణాల్లో అత్యధికం (16.7 లక్షలు) వాయుకాలుష్యం వల్ల జరిగాయని, వాయుకాలుష్య మరణాల్లో అత్యధిక మరణాలు(9.8 లక్షలు) పీఎం2.5 కాలుష్యకాల వల్ల సంభవించాయని వివరించింది. గాలిలో 2.5 మైక్రాన్లు, అంతకన్నా తక్కువ సైజుండే కణాలను పీఎం 2.5 కాలుష్యకాలంటారు.

మిగిలిన వాయు కాలుష్య మరణాలు గృహసంబంధిత వాయు కాలుష్యకాల వల్ల సంభవించినట్లు తెలిపింది. భారత్‌లో 2019లో నీటి కాలుష్యంతో 5 లక్షలు, పారిశ్రామిక కాలుష్యంతో 1.6 లక్షల మంది మరణించారని తెలిపింది. ప్రపంచం మొత్తం మీద 2019లో అన్ని రకాల కాలుష్యాలతో 90 లక్షల మంది మరణించినట్లు నివేదిక తెలిపింది. వీటిలో అత్యధికంగా (66.7 లక్షలు) వాయుకాలుష్యం వల్లనే సంభవించాయి. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో కాలుష్య తీవ్రత అధికంగా ఉందని నివేదిక రూపకర్త రిచర్డ్ చెప్పారు.

భారత్‌లో వాయు కాలుష్యం గంగా సింధు మైదాన ప్రాంతం (ఉత్తర భారతం)లో అధికమని నివేదిక తెలిపింది. ఇళ్లలో బయోమాస్ తగలబెట్టడం వల్ల వాయుకాలుష్య మరణాలు సంభవిస్తున్నాయని తెలిపింది. దేశ వాతావరణంలో కాలుష్య కారకాలు 2014లో గరిష్ఠంగా ఉన్నాయని, ఆ తర్వాత కాస్త తగ్గినట్లు కనిపించినా తిరిగి వీటి సరాసరి పెరుగుతోందని తెలిపింది. భారత్‌లో జాతీయ వాయు శుభ్రతా కార్యక్రమం సహా పలు కార్యక్రమాలను ప్రభుత్వం కాలుష్య నివారణకు చేపట్టిందని, కానీ భారత్‌లో వాయుకాలుష్య నివారణకు బలమైన కేంద్రీయ వ్యవస్థ లేదని నివేదిక తెలిపింది.

ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దేశించిన ప్రమాణాల కన్నా భారత వాతావరణంలో కాలుష్యకాలు ఎక్కువగా ఉన్నాయని పేర్కొంది. అయితే సాంప్రదాయక కాలుష్యకాల వల్ల మరణాలు 2000 సంవత్సరంతో పోలిస్తే ప్రస్తుతం 50 శాతం వరకు తగ్గినట్లు తెలిపింది. ఇదే సమయంలో కాలుష్యం వల్ల ఆర్థిక నష్టం జీడీపీలో ఒక్క శాతానికి పెరిగిందని తెలిపింది. ప్రపంచవ్యాప్తంగా కాలుష్యం వల్ల జరిగిన ఆర్థిక నష్టం 46లక్షల కోట్ల డాలర్లుగా అంచనా వేసింది. అంతర్జాతీయంగా కాలుష్యాల వల్ల మరణాలు ఎక్కువగా ఉన్న దేశాల జాబితాలో అమెరికా 7వ స్థానంలో ఉంది. 2015లో చైనాలో 18 లక్షల మంది కాలుష్యంతో మరణించగా, ఈ సంఖ్య 2019లో 21.7 లక్షలకు పెరిగిందని నివేదిక తెలిపింది. ఇకనైనా మేలుకుని పర్యావరణ పరిరక్షణకు కృషి చేయకపోతే వర్తమానాన్ని, భవిష్యత్తును నష్టపోవాల్సి వస్తోంది.

# వంటనూనెల ధర తగ్గించొద్దు... ఉత్పత్తి పెంచుదాం.. రైతును బతికిద్దాం

## బీదలకు సబ్సిడీపై అందించే ఏర్పాట్లు చేయాలి : డాక్టర్ జయప్రకాష్ నారాయణ్

వంటనూనెల ధరలు సామాన్యుడికి గుదిబండగా మారాయి. గతేడాది కాలంలో మనదేశంలో అన్ని రకాల వంటనూనెల ధరలు దాదాపు 40 శాతానికి పైగా పెరిగాయి. అసలు వంట నూనెల ధరలు ఎందుకు పెరుగుతున్నాయి? వీటిని ఎలా నియంత్రించాలి? ఈ సంక్షోభం నుంచి ఎలా బయటపడాలి..పరిష్కార మార్గాలేంటి?

దేశీయ అవసరాల కోసం దాదాపు 70శాతం వంటనూనెలను ఇతర దేశాల నుంచి భారత్ దిగుమతి చేసుకుంటుంది. మన దేశంలో ఏటా 26 మిలియన్ టన్నుల ఆయిల్ వినియోగం ఉంది. ప్రతీ ఏడాది ఒకటో రెండో మిలియన్ టన్నుల వినియోగం పెరుగుతుంది. అయితే ఇందులో మన ఉత్పత్తి కేవలం 11 మిలియన్ టన్నులు మాత్రమే. 14 మిలియన్ టన్నుల ఆయిల్ ఇతర దేశాలనుంచే దిగుమతి చేసుకుంటున్నాం. 2020-21 ఏడాది లక్షా 20 వేల కోట్ల రూపాయల ఆయిల్ దిగుమతి చేసుకున్నాం. ఇందులో ఎక్కువ భాగం పామాయిల్. ప్రధానంగా ఆరు దేశాల నుంచి మనం ఆయిల్ దిగుమతి చేసుకుంటున్నాం. ఇండోనేషియా, మలేషియా నుంచి పామాయిల్, రష్యా, ఉక్రేయిన్ నుంచి సన్‌ఫ్లవర్ ఆయిల్, బ్రెజిల్, అర్జెంటీనా నుంచి సోయాబీన్ ఆయిల్ దిగుమతి చేసుకుంటున్నాం.

**ప్రస్తుత సంక్షోభానికి కారణం ఏంటి?**

వంట నూనె కోసం ఎక్కువగా విదేశాలపై ఆధారపడుతున్న నేపథ్యంలో ఆయా దేశాల నిబంధనల్లో ఏ చిన్న మార్పులు సంభవించినా.. భారత్‌లోని వంట నూనెల ధరలు ప్రభావితం అవుతున్నాయి. ఉదాహరణకు పామాయిల్ సేద్యంలో అగ్రగామిగా ఉన్న మలేసియాలో లాక్‌డౌన్ కారణంగా పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఫలితంగా అక్కడ దిగుబడి తగ్గిపోయి..కొరత ఏర్పడింది. దాని ప్రభావం అక్కడి నుంచి దిగుమతి చేసుకుంటున్న భారత్‌పై అనివార్యమైంది. యుద్ధం కారణంగా ఉక్రేయిన్, రష్యాలో సన్‌ఫ్లవర్ పంటలు దెబ్బతిన్నాయి. దాని ప్రభావం కూడా భారత్‌లో వంటనూనెల ధరలపై పడింది. గతంలో మనదేశంలో ఆహారధాన్యాలతో పాటు నూనె గింజలను విధిగా పండించేవారు. కానీ ఇటీవల కాలంలో వేరుశనగ, సన్‌ఫ్లవర్, పామాయిల్ పండించే రైతుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. సరిగా దిగుబడి రాకపోవడం, గిట్టుబాటు ధరలు లభించకపోవడంతో తమ అవసరాల మేరకు తక్కువ విస్తీర్ణంలోనే పండిస్తున్నారు. గతంతో పోల్చుకుంటే వినియోగం అధికమైంది. ఓ వైపు వినియోగం పెరగడం, మరోవైపు ఉత్పత్తి తగ్గిపోవడంతో



వంటనూనె ధరలు అమాంతం పెరిగిపోయాయి. వంటనూనెల ధరలు అదుపులో ఉండాలంటే ముఖ్యంగా దేశీయ ఉత్పత్తిని పెంచి, దిగుమతిని వీలైనంత వరకు తగ్గించుకోవాలి.

**పదేళ్ల పోరాటం ఫలించింది**

దిగుమతుల వల్ల ఆదేశంలో రేటు మన దేశంలో సాధ్యం కాదు. మన రైతును ప్రోత్సహించాలి... మన రైతుకు రేటు నిలబడాలి అంటే..దిగుమతి సుంకాలు వేయాలి. ఇంత పెద్ద ఎత్తున ఏటా ఇతర దేశాల నుంచి మనం ఆయిల్‌ను దిగుమతి చేసుకుంటున్నా ఇటీవల వరకు దిగుమతి సుంకాన్ని కేంద్రం విధించలేదు. కానీ ఆ దేశాలు ఎగుమతి సుంకాన్ని విధించాయి. ఇండోనేషియా, మలేషియా దేశాలు భారతదేశం ఎలాగూ ఆయిల్ కొంటుంది కాబట్టి ఎగుమతి సుంకాలు వేశాయి. ప్రపంచంలో ఎక్కడా కూడా వ్యవసాయ వస్తువుల మీద ఎగుమతి సుంకాలు లేవు. కానీ మనం ఆయిల్‌ను గతిలేని పరిస్థితుల్లో కొంటాం కాబట్టి ఎగుమతి సుంకం వేశారు. ప్రభుత్వాల అనాలోచిత నిర్ణయాల కారణంగా వాటిని భరించాం. కానీ మనం దిగుమతి సుంకాన్ని వేయలేదు. సుంకం వేయాలని కోరిన నేపథ్యంలో కొంతకాలం పాటు రిఫైండ్ అయిల్ మీద వేశారు. ఫ్యాకర్టీలకు నష్టాలు వస్తాయని క్రూడాయిల్ మీద వేయలేదు. అయితే మనదేశంలో ఫ్యాక్టరీలకు నష్టాలు రావాలని మనం కోరుకోకూడదు..మన వాళు లాభ పడాలి. అయితే అదే సమయంలో క్రూడాయిల్‌పై కూడా వేసి రైతులకు లాభం చేకూర్చేలా చేస్తే న్యాయం జరిగేది. తర్వాత తర్వాత జ్ఞానోదయం అయి దిగుమతి సుంకాలు వేశారు.

దిగుమతి సుంకం విధించాలని పదేళ్లుగా లోక్‌సత్తా, ప్రజాస్వామ్య పీఠం(ఎఫ్‌డీఆర్) తరఫున అనేక విజ్ఞప్తులు చేశాం. గతంలో వాణిజ్యశాఖమంత్రిగా ఉన్న ప్రస్తుత ఆర్థికశాఖ మంత్రి

నిర్మలాసీతారామన్, ఆశాఖ కార్యదర్శికి లేఖలు రాశాం. పదేళ్ల పోరాటం అనంతరం ఎట్టకేలకు కేంద్రం దిగుమతి సుంకం విధించింది. లోక్‌సత్తా, ఎఫ్‌డీఆర్‌ల ప్రయత్నం ఫలించింది. అయితే ఆ డబ్బును పూర్తిగా ఆ పంటలు వేసిన రైతులకు పంచితే ..వారు మరింత సంతోషంగా పంటలు వేస్తారు..మన దేశంలో నే నూనె ఉత్పత్తి పెరుగుతుంది. కానీ ప్రభుత్వాలు ఆ పని ఇప్పటి వరకు చేయలేదు. అరకొరగా మాత్రమే చేస్తున్నారు.

**బహిరంగ మార్కెట్‌లో ధర తగ్గించకుండా..**
**రైతుకు మేలు చేయాలి**

మార్కెట్‌లో ఆయిల్ ధరలు పెరిగాయి కావున వినియోగదారుల కోణంలో ఆలోచించి ధరలు తగ్గిస్తే..మన దేశంలో ఉత్పత్తి పెరగదు. ధర తగ్గించకుండా ఉత్పత్తి ఎలా పెంచాలనేది కీలకాంశం. ప్రభుత్వాలు ఈ అంశంపై దృష్టి సారించాలి. అయితే ఇటీవల ప్రభుత్వం ఆయిల్ ధరలు తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. ద్రవ్యోల్బణం, ప్రత్యేక పరిస్థితుల నేపథ్యంలో ఇలాంటి నిర్ణయాలు తీసుకుని వినియోగదారులకు ఊరట కలిగించే చర్య కొన్ని సందర్భాల్లో సముచితమే. అయితే ఇది తాత్కాలికం మాత్రమే.

ఎప్పుడో 30 ఏళ్ల క్రితం 80వ దశకంలో ఆయిల్ సీడ్స్ మిషన్ పెట్టారు. కానీ ఆశించిన ఫలితాలు రాలేదు. అర్ధమనస్కంగానే పని జరుగుతోంది. ఫలితంగా మన దేశంలో ఆయిల్ ఉత్పత్తి పెరగలేదు. దిగుమతి మాత్రం ఏటా పెరుగుతోంది. ఈ పరిస్థితిని మార్చాలి. తెలివిలేక, ఉత్పత్తి లేక కొనేవాళ్లుగానే ఏళ్ల తరబడి మిగిలిపోతున్నాం. ఈ పరిస్థితిలో మార్పు రావాలి..మనదేశంలో ఉత్పత్తి పెరగాలి. అయితే దీనికి మాటలు ఆర్భాటంగా ఉంటే ఫలితం రాదు.

**ప్రధానంగా రెండు అంశాలపై దృష్టి సారించాలి**

మొదటిది: బహిరంగ మార్కెట్‌లో ఆయిల్ ధరలు తగ్గించకుండా రైతులకు ప్రోత్సాహకాలు అందిస్తూ ఉత్పత్తిని పెంచడం, రెండోది: పెరిగిన ధరల భారంతో ఇబ్బంది పడుతున్న బీదలకు సబ్సిడీపై ఆయిల్‌ను అందించడం. ఈ రెండు అంశాలపై ప్రభుత్వాలు దృష్టి సారించాలి.

ఎట్టి పరిస్థితుల్లోనూ దేశంలో ధర తగ్గించే ప్రయత్నం చేయకూడదు. గతంలో ఇలాగే పిచ్చిపిచ్చిగా చేసే సరికి రైతుకు ధర లేకుండా పోయింది. పామాయిల్ పంటకు ధర లేకపోవడంతో పశ్చిమగోదావరి జిల్లాలో అదనంగా నష్టాన్ని భరించి ఎదిగిన పామాయిల్ పంటను నరికి బయటపాడేశారు. విపరీతంగా దిగుమతులు చేసుకుంటున్న దేశంలో రైతులను ప్రోత్సహించకుండా పంటలకి పంటలు నాశనం చేసుకునే పరిస్థితికి తీసుకొస్తే సంక్షోభం ఎందుకు రాదు. ఈ పరిస్థితిని మన పాలకులే తీసుకువచ్చారు.

అయితే ఈ రోజు పరిస్థితిలో కొంత మార్పు వచ్చింది. ఏపీలో ప్రభుత్వం, ఆయిల్‌ఫెడ్ ఛైర్మన్ విజ్ఞతతో వ్యవహరించిన కారణంగా పరిస్థితి కొంత మెరుగ్గా ఉంది. అయితే రేటు బాగున్నంత మాత్రాన ఉత్పత్తి పెరగదు. పంట చేతికి రావడానికి నాలుగైదేళ్లు పడుతోంది. దానికి ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రోత్సాహకాలు ఇవ్వాలి. రేటుతో పాటు కొంత ఖర్చు భరిస్తామని ప్రభుత్వాలు ముందుకు రావాలి. రేటు మాత్రం తగ్గించకూడదు. బీదలను ఆదుకోవాలి. దిగుమతులు పెరిగిన కారణంగా కేంద్రానికి రూ. 75 వేల కోట్లు అదనంగా ఆదాయం వస్తోంది. దీన్ని సబ్సిడీగా చేసి రేషన్ కార్డులు ఉన్న బీదలకు సబ్సిడీపై ఆయిల్‌ను అందించాలి. బహిరంగ మార్కెట్‌లో మాత్రం రేటు తగ్గించకూడదు. రేటు తగ్గిపోయి వ్యవస్థను నాశనం చేసే పరిస్థితి తీసుకొస్తే రైతు మళ్లీ తీవ్రంగా మునిగిపోయే పరిస్థితి వస్తోంది. రేటు నిలబెట్టడం ఎలా..రైతులు ఆ పంటలను వేసేలా ప్రోత్సహించడం ఎలా? రెండోది సామాన్యుడ్ని ఆదుకోవడం ఎలా? ఈ రెండింటిని వేర్వేరుగా చూడాలి. సామాన్యుడ్ని ఆదుకునే క్రమంలో రేటు తగ్గిపోయేలా చూస్తే వ్యవసాయం పూర్తిగా నాశనం అయిపోయి అటురైతులు సంక్షోభంలో పడిపోతారు. ఫలితంగా మరింతగా దిగుబడులు పెరిగి రేట్లు ఇంకా పెరుగుతాయి. కాబట్టి రెండింటిని సమతూకంతో చేయాలి.

**తాత్కాలిక తాయిలాలు కాదు..దీర్ఘకాలిక విధానాలు కావాలి**

దీర్ఘకాలిక వైఫల్యం వల్ల ఇప్పటికే చాలా నష్టపోయాం. వ్యవసాయం అనేది పరిశ్రమలా కాదు... ప్రకృతి మీద ఆధారపడి ఉంటుంది. గతేడాది రేటు మీద ఆధారపడి ఉంటుంది. సంక్షోభం వచ్చినప్పుడల్లా ఉత్పత్తి పెరగమంటే పెరగదు..దీర్ఘకాలిక విధానాలు అవసరం..అదే సమయంలో తాత్కాలికంగా రైతులను ఆదుకోవడం ముఖ్యం. వ్యవసాయరంగానికి మనం ఇప్పటి దాకా చేసిన అన్యాయాన్ని దేశం వివిధ రూపాల్లో అనుభవిస్తోంది. ఇప్పటికైనా మేలుకుని నిజంగా వ్యవసాయరంగాన్ని ఆదుకోవాలి..రైతుకు రేటు వచ్చే విధానం ఎలాగో ఆలోచించాలి. దాన్ని విస్మరించి రైతు నష్టపోయినా పర్వాలేదనే స్థితికి వచ్చాం ..వినియోగదారుడ్ని ఆదుకోవడం ఎలా అని ఆలోచిస్తున్నారు.

పంటకు రేటు ఉంది..పంట పండిస్తే నాకు లాభం వస్తోంది అంటే రైతు బంగారం పండిస్తాడు..ధైర్యంగా పెట్టుబడులు పెడతాడు... ఈ పూట ఎలాగోలాగా వినియోగదారుడ్ని తృప్తి పరచాలని అనుకుంటే ఇవాళ, రేపు కూడా ఉత్పత్తిదారుడు నష్టపోతాడు..వినియోగదారుడికి తాత్కాలికంగా ఉపశమనం లభించినా దీర్ఘకాలంలో నష్టపోతాడు.. కావున తాత్కాలిక విధానాలకు స్వస్తి పలికి దీర్ఘకాలిక ప్రయోజనాలపై దృష్టి పెట్టాలి. ఉత్పత్తి పెంచే దిశగా ప్రభుత్వాలు రైతులకు ప్రోత్సాహకాలు అందిస్తే రైతులకు మేలు జరుగుతుంది..ఉత్పత్తి పెరిగి వినియోగదారుడికి ధరలు అందుబాటులోకి వస్తాయి. ✦

# నినాదాలు కాదు.. లోతైన విధానాలు కావాలి

## గోధుమల ఎగుమతిపై నిషేధం వల్ల రూ.కోట్లలో నష్టపోయిన రైతులు

రైతుకు ఆదాయం ఎలా వస్తోంది..మనం ఉత్పత్తి చేసింది అమ్మితే! రైతు ఉత్పత్తి ఏంటి..వరి, గోధుమ, గుడ్లు, పాలు, పత్తి, కూరగాయలు మొదలైనవి!!

దిగుబడి పెరిగి మంచి రేటు ఉంటే ఆదాయం వస్తోంది. దిగుబడి తగ్గినా రేటు వస్తోంది. అయితే దిగుబడి మన చేతుల్లో లేదు. ప్రకృతి వైపరీత్యాలు, చీడపీడలు వంటి రకరకాల సమస్యలు ఉన్నాయి. ప్రకృతి మనకు ఎప్పుడూ అనుకూలించదు. కొన్ని సందర్భాల్లో బాగుంటుంది. మరికొన్ని సందర్భాల్లో బాగుండదు. అయితే మన కృషి ఎంత అద్భుతంగా ఉన్నా ఏటా ఇంత దిగుబడి వస్తోందని చెప్పే పరిస్థితి లేదు. ఇది మన దేశంలోనే కాదు..ప్రపంచం ఎక్కడా చెప్పలేం. కిలోకు గానీ క్వింటాకు గానీ ఎంత ధర పెరిగితే అంత ఆదాయం వస్తోంది. వ్యవసాయ రంగంలో ఉన్న వారికి ఆదాయం పెరగపోతే, వారు పండించిన వస్తువుకు రేటు రాకపోతే వారు ఎలా బతుకుతారు? గ్రామాల ఆదాయం పెరగడం లేదు. తలసరి ఆదాయం పడిపోతోంది, దేశ సంపదలో గ్రామాల వాటా తగ్గిపోతుంది, మిగతా వాళ్లతో పోలిస్తే గ్రామాల్లో ఉన్న వారి తలసరి ఆదాయం ఐదోవంతు ఉందని అందరూ చెబుతారు. అది పెరగాలనే మన ప్రయత్నం. కానీ చాలా సందర్భాల్లో ప్రభుత్వ విధానాలు రైతు వ్యతిరేకంగా ఉంటున్నాయి. రైతులు, రైతు సంఘాలు, రాజకీయ పార్టీలు, పత్రికలు కూడా ఈ విషయాన్ని పట్టించుకోవడం లేదు. పైపైనే మనం ఆలోచిస్తున్నాం. రైతులకు మేలు జరగాలని అందరూ చూస్తున్నారు. కానీ అమ్మే రేటు బాగుంటే, వస్తువుకు గిరాకీ ఉంటే ఆదాయం వస్తోంది. ఆదాయమే వారికి చేసే మేలు. మనం చెప్పే మాటలు కాదు..కార్చే కన్నీరు కాదు..చూపే సానుభూతి కాదు. ఉత్పత్తి చేసే మనిషికి తన ఉత్పత్తికి మంచి రేటు వస్తే ఆదాయం పెరుగుతుంది. ఇది కీలకమైన విషయం.

**గోధుమల ఎగుమతిపై నిషేధం**

గోధుమ, వరి కనీస మద్ధతు ధరకు ప్రభుత్వం కొనాలని




డిమాండ్ చేస్తున్నాం..అయితే ఆ ఆలోచనే సరైంది కాదు. మార్కెట్‌లో గిరాకీ లేదనుకుంటే కొనేవాడు లేనప్పుడు ప్రభుత్వం వాటిని ఎక్కడ పెడుతోంది. ఇప్పటికే సగానికి పైగా గోడౌన్‌లకు పైకప్పులు లేవు. ఎండకు, వానకు తడిసి కుళ్లిపోతున్నాయి. తాత్కాలికంగా రైతును ఆదుకుంటుంది కానీ దీర్ఘకాలికంగా అది పరిష్కారం కానే కాదు. ధర పెరగడం, ధర పెరిగే పంటలను పండించడం, ఏ ఉత్పత్తులకు గిరాకీ ఉందో వాటిని పండించేందుకు రైతులకు ప్రోత్సాహం ఇవ్వడం, మన దేశంలో ధర లేకపోతే ఇతర దేశాల్లో ధర ఉంటే అక్కడ అమ్ముకునే అవకాశం కల్పించడం. మన దేశంలో ఉత్పత్తి తక్కువగా ఉంటే ఉదాహరణకు వంటనూనెల వంటివి..దిగుమతి చేసుకుని దిగుమతి సుంకం వేయడం, మన రైతులకు రక్షణ ఇవ్వడం. లేకపోతే మన దేశంలో ఉత్పత్తి ఇంకా తగ్గిపోతుంది. మన రైతులు నష్టపోతారు. దేశం నష్టపోతుంది. కాబట్టి విధానాలు ఆ రంగాన్ని బట్టి ఉండాలి. మన ఉత్పత్తి ఎక్కువగా ఉంటే ఎక్కడ రేటు ఉంటే అక్కడ అమ్ముకునే ఏర్పాట్లు చేయడం, మన ఉత్పత్తి తక్కువ ఉంటే దిగుమతి చేసుకున్నా ఇక్కడ ధర పడిపోకుండా కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం..ఇవి కనీస అవసరాలు. ఇప్పుడు ప్రభుత్వం ఏం చేసింది. అంతర్జాతీయ మార్కెట్‌లో గోధుమ

ధర 54 శాతం పెరిగింది. గతంలో 100 ఉంటే ఇప్పుడు 154 రూపాయలు అయింది. మే నెలలో యూరప్ గోధుమ ధర క్వింటాలుకు రూ. 3600 పలుకుతోంది. గోధుమ కనీస మద్దతు రూ. 2100. ప్రభుత్వం ఈ ధరకు మన దగ్గర కొనాలంటున్నాం. ప్రభుత్వం ఎప్పుడు కొనాల్సి వస్తోంది..మార్కెట్‌లో రేటు లేకపోతే, రైతు తీవ్రంగా నష్టపోతుంటే ఆ రేటు నిలబడడం కోసం ప్రభుత్వం కొనాలి. కానీ ప్రభుత్వం ఊరికే కొని ఎండకు వానకు తడుస్తూ ఉంటే మన డబ్బే వృథా అవుతుంది. మన పన్నుల డబ్బే. మరి మార్కెట్‌లో రేటు బాగుండి మన వస్తువు ఎగుమతి ఆపేస్తే రేటు పడిపోతుంది. ప్రభుత్వం వద్ద 3 కోట్ల 3 లక్షల టన్నుల గోధుమ నిల్వలున్నాయి. ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా పంపిణీ, అసాధారణ ముప్పు వంటివి వచ్చినా తట్టుకునే విధంగా ప్రభుత్వం దగ్గర కావాల్సింది 2 కోట్ల 75 లక్షల టన్నులు. రబీలో గోధుమ సేకరణ ఇంకా జరగలేదు. ఇంకా బోల్డంత కొనుగోళ్లు జరుగుతాయి. ఈ కొనుగోళ్లు జరగపోయినా ప్రభుత్వం దగ్గర ఉండాల్సిన దానికంటే ఇంకా ఎక్కువ నిల్వలున్నాయి.

మన ప్రభుత్వం మద్దతు ధర రూ. 2100 ఇస్తోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో రూ. 3600 పలుకుతోంది. మన ప్రభుత్వం ఇచ్చే రేటు కంటే క్వింటాలుకు రూ. 1500లు అంతర్జాతీయ మార్కెట్‌లో రేటు ఎక్కువగా ఉంది. అలాంటప్పుడు రైతుల మీద ప్రేమ ఉంటే దగాపడిన, నష్టపోతున్న రైతులకు ఆదాయం పెరగాలి, అవకాశం ఉంటే ఆదాయం పెరిగే ఏర్పాట్లు చేయాలి అనుకుంటే మార్కెట్‌లో రూ. 3600 ఉన్నచోట అమ్ముకోవద్దని నిషేధించి రూ. 2100కే మేం బలవంతంగా కొంటాము అంటే ఇది ధర్మమేనా? ఒక్కసారి లోతుగా ఆలోచించండి. పంట రానినాడు ఎలాగూ రైతు నష్టపోతున్నాడు. రేటు వచ్చిన నాడు ఎగుమతులపై నిషేధం విధించి అమ్ముకోకుండా చేస్తే, గతంలో పక్క రాష్ట్రాలకు వెళ్లి అమ్ముకోవడానికి లేదు. పదేళ్ల క్రితం ఆంధ్రప్రదేశ్‌లో అదే చేశారు. ఇక్కడ ధాన్య ం బస్తా రూ. 750 ఉంది. పక్క రాష్ట్రాల్లో రూ. 1200 ఉంటే అక్కడ అమ్ముకోకుండా నిషేధించారు. రాష్ట్రాల మధ్య నిషేధించారు. అప్పుడు లోక్‌సత్తా అధ్యక్షుడు జయప్రకాశ్ నారాయణ్ పాదయాత్ర చేసి రైతులందరినీ సంఘటిత పరిచి ఉద్యమం చేసి ఆ ఆంక్షలను ఉల్లంఘిస్తే అప్పుడు రేటు సమానం అయి ఇక్కడా రూ. 1200కు పెరిగింది. దాంతో రైతులకు ఆ ఏడాది రూ. 3600 కోట్లు అదనంగా ఆదాయం వచ్చింది. ప్రభుత్వం ఒక్క పైసా ఇవ్వలేదు. కేవలం మార్కెట్‌లో డిమాండ్ ఎంత ఉందో ఆ మేరకు రేటు వచ్చే ఏర్పాటు జరిగితే రూ. 3600 కోట్లు వచ్చింది. ఇప్పుడు కూడా అంతే గోధుమ ప్రస్తుతం రూ. 3600 పలుకుతోంది. ఇది పెరుగుతుంది తప్ప తగ్గదు. ఈ విధంగా లెక్కేస్తే టన్నుకు రూ. 15 వేలు తేడా వస్తోంది. మనం ఈ సంవత్సరం కోటి టన్నులు అమ్మితే రూ. 15 వేల కోట్లు ..ఈ రేట్లో తేడా వల్ల రైతులకు అదనంగా ఆదాయం వస్తోంది. కోటిన్నర టన్నులు అమ్మితే రూ. 22 వేల కోట్లు. ఒక్క సీజన్‌లో పంట అమ్మితే ఈ లాభం వస్తోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో రేటు ఉన్నా కూడా అమ్ముకోవడానికి లేకుండా చేస్తే ఈ ఒక్క సీజన్‌లో రైతులకు వచ్చే కనీస నష్టం రూ. 15 వేల నుంచి 22 కోట్లు. ఒక్క కలం పోటుతో ఈ నిర్ణయం చేయగలిగారు.

అయితే కొంతమంది లోతుగా ఆలోచించకుండా ప్రశ్నలు లేవనెత్తుతారు. ఈ లాభం అంతా దళారులకు వస్తోందంట కదండి. రైతులకు కాదంట కదా? అని అడుగుతారు. మార్కెట్‌లో చాలా మంది ఉంటారు. ఉత్పత్తి చేసే రైతు ఉంటాడు. ఆయన దగ్గర కొనుగోలు చేసే ట్రేడర్ ఉంటాడు. ఈ మొత్తాన్ని కలిపి గంపగుత్తగా కొనుగోలు చేసే మనిషి ఇంకొకరు ఉంటారు. ఆయన అక్కడి నుంచి రిటైల్ వారికి సరఫరా చేస్తారు. అక్కడి నుంచి వాళ్లు అమ్ముతారు. ఈ లాభం పెరిగితే అందరూ పంచుకుంటారు. రైతు వాటా రైతుకు వస్తుంది. మన ప్రయత్నం రైతు వాటా పెంచాలని, దానికి మార్గం రేటు తగ్గించేయడం కాదు. ఎంత ఎక్కువగా మార్జిన్ ఉంటే అంత ఎక్కువగా రైతుకు ఆదాయం వస్తుంది. రైతుకు ఆదాయం కావాలంటే దళారులు లేని రిటైల్ చైన్స్ పెడదాం. రైతుకు వినియోగదారుడికి మధ్య ఒకే ఒక్క మధ్యవర్తి ఉంటాడు. వాళ్లే వస్తువులు కొంటారు. వాళ్లే గ్రేడింగ్ చేస్తారు. ప్యాకేజింగ్‌చేస్తారు. రవాణా చేస్తారు. అవసరమైతే స్టోరేజీ చేస్తారు. కొన్ని వ్యవసాయ ఉత్పత్తుల్లో ప్రాసెసింగ్ చేస్తారు. రిటైలింగ్ వారే చేస్తారు. ఇతర మార్కెట్లలో అవకాశం ఉంటే వారే ఎగుమతి చేసి అమ్ముతారు. అంతా వాళ్లే చేస్తారు. మార్జిన్స్ తక్కువ ఉంటాయి..వాల్యూమ్స్ ఎక్కువ ఉంటాయి. ఎక్కువ ఉత్పత్తులను కొని అమ్ముతారు. ఒకొక్క యూనిట్‌కు లాభం ఎక్కువ ఉండదు. మొత్తం మీద వ్యాపారం పెద్దది ఉంటుంది. ఎక్కువ లాభం రైతుకు వస్తోంది. దాన్నే మనం అడ్డుకుంటున్నాం. ప్రతీదానికి వంకలు పెట్టి రైతుకు ఆదాయం లేకుండా చేస్తే ఎలా? మార్కెట్‌లో రేటు పెరిగితే రైతుకు ఆదాయం రాదు అంటే రైతుకు ఏనాడు ఆదాయం రాదు. వ్యవసాయం వద్దని చెబుతామా? ఏం వాదన అది. టమాటా ఒక్కోసారి కిలో 50 పైసలకు పడిపోతోంది. అప్పుడు రైతుకు వచ్చేది సున్నా? అదే మార్కెట్‌లో కిలో రూ. 50 ఉంటే రైతుకు కచ్చితంగా కొంత వస్తోంది. రైతుకు ధర పెరుగుతుందా? లేదా? కాబట్టి మార్కెట్‌లో ధర పెరిగితే రైతుకు ధర పెరుగుతోంది. రైతు వాటా పెంచాలంటే రిటైల్ చైన్స్ పెడదాం. మధ్య దళారుల పాత్ర తగ్గిద్దాం. అంతేకానీ మార్కెట్‌లో రేటు పెరిగినా రైతుకు రేటు రాలేదనేది వితండ

వాదం. అలాంటప్పుడు ఉత్పత్తి చేయడం ఎందుకు?

**రెండోది** : కొంతమంది లేవనెత్తే సందేహం ఏంటంటే..మరి ఈ దేశంలో రేట్లు పెరుగుతున్నాయి కదా అని..అవ్వా కావాలి..బువ్వ కావాలి అంటే ఎలా? రైతుకు ఆదాయం పెరగాలంటే వ్యవసాయ వస్తువుల రేటు పెరగాలి. మరి నా ఇంట్లో నేను తినే వస్తువుకు రేటు పెరగడానికి వీలు లేదు..రైతుకు ఆదాయం రావాలి అంటే ఎలా? కర్ర విరగకూడదు..పాము చావకూడదు అంటే ఎలా అవుతుంది. భారతీయ సమాజం రైతును బాగు చేయాలి..రైతులు నష్టపోతున్నారు..గ్రామీణ సమాజం నష్టపోతోంది అన్నట్టయితే మిగతా ఇబ్బందులు కొన్ని ఉన్నా రైతుకు రేటు రావాలి.. మౌలికమైన సమస్య దేశంలో వ్యవసాయరంగం నాశనం అయిపోతోంది. ఆ రేటు పెరగడానికి విధానం కావాలి. అదే సమయంలో బీదలను కాపాడాలి. వినియోగదారుల్లో బీదలు ఉండి రేటు పెరిగిపోయి తినలేకపోతే అన్యాయం. నూటికి 80 మందికి ఉచితంగానో, చాలా ఎక్కువ సబ్సిడీతోనో సరఫరా చేస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లో బియ్యం కేజీ రూపాయికి ఇస్తున్నారు. దేశంలో వివిధ పథకాల ద్వారా నిరుపేదలకు అయితే ఉచితంగానే ఇస్తున్నారు. అన్నపూర్ణ, అంత్యోదయ వంటి పథకాలను అమలు చేస్తున్నారు. కోవిడ్ నేపథ్యంలో రెండేళ్ల కాలంలో 70-80 కోట్ల మందికి ప్రతీ నెలా ఉచితంగా బియ్యం, గోధుమలు పంపిణీ చేస్తున్నారు. కాబట్టి నిరుపేదలకు ఈ ఆహారం కొరత లేకుండా ఉండాలంటే మన దేశంలో పౌరసరఫరాల పంపిణీ వ్యవస్థ ఉంది. ఆ అవసరం మేరకు ప్రభుత్వం రేటు తగ్గించి అమ్మాలి. అంతేకానీ మార్కెట్‌లో రేటు తగ్గించకూడదు. అలా చేస్తే రైతులంతా నాశనం అవుతారు. ప్రభుత్వం రేటు తగ్గించకపోతే సబ్సిడీ చేసుకుని పన్నుల డబ్బుల నుంచి బీదలకు పంపిస్తోంది. కాబట్టి ఇటు రైతు ప్రయోజనాన్ని కాపాడిన వాళ్లం అవుతాం. రేటు పెరిగితే రైతుకు రేటు వస్తోంది. అటు బీదలకు ఇబ్బంది లేకుండా చూడగలుగుతాం. అందుకే కదా ఇంత పెద్ద పంపిణీ వ్యవస్థ ఉంది. ఇన్ని లక్షల కోట్లు ఖర్చుపెడుతోంది. అది పరిష్కారం. మనం ఆర్థికశాస్త్రాన్ని అర్థం చేసుకోవాలి. వెయ్యి ఏళ్ల క్రితం కావచ్చు..వందేళ్ల క్రితం కావచ్చు..మన రాష్ట్రంలో కావచ్చు..లేదా మన ఊళ్లో కావచ్చు..మనదేశంలో కావచ్చు..వేరే దేశంలో కావచ్చు. కొన్ని మౌలికమైన ఆర్థిక సూత్రాలు ఉన్నాయి. మార్కెట్‌లో గిరాకీకి సరఫరాకీ మధ్య సంబంధమే ధర. గిరాకీ ఎక్కువై సరఫరా తక్కువ ఉంటే ధర పెరుగుతుంది. సరఫరా ఎక్కువై గిరాకీ తగ్గితే ధర తగ్గుతుంది. వీలున్నంత మేరకు ధర పెంచడం ఎలా? ఆ వచ్చే ధరలో రైతు వాటా పెంచడం ఎలా? చేసిన ఉత్పత్తికి విలువను పెంచి మరింత ఎక్కువ విలువను తీసుకొచ్చి ఆ రేటు బాగా వచ్చేలా చేయడం ఎలా? నిరుపేదలకు నిత్యావసరవస్తువులు , జీవనాధారమైన ఆహారం విషయంలో కొరత లేకుండా మనకు బలమైన ప్రజాపంపిణీ వ్యవస్థ ఉంది కాబట్టి దాన్ని ఉపయోగించి బీదలకు ఇబ్బంది లేకుండా చేయడం ఎలా? ఇవి సమన్వయం చేయాలి. రైతుకు కష్టం వస్తే రైతు గురించి గుండెలు బాదుకుంటాం? ధరలు పెరిగాయంటే వాటి గురించి ఆందోళనలు చేస్తాం..గుండెలు బాదుకుంటాం. మరోక చోట ఏదో జరిగిందంటే అక్కడికి వెళ్లి గుండెలు బాదుకుంటాం. అన్నిచోట్లా గుండెలు బాదుకోవడం తప్ప పరిష్కారాలు రావడం లేదు. గుండెలు బాదుకోవడం కాదు మనకు కావాల్సింది గుండె లోతుల్లోకి వెళ్లాలి. నిజాయితీగా వాస్తవాల్ని పరిశీలించాలి. వ్యవసాయరంగం ఈ దేశంలో తీవ్రమైన సంక్షోభంలో ఉంది. దానికి కులం లేదు మతం లేదు ప్రాంతం లేదు. దేశం అంతా అదే రీతిలో ఉంది. అక్కడ రేట్లు పెరిగే మౌలికమైన విధానం కావాలి. రైతు వాటా పెంచేది మౌలిక విధానం కావాలి. రైతు వాటా పెంచుతూ రేట్లు పెరిగినట్టయితే వినియోగదారుల మీద అంత ఎక్కువ భారం పడదు. ప్రాసెసింగ్ లాంటివి చేసినట్టయితే మార్కెట్‌లో రేటు పెరిగినప్పుడు ప్రాసెస్డ్ వస్తువులు వస్తాయి కాబట్టి వినియోగదారులకు రేటు పెరగదు. ప్రాసెసింగ్ జరుగుతుంది కాబట్టి రేటు తగ్గినప్పుడు రైతుకు రేటు నిలబడుతుంది. ఎక్కడ మార్కెట్‌లో రేటు ఉంటే అక్కడ అమ్ముకునే అవకాశం ఇస్తే రేటు నిలబడుతుంది. బీదలకు ఇబ్బంది లేకుండా చేయాలంటే ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా బీదలకు సబ్సిడీ ద్వారా తక్కువ ధరకు అందేలా ఏర్పాట్లు చేయాలి. వీటన్నిటిని సమన్వయం చేయాలి..అంతేకానీ కుడిచేయికి..ఎడమచేయికి సంబంధం లేకుండా అకస్మాత్తుగా ఇలాంటి విధానాలు చేస్తే వ్యవసాయం పూర్తిగా నాశనం అవుతోంది.

దాదాపు 35 ఏళ్ల క్రితం మన రాష్ట్రంలో పొడుగు పింజ పత్తి అప్పుడప్పుడే వస్తోంది. అప్పటి వరకు పొట్టి పింజ పత్తి..ముతక పత్తి వచ్చేది. మన శాస్త్రవేత్తలు, ఆదర్శరైతుల కృషి చేసి గొప్ప వంగడాలను సృష్టించారు. ఆ సంవత్సరం పంట బాగా పండుతుంది. ఎకరాకి 15 క్వింటాళ్ల దిగుబడి వస్తోంది. రేటు రూ. 1600 పలుకుతోంది. ఆ రోజుల్లో ఆ రేటు చాలా ఎక్కువ. ఇప్పుడు 10 వేలు..12 వేలు ఉంటే బాగా పెరిగిపోయింది అంటున్నారు. అంతకు ముందు రూ. 800 ఉండేది. ఈ సమయంలో యూనియన్ ప్రభుత్వం ఒక ప్రకటన చేసింది. మన దేశంలో క్వింటాలు రూ. 1600 ఉంటే విదేశాల్లో రెండు వేల రూపాయలకంటే ఎక్కువ ఉంది. మామూలుగా విదేశాలకు అమ్ముకునే ప్రయత్నం చేస్తే మన రేటు ఇంకా పెరుగుతుంది. అది చేసిది పోయి..విదేశాల నుంచి ఎక్కువ ధరకు కొనుగోలు చేసి పత్తిని దిగుమతి చేస్తున్నాం..అని ఒక ప్రకటన చేశారు. ఒక్క క్వింటాలు దేశానికి రాలేదు..కానీ ఒక్కదెబ్బకు రేటు రూ. 1600 నుంచి

రూ. 800కు వచ్చేసింది. ప్రభుత్వ ప్రకటన ఫలితంగా రైతులు తీవ్రంగా నష్టపోయారు. పంట పండేదే చాలా తక్కువ. చీడపీడలను ఎదుర్కోవాలి..తేమ, వర్షపాతం ఉండాలి..పత్తిపంటకు కొంత తేమ ఎక్కువైనా కుళ్లిపోతోంది..నీళ్ల అందకపోయినా పంట పాడైపోతోంది. పురుగుమందులు వేయాలి. విత్తనానికే చాలా ఖర్చు పెట్టాలి. పత్తిని సేకరించడం చాలా కష్టంతో కూడుకున్న పని. ఇవన్నీ తట్టుకుని పంట పండిస్తే మార్కెట్‌లో రేటు రాకుండా ప్రభుత్వమే నిర్దయగా, కర్కశంగా, అన్యాయంగా విధానాల్ని పాటిస్తే వాళ్ల చేతుల్లో చట్టం ఉంది కాదా అని, అధికారం ఉంది కదా అని మళ్లీ వాళ్లే మన దగ్గరకు వచ్చి సానుభూతి నటిస్తే, కన్నీళ్లు కారిస్తే, చచ్చిపోతే డబ్బులు ఇస్తామని చెబితే ఇంతకంటే గడుసుదనం ఏమైనా ఉందా? ఇంతకంటే అన్యాయం ఏమైనా ఉందా? వాళ్లెవరూ దురుద్దేశంతో ఈ పని చేయడం లేదు. మనకు అర్థం కావడం లేదు. రైతులకు, రైతుల్ని ప్రేమించే వాళ్లకి, రైతులకు మద్దతు ఇచ్చే వాళ్లకి అసలు రైతుకు రేటు రావడం, రైతుకి ఆదాయం రావడం ఎట్లా? అన్నది లోతు తెలియకుండా పైపైన నినాదాలు ఇస్తున్నాం. రైతే రాజు , పల్లె సీమలే పట్టుగొమ్మలు, వ్యవసాయమే జీవనాధారం, ఇలాంటివి చెబుతున్నాం. కానీ దానికి తగ్గ చర్యలు చేపట్టడం లేదు. మనం చెప్పే మాటలకు చేసే పనులకు మధ్య పొంతన లేదు. దురుద్దేశం లేదు కానీ ఆలోచన లేదు. ఆలోచన లేని సానుభూతి నిరర్థకం. నిజంగా వ్యవసాయాన్ని ప్రేమిస్తే, నిజంగా గ్రామీణ భారతానికి డబ్బు రావాలి, ఆదాయాలు పెరగాలి అనుకుంటే నిజంగా రైతులు రైతు బిడ్డలు బాగుపడాలని కోరుకుంటే ఏవిధానం వల్ల ఆదాయం పెరుగుతోంది. ఆ విధానాల్ని ఏ రకంగా మనం చేపట్టాలి. దిగుమతుల నుంచి రక్షణ కావాలి, ఎగుమతులకు ప్రోత్సాహం కావాలి. ఇది మన రూల్. మనం ఉత్పత్తి చేసిన వస్తువులు ఇతర దేశాల్లో మంచి రేటుకు అమ్ముకుంటే లాభం. ఇతరులు తక్కువ రేటుకు అమ్ముకుంటే ఆమేరకు మన ఉత్పత్తిదారులకు రక్షణ కల్పిస్తే మనకు లాభం. మన ప్రయోజనాల్ని మనం కాపాడుకోవాలి. అమ్మ పెట్టా పెట్టదు..అడుక్కు తిననివ్వదు అన్నట్టుగా మీరు సాయమూ చేయలేరు..మార్కెట్‌లో అవకాశం వస్తే అందనివ్వరు అంటే వ్యవసాయం ఎలా బాగుపడుతుంది. కాబట్టి లోతుగా అర్థం చేసుకోవాలి. ప్రభుత్వాలు చేసే చర్యలకి, మన జీవితాలకి, మన ఆదాయాలకి, వ్యవసాయం భవిష్యత్తుకి మధ్య అవినావభావ సంబంధం ఉంది. అది సామాన్యులకు మారుమూల పల్లెటూళ్లో ఉన్న వ్యవసాయకార్మికుడికి, సామాన్య రైతుకి అర్థం అయినట్టయితే రైతులు బాగుపడతారు. ఈ దేశంలో సరైన విధానాలు వస్తాయి.

**వ్యవసాయ ఉత్పత్తికి మార్కెట్‌లో రేటు పెరిగితే...ఆ మేరకు రైతు వాటా కూడా పెరుగుతోంది. ఎంతో కొంత లాభం పెరుగుతోంది.. దీనికి ఇదే తాజా ఉదాహరణ.. చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలం సువ్వారపు వారి పల్లె సమీపంలో 20 ఎకరాల బీడు భూమిని సోమల మండలం కరకమందకు చెందిన రైతు చంద్రమౌళి, అతని సోదరులు కలిసి గతేడాది కొనుగోలు చేశారు. ఆ ఏడు ఎకరాల భూమిని సాగులోకి తెచ్చి మూడు నెలల క్రితం టమాటా నారు తెచ్చి నాటగా ఎకరాకు రూ. రెండు లక్షలు ఖర్చయింది. ప్రస్తుతం టమాటా తోటలో రోజు మార్చి రోజు కోత కోస్తున్నాడు. కోతకు 500 బాక్సులకు పైగా(బాక్సుకు 15 కిలోలు) వస్తున్నాయి. కొన్ని కోతల్లో 600 బాక్సుల వరకు దిగుబడి వచ్చింది. ఇప్పటి వరకు 20 కోతలకు పైగా దిగుబడి తీశాడు. కాయల్ని కర్ణాటకలోని కోలార్ మార్కెట్‌కు తరలిస్తున్నట్టు చంద్రమౌళి చెప్పాడు. ఒక్కో బాక్సు ధర రూ. 1000 నుంచి రూ. 1200 వరకు పలికింది. ఇప్పటికే టమాటా పంటపై రూ. కోటి వరకు ఆదాయం వచ్చిందని ఆ రైతు చెప్పాడు. ఇంకా రెండు నెలల వరకు పంట దిగుబడి వస్తోందని ఆ రైతు చెబుతున్నాడు.**

## టమాటా పంట కోటీశ్వర్లుణ్ణి చేసింది

ధర పెరగడంతో భారీ ఆదాయం



**కల్లూరు (పులిచెర్ల):** టమాటా ఏంటి.. రైతును కోటీశ్వరుణ్ణి చేయడమేంటని ఆశ్చర్యపోకండి. చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలం సువ్వారపు వారి పల్లె సమీపంలో 20 ఎకరాల బీడు భూమిని సోమల మండలం కరకమందకు చెందిన రైతు చంద్రమౌళి, అతని సోదరులు కలిసి గత ఏడాది కొనుగోలు చేశారు. టమాటా పంటపై మక్కువ గల చంద్రమౌళి 7 ఎకరాల భూమిని సాగులోకి తెచ్చాడు. మూడు నెలల క్రితం సాహు రకం టమాటా నారు తెచ్చి నాటగా ఎకరాకు రూ.2 లక్షల వరకు ఖర్చయింది. ప్రస్తుతం పంట కోత దశకు చేరుకుంది. కిలో టమాటా రూ.80 నుంచి రూ.100 వరకు ధర పలకడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నాడు.

**కోతకు 500 బాక్సుల దిగుబడి**

చంద్రమౌళి ప్రస్తుతం టమాటా తోటలో రోజు మార్చి రోజు కోత కోస్తున్నాడు. కోతకు 500 బాక్సులకు పైగా (బాక్సుకు 15 కిలోలు) వస్తున్నాయి. కొన్ని కోతల్లో 600 బాక్సుల వరకు దిగుబడి వచ్చింది. ఇప్పటివరకు 20 కోతలకు పైగా దిగుబడి తీశానని. కాయల్ని కర్ణాటకలోని కోలార్ మార్కెట్‌కు తరలిస్తున్నానని చంద్రమౌళి చెప్పాడు. ఒక్కో బాక్సు ధర రూ.వెయ్యి నుంచి రూ.1,200 పలుకుతోందని తెలిపాడు. ఇప్పటికే టమాటా పంటపై రూ.కోటి వరకు ఆదాయం వచ్చిందని రైతు చెబుతున్నాడు.

# నవసమాజ నిర్మాణం కోసం తపించిన నరసింహారావు

**- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్**

సి. నరసింహారావు గారు విశిష్టమైన వ్యక్తి. గొర్రెదాటుగా కాకుండా విలక్షణంగా, దూరదృష్టితో, ధైర్యంగా వ్యవహరించే శక్తి, భావాల్ని ప్రకటించే నేర్పరితనం ఆయన వ్యక్తిత్వం. సామ్యవాదం పేరుతో మన దేశంలో చోటుచేసుకున్న అరాచకాన్ని సరిదిద్దే ప్రయత్నమే నరసింహారావు గారి కృషికి నేపథ్యంగా మారింది. మన దేశంలోనూ, తెలుగునాటా సామ్యవాదానికి విపరీతార్థానివ్వటం పెను ప్రమాదాలకు దారితీసింది.

మొదటిది, వ్యక్తి సామర్థ్యాన్ని, నైపుణ్యాన్ని, ఉపాధిని, సంపాదించే శక్తిని పెంచే ప్రయత్నం చేయకుండా, తాత్కాలిక సాయాలతో సమాజంలో సమానత్వం తీసుకురావచ్చన్న వాదనని సామ్యవాదం పేరుతో బలంగా ప్రచారం చేశారు. దాంతో సామ్యవాద ప్రభావం బాగా ఉన్న దేశాల్లో అందరికీ అందిన మంచి ప్రమాణాల విద్య, ఆరోగ్యం మన దేశంలో అందకుండా పోయింది, బీదరికాన్ని కొనసాగిస్తూనే తాత్కాలిక సాయాలతో సామ్యవాదం తెస్తున్నామనే భ్రమని సమాజంలో వ్యాపింప చేశారు.

రెండవది, సామ్యవాదం పేరుతో ఆర్థిక స్వేచ్ఛ లేకుండా ప్రభుత్వానికి సర్వాధికారాన్ని, గుత్తాధిపత్యాన్ని కట్టబెట్టారు. పోటీ, ఆర్థిక స్వేచ్ఛ లేని సమాజంలో ప్రభుత్వాల గుత్తాధిపత్యం ఓ వంక కొరతలు, విపరీత అవినీతికి దారితీయగా.. మరోవంక ఉత్పత్తిలో పోటీ, నాణ్యత లేక, అవసరాలకు తగినంత ఉత్పత్తి చేయలేక, బీదరికం కొనసాగి భారతీయ సమాజం ప్రపంచంలో అట్టడుగు స్థాయికి దిగజారింది.

మూడవది, దేశంలో 90% పైగా ఉన్న అసంఘటిత కార్మికుల్ని, రెక్కాడితేగానీ డొక్కాడని పేదరికంలో అలమటిస్తున్న వాళ్లని పూర్తిగా విస్మరించారు. వారిని బీదరికం నుంచి బైటపడేసి, వారి ఆదాయాన్ని పెంచే ఏర్పాట్లు చేయకుండా, సామ్యవాదం పేరుతో సంఘటిత కార్మికుల ప్రయోజనాలకి పెద్దపీట వేశారు. వీటన్నిటి పర్యవసానమే 1991 ఆర్థిక సంక్షోభం, ఇప్పటికీ వివిధ రంగాల్లో కొనసాగుతున్న మాంద్యం, వెనుకబాటుతనం, వైఫల్యం.

సి. రాజగోపాలాచారి, ఎన్.జి రంగా లాంటి మహామహుల భావజాలానికి ఆకర్షితులై నరసింహారావు గారు 1970 నాటికే, అంటే ఐదు దశాబ్దాలకు పూర్వమే మన కుహనా సామ్యవాద వ్యవస్థ లోపాల్ని, వైఫల్యాల్ని పూర్తిగా అర్థం చేసుకుని పరిష్కారాల కోసం నడుం బిగించారు.

ఐదు దశాబ్దాలుగా వ్యక్తి స్వేచ్ఛకి, ఆర్థిక రంగంలో పోటీకి,



## 'రేపటి మనిషి' ఆవిష్కరణ



హైదరాబాద్‌లో జరిగిన నరసింహారావు సంస్మరణ కార్యక్రమంలో ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్‌తోపాటు వివిధ రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు పాల్గొని నివాళులర్పించారు. నరసింహారావు జ్ఞాపకాలతో 'రేపటి మనిషి' పుస్తకాన్ని ఆవిష్కరించారు.

సృజనశక్తి విడుదలకు, నిజమైన సంపద సృష్టికి ప్రాధాన్యతనిచ్చి ఉదారవాద ఆర్థిక, రాజకీయ వ్యవస్థల నిర్మాణం కోసం నరసింహారావు గారు అవిశ్రాంత కృషి చేశారు.

నరసింహారావు గారు నిరంతర ఆశావాది. మానవ పరిణామక్రమాన్ని, చరిత్ర గతులను లోతుగా అధ్యయనం చేసి దీర్ఘకాలంగా మానవ సమాజం ఎప్పుడూ ప్రగతి మార్గాన్నే నడుస్తోందని నిర్ధారించుకున్నారు. తాత్కాలికంగా ఒడిదుడుకులున్నా, మానవ సమాజం నిరంతరం అన్ని రంగాలలో- సామాజిక విలువల్లో, ఆర్థిక ప్రగతిలో, రాజకీయ పరిణామంలో, స్వేచ్ఛ వికాసంలో- అభ్యుదయపథాన్నే ప్రయాణిస్తూనే ఉంటుందని, ఊహాజనిత గత వైభవ స్మరణ మాని, అందమైన భవిష్యత్తు కోసం బాటలు వేయాలని నమ్మి అందుకోసం నిరంతరం శ్రమించారు, పరితపించారు.

మానవ జాతి ఎన్నో ఫలితాల్ని సాధించినా, అందరికీ స్వేచ్ఛను అందించే నవసమాజ నిర్మాణానికి ఇంకెంతో కృషి అవసరమని, సాధించవలసిన లక్ష్యానికి-సాధించిన విజయానికి మధ్య చాలా అంతరముందని నరసింహారావు గారు ప్రగాఢంగా విశ్వసించేవారు. అందుకే ఆయన ఆశావాదం నిరంతర జాగృతికి, సామాజిక చైతన్యానికి, అవిశ్రాంత కృషికి దారితీసింది.

బహుశా నరసింహారావు గారు సమాజంలో అతి ఎక్కువగా చూపెట్టిన ప్రభావం వేలాది మంది వ్యక్తుల జీవితాల్ని మార్చటంలో. ప్రతి వ్యక్తీ ఇంగితజ్ఞానంతో, స్వయంకృషితో, నిరంతర సాధనతో, హేతుబద్ధ దృక్పథంలో, అన్ని రంగాల్లో ఎదగటం సాధ్యమని నరసింహారావు గారు పూర్తిగా విశ్వసించారు. ఒక వ్యక్తి పుట్టుక జీవితాన్ని నిర్దేశించనక్కర్లేదని ప్రగాఢంగా నమ్మారు. అందుకే తన రచనల ద్వారా అసంఖ్యాక తెలుగు ప్రజల వ్యక్తిత్వ వికాసానికి, హేతుబద్ధమైన ఆలోచనల వ్యాప్తికి, ప్రతి వ్యక్తీ తన అంతరంగాన్ని తానే అర్థం చేసుకోగల మానసిక విశ్లేషణకు తోడ్పాటునందించారు.

ఒక మిత్రుడిగా, సహచరుడిగా నరసింహారావు గారు తనకి సన్నిహితంగా ఉన్న ప్రపంచానికి ఎంతో ఆనందాన్ని పంచారు. ఆత్మీయత, ప్రేమాభిమానాలు, కల్మషం లేని మనసు, ఎలాంటి పరిస్థితుల్లోనూ చలించని గుండెనిబ్బరం, ముఖం మీద ఎప్పుడూ తొలగని చిరునవ్వు- ఇవన్నీ ఆయనకు వందలాది మంది ఆత్మీయ మిత్రులను సంపాదించి పెట్టాయి. కొన్ని సందర్భాల్లో ఆయన భావాల్ని, మాటల్ని అంగీకరించకపోవచ్చు, కానీ ఆయన అభిప్రాయాల్ని, వాదనల్ని నిర్లక్ష్యం చేయటం అసాధ్యం. ఆయన అకాల మరణానికి గురికాకుండా ఉంటే, బహుశా 15-20 సంవత్సరాలపాటు తెలుగు సమాజం ఎన్నో విలువైన ఆలోచనల్ని, పదునైన భావాల్ని పంచేవారు. తన కుటుంబానికి, మిత్రులకి ఆనందాన్ని పంచేవారు.

అలాంటి విశిష్టమైన వ్యక్తిత్వమున్న నరసింహారావు గారిని కోల్పోవటం వ్యక్తిగతంగా ఆయన కుటుంబానికి, సన్నిహిత మిత్రులైన మనందరికి, తెలుగు సమాజానికి ఎంతో నష్టం. ఆప్తమిత్రుడి స్మృతికి సజల నయనాలతో అంజలి ఘటిస్తూ, నరసింహారావు గారు కోరుకున్న మానవ విలువలు, పరిపూర్ణ స్వేచ్ఛ ఉన్న నవసమాజం నిర్మాణం కోసం కృషి చేయటమే మనం ఆయనకిచ్చే నిజమైన నివాళిగా భావిస్తూ, సెలవు.

# ప్రభుత్వాలకు ఆర్థిక క్రమశిక్షణ ముఖ్యం



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు బ్యాంకులు, ప్రజలకు ఆర్థిక క్రమశిక్షణ ముఖ్యమని లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాశ్‌నారాయణ్ వ్యాఖ్యానించారు. ఎఫ్‌ఆర్‌బీఎం చట్టం పరిధిలో రాష్ట్రాలు 3.5 శాతానికి మించి రుణాలు తెస్తే అప్పుల ఊబిలో కూరుకుపోయి, ఆర్థికంగా దివాలా తీసే ప్రమాదం ఉంటుందని హెచ్చరించారు. ఒకప్పుడు సంపన్న రాష్ట్రమైన పంజాబ్ ప్రస్తుతం ఆర్థికంగా కుదేలైందన్నారు. రాజస్థాన్, పశ్చిమబెంగాల్‌తో పాటు తెలుగు రాష్ట్రాలూ అదే బాటలో ఉన్నాయన్నారు. దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని, రాష్ట్ర ఆదాయాలను పెంచి ఆర్థిక రంగాన్ని పటిష్టం చేయాలని ప్రభుత్వాలకు జేపీ సూచించారు. హైదరాబాద్‌లో ఇండియన్ బ్యాంక్ రిటైరీస్ అసోసియేషన్ (ఏపీ, తెలంగాణ) 12వ సర్వసభ్య సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన జేపీ మాట్లాడుతూ మొండి బకాయిలను రాబట్టి బ్యాంకింగ్ రంగాన్ని బలోపేతం చేయాలన్నారు. డబ్బుకు తగిన రక్షణ, తగిన వడ్డీ, నాణ్యమైన సేవలు, సకాలంలో రుణాల వసూళ్లతో పాటు అధికంగా డిపాజిట్లను కూడబెట్టే బ్యాంకులే మనుగడ సాధిస్తాయన్నారు. రాజకీయ వ్యవస్థలో అవినీతిని రూపుమాపనంత కాలం ప్రభుత్వరంగ సేవలు మెరుగుపడవన్నారు. అనంతరం కోవిడ్ సమయంలో బన్సీలాల్‌పేట శ్మశానవాటికలో పనిచేసిన కాటికాపరులను ఆయన ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఇండియన్ బ్యాంక్ రిటైరీస్ అసోసియేషన్ తరఫున పలు తీర్మానాలు ఆమోదించారు. ఆల్ ఇండియా బ్యాంక్ రిటైరీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు ఎస్ఎం దేశ్‌పాండే, టీబీఆర్ఎఫ్ అధ్యక్షుడు ఎ. రాజేంద్రప్రసాద్, ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణరావు, ఆయా రాష్ట్రాల సభ్యులు పాల్గొన్నారు.

# 2019 ఎన్నికల్లో పార్టీల ఖర్చు: ఎక్కడి రూ. 60,000 కోట్లు .. ఎక్కడి రూ.3,046 కోట్లు




రాజకీయాల్లో మన అబద్ధాలు ఎన్నికల వ్యయంపై తప్పుడు లెక్కలతోనే మొదలవుతాయి.. అని మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి గతంలోనే చెప్పారు. ఈ అబద్ధాల పర్వం అదే పార్టీకి చెందిన నరేంద్ర మోదీ ప్రధానిగా ఉన్న ప్రస్తుతం కూడా యధావిధి అన్నట్లు కొనసాగుతోందని ఇటీవల ఎన్నికల సంఘం విడుదల చేసిన లెక్కల్ని చూస్తే అర్థమవుతుంది.

2019 ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలూ కలిసి రూ.3,046 కోట్లు ఖర్చు చేశాయని ఇటీవల కేంద్ర ఎన్నికల సంఘం లెక్కతేల్చి నివేదికను విడుదల చేసింది. 17వ లోక్‌సభ ఎన్నికలతోపాటు ఆంధ్రప్రదేశ్, ఒడిషా, సిక్కిం, అరుణాచల్‌ప్రదేశ్ అసెంబ్లీలకు ఏకకాలంలో జరిగిన ఎన్నికల్లో చేసిన వ్యయం ఇది.

ఈసీ నివేదిక ప్రకారం, సార్వత్రిక ఎన్నికల్లో మొత్తం ఏడు జాతీయ పార్టీలు కలిపి రూ.2,378 కోట్లు, అన్ని ప్రాంతీయ పార్టీలు కలిపి రూ.668 కోట్లు ఖర్చు చేశాయి. బీజేపీ అన్ని పార్టీల కంటే అత్యధికంగా రూ.1,264 కోట్లు ఖర్చు చేసింది. మొత్తం ఎన్నికల వ్యయంలో ఈ పార్టీ వాటా 41.49%. కాంగ్రెస్ రూ.820 కోట్లు (26.92%) ఖర్చు చేసి రెండో స్థానంలో నిలిచింది. తెలుగు రాష్ట్రాల్లోని నాలుగు ప్రాంతీయ పార్టీలు కలిపి చేసిన వ్యయం రూ.227 కోట్లు. ఇందులో రూ.131 కోట్లతో తెలుగుదేశం పార్టీ తొలిస్థానంలో నిలువగా.. రూ.86 కోట్ల వ్యయంతో వైకాపా రెండోస్థానంలో ఉంది. తెరాస రూ.9.53 కోట్లు ఖర్చు చేసింది. అసదుద్దీన్ నేతృత్వంలోని ఎంఐఎం కేవలం రూ.71,961 ఖర్చు చేసినట్లు చూపింది. ప్రాంతీయ పార్టీల్లో అత్యధికంగా ఒడిషాలోని బిజూ జనతాదళ్ (బీజేడీ) రూ.228 కోట్లు ఖర్చు చేసింది. లోక్‌సభ ఎన్నికల్లో గెలిచిన ఒక్కో అభ్యర్థి సగటున రూ.50.85 లక్షలు ఖర్చు చేశారు. ఏపీలో సగటున ఒక్కో అభ్యర్థి రూ.30.50 లక్షలు, తెలంగాణలో రూ48.61 లక్షలు ఖర్చు చేశారు.

కానీ వాస్తవ పరిస్థితి ఈ లెక్కలకు ఎంత దూరంగా ఉందో కాస్త రాజకీయ పరిజ్ఞానం ఉన్న ఎవరికైనా అర్థమవుతుంది. ఎన్నో ఏళ్లుగా ఎన్నికల వ్యయం, అవినీతి లెక్కల్ని అధ్యయనం చేస్తున్న సెంటర్ ఫర్ మీడియా స్టడీస్ (సీఎంఎస్) సంస్థ నివేదిక కూడా లెక్కలతో సహా ఇదే మాట చెబుతోంది.

**సగటున ఒక్కో లోక్‌సభ నియోజకవర్గానికి రూ.100 కోట్లు: సీఎంఎస్**

2019 లోక్‌సభ ఎన్నికల్లో రాజకీయ పార్టీలు సుమారు రూ.60,000 కోట్లు ఖర్చు పెట్టాయని, ఇప్పటి వరకూ జరిగిన అన్ని ఎన్నికల్లో ఇదే అత్యధిక వ్యయమని సెంటర్ ఫర్ మీడియా స్టడీస్ తన అధ్యయనంలో వెల్లడించింది. సగటున ఓటుకు రూ.700 ఖర్చు చేశారని, లోక్‌సభ నియోజకవర్గానికి దాదాపు రూ.100 కోట్లు ఖర్చు పెట్టారని తెలిపింది.

ఈ మొత్తంలో బీజేపీ దాదాపు 45%, అంటే రూ.27,000 కోట్లు ఖర్చు చేసిందని వెల్లడించింది.

- మొత్తం ఎన్నికల వ్యయంలో బీజేపీ 1998లో 20% వ్యయం చేయగా, 2019లో ఆ శాతం 45కి చేరింది.
- 2009లో కాంగ్రెస్ వ్యయం వాటా 40% కాగా, 2019లో అది 15 నుండి 20%గా ఉంది.

రాజకీయ పార్టీల, అభ్యర్థుల ప్రచారం, ఎంపిక చేసిన నియోజకవర్గాలలో ఓటర్ల అభిప్రాయాలు, ఓటర్ల మధ్య అంతరాలకు సంబంధించి అందుబాటులో ఉన్న సమాచారం, క్షేత్రస్థాయి పరిశీలనలు, మీడియా కవరేజీ ఇలా పలు కోణాలలో సీఎంఎస్ అధ్యయనం చేసింది.

సీఎంఎస్ నివేదిక ప్రకారం, 2019 ఎన్నికల్లో




**లోక్‌సభ ఎన్నికల్లో 1998 నుండి 2019 వరకు ఎన్నికల వ్యయం ఎలా పెరిగిందో వివరిస్తున్న సీఎంఎస్ గ్రాఫ్**

రూ.12,000 నుండి 15,000 కోట్ల వరకు ఓటర్లకు నేరుగా పంపిణీ చేశారు. రూ.20,000 నుండి 25,000 కోట్లు ప్రచారం మీద ఖర్చు పెట్టారు. రూ.5,000 – 6,000 కోట్లు రవాణా, ప్రయాణాలకు, రూ. 10,000 – 12,000 కోట్లు కొంతమేర అధికారిక లెక్కల్లో నమోదు చేసే వ్యయం, రూ.3,000 – 6,000 కోట్లు ఇతరత్రా ఖర్చు చేశారు.

ఎన్నికల్లో డబ్బు ప్రభావం అనూహ్యంగా పెరిగిపోయిందని 2019 జూన్ 2న ఈ నివేదిక విడుదల కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎన్నికల ప్రధానాధికారి ఎస్.వై ఖురేషీ వ్యాఖ్యానించారు.

2014లో రూ.30,000 కోట్లు వ్యయం జరిగిందని సీఎంఎస్ అంచనా వేసింది. ఈసారి అది రెట్టింపయింది. భారతదేశ ఎన్నికలు ప్రపంచంలోనే అత్యంత ఖరీదైనవిగా 2019 ఎన్నికలు నిగ్గుతేల్చాయి.

ఈ లెక్కన వచ్చే సాధారణ ఎన్నికల ఖర్చు రూ. లక్ష కోట్లు దాటినా ఆశ్చర్యపోనక్కర్లేదనే అంచనాలు వెలువడుతున్నాయి.

**అవినీతికి తల్లి వేరు ఎన్నికల వ్యయంలోనే ఉంది**

అన్ని రకాల అవినీతికీ తల్లి వేరు.. ఎప్పటికప్పుడు అపరిమితంగా పెరిగిపోతున్న ఎన్నికల వ్యయంలోనే ఉంది. ఇందులో దాదాపు ప్రతి ప్రధాన పార్టీ పాత్రధారే.

దేశాన్ని, పార్టీని ఒక క్రమశిక్షణతో నడుపుతున్నామని చెప్పుకుంటున్న బీజేపీ.. ఈ అవినీతిని కూడా ఎవరినీ నోరెత్తనీయకుండా, నిశ్శబ్దంగానే, ఒక పద్ధతి ప్రకారమే అనుమతిస్తోంది. బాండ్ల రూపంలో ఎన్నికల విరాళాల సేకరణ నుండి.. ఫిరాయింపుల్ని ప్రోత్సహించటం, అత్యాధునిక రీతిలో మీడియా నిర్వహణ, మీడియా సంస్థల కట్టడి, అట్టహాసంగా పార్టీ కార్యక్రమాల నిర్వహణ వరకు ఈ రకంగానే సాగిస్తోంది. లోక్‌సభకు ఎన్నికవటానికి రూ.8 కోట్లు ఖర్చు పెట్టినట్లు బీజేపీ ఎంపీ గోపీనాథ్ ముండే 2013లో బహిరంగంగా ప్రకటించారు. ఆ వేదిక మీద బీజేపీ అగ్రనాయకత్వం కూడా ఉన్నారు. వాజ్‌పేయి సైతం బహిరంగంగానే ఎన్నికల వ్యయంపై మన రాజకీయ వ్యవస్థ వైఫల్యాన్ని అంగీకరించారు. వివిధ పార్టీలకు చెందిన అనేకమంది నేతల్లో ఇదే ఆక్రోశం ఉన్నా.. పిల్లి మెడలో ఎవరూ గంట కట్టటం లేదు. 2019 ఎన్నికల్లో ఇన్ని పదుల వేల కోట్లు ఖర్చయింది, ఎన్నికల సంస్కరణల దిశగా ఇప్పటికైనా రాజకీయ నేతల్ని ఆలోచింప చేయాలనే ఉద్దేశంతో సీఎంఎస్ నివేదిక విడుదలకు అన్ని పార్టీల వారినీ ఆహ్వానించినా, ఒక్క పార్టీ కూడా ప్రతినిధిని పంపలేదు.

ఇంత పెద్ద సంక్షోభాన్ని పరిష్కరించే సంస్కరణల్ని తేవటం ఎన్నికల సంఘం పరిధిని మించిన పని. బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వం ఇందుకు చొరవ చూపాలి. దేశానికి కొత్త దిశానిర్దేశానికి ప్రత్యామ్నాయ ఎజెండా చూపుతానంటున్న తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు వంటి వారంతా ముందుకు రావాలి. హుజూరాబాద్ ఎన్నికల్లో కోట్ల రూపాయలు ఎలా ప్రవహించాయో అందరూ చూశారు. ఒక అసెంబ్లీ ఉప ఎన్నిక కోసం బ్రిటన్‌లో పార్లమెంటు ఎన్నికలకు ప్రధాన పార్టీలు చేసే ఖర్చు కంటే కూడా ఎక్కువ వ్యయం చేశారు. ఎమ్మెల్యే అభ్యర్థులు తాము ఎన్నికల్లో గెలిచేందుకు ఇల్లిల్లూ తిరిగి ఓటుకింతని డబ్బులు పంచుతారని, మగవాళ్లకు బిర్యానీలు, మద్యం బాటిళ్లు, మహిళలకు చీరలు కానుకగా ఇస్తారని తెలంగాణలో ఇటీవల జరిగిన ఏడో తరగతి సోషల్ స్టడీస్ వార్షిక పరీక్షలో అడిగిన ప్రశ్నకు ఓ విద్యార్థి రాశాడంటే, పరిస్థితి ఏ స్థాయికి దిగజారుతోందో అర్థం చేసుకోవచ్చు. నిజంగా నూతన భారతదేశ నిర్మాణం చేయాలనుకుంటే.. డబ్బు రాజకీయాన్ని బాగు చేయటానికి కేసీఆర్ కూడా ప్రాధాన్యతనివ్వాలి. ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నిక, దామాషా ఎన్నికల పద్ధతి, స్థానిక ప్రభుత్వాల సాధికారత, ప్రభుత్వ కార్యాలయాల్లో జవాబుదారీతనానికి ఏర్పాట్లు, పార్టీల్లో అంతర్గత ప్రజాస్వామ్యం వంటి చర్యల్ని వెంటనే ప్రారంభించాలి. ఎన్నికల వ్యయంపై దశాబ్దాల ఆత్మవంచనకు 75వ స్వాతంత్ర్య దినోత్సవ వేళయినా తెరపడాలి, నిజాయతీ డబ్బుతో రాజకీయం మొదలవ్వాలి.

# ఎమర్జెన్సీ నుంచి ఏం నేర్చుకున్నాం గనుక...?

## - డాక్టర్ జయప్రకాష్ నారాయణ్


INDIAN HERALD
NATIONAL ENGLISH DAILY
Founder & Editor: THAKUR V. HARI PRASAD
SPECIAL SUPPLEMENT

EMERGENCY DECLARED
JP, Morarji, Advani, Asoka Mehta & Vajpayee arrested




జూన్ 25, 1975న మన దేశంలో ఎమర్జెన్సీ పేరిట అర్ధ నియంతృత్వాన్ని ఆవిష్కరించారు. దేశ ప్రజల విజ్ఞత పుణ్యమా అని 1977 మార్చిలో జరిగిన ఎన్నికల్లో ఇందిరాగాంధీ, ఆమె కుమారుడు సంజయ్‌గాంధీ ఇద్దరూ ఓటమి పాలవటంతో 19 నెలల చీకటి రోజుల తరవాత భారతావనిలో మళ్ళీ స్వేచ్ఛా కిరణాలు ప్రకాశించాయి. నియంతృత్వ శృంఖలాలు తెగిపోయాయి. ఎమర్జెన్సీ కాలంలో ప్రజల స్వేచ్ఛను, పౌర హక్కుల్ని రద్దు చేశారు. మంత్రివర్గ అనుమతి కూడా పొందని ఎమర్జెన్సీ ప్రకటనపై ఆనాటి రాష్ట్రపతి ఫక్రుద్దీన్ అలీ అహ్మద్ ఆమోదముద్ర వేసి శాశ్వతంగా అపకీర్తి మూటగట్టుకున్నారు. ఎమర్జెన్సీ పేరుతో కొందరు ఎన్నో అకృత్యాలకు, కిరాతకాలకు పాల్పడ్డారు. స్టాలిన్ రష్యాలో లాగా అర్ధరాత్రి తలుపులు తట్టి వేల మందిని అప్పటికప్పుడు జైళ్ళకు తరలించారు. దాదాపు లక్షమందిని విచారణలు లేకుండా ఆంతరంగిక భద్రతా చట్టం కింద నిర్బంధించారు. పత్రికల గొంతు నొక్కారు. ఇందిర కుమారుడు సంజయ్‌గాంధీ దేశానికి అప్రకటిత యువరాజుగా, మకుటంలేని మహారాజుగా, రాజ్యాంగేతర శక్తిగా అవతరించి అంతులేని అధికారాన్ని అక్రమంగా చెలాయించారు. సీనియర్ మంత్రులు నామ మాత్రంగా మిగిలారు. అధినేత ఆజ్ఞలను మారుమాటడకుండా శిరసావహించారు. దేశ రాజకీయాల్ని, సమాజాన్ని ఆనాటి సంఘటనలు సమూలంగా మార్చివేశాయి. ఎమర్జెన్సీ కారణంగానే కాంగ్రెస్ కోటలు బీటలువారాయి. ఏకపార్టీ పాలన అంతానికి బీజాలు పడ్డాయి.

### ఇంకా తొలగని చీకట్లు

ఎమర్జెన్సీ ఘట్టం ముగియటంతో దేశంలో నియంతృత్వ పోకడలు శాశ్వతంగా అంతరించాయనుకుంటే పొరపాటు. పౌరహక్కులు అంతరించకపోయినా, దేశమంతటా అడపాదడపా చట్టాన్ని తుంగలో తొక్కుతున్నారు. నేటికీ రాజ్యం 'వీరభోజ్యం'గానే పాలకులు భావిస్తున్నారు. అక్రమార్జన, కండకావరం, కుట్రలు, మోసం, దగా, దోపిడి నేటి రాజకీయంలో, పాలనలో వీరత్వంగా, చతురతగా చెలామణి అవుతున్నాయి. అప్రకటిత ఎమర్జెన్సీ నేటికీ కొనసాగుతూనే ఉంది. అధికారాన్ని ప్రజాసంక్షేమానికి పాటుపడే అమూల్య అవకాశంగా కాక, ప్రజలను దోచుకోవటానికి సాధనంగా భావించి, ఆ విధంగా వ్యవహరించటం పరిపాటి అయింది. ఎమర్జెన్సీని వ్యతిరేకించి ఆనాడు జైలుపాలయిన వారు కూడా పౌర హక్కులను, చట్టాన్ని, రాజ్యాంగాన్ని ఖాతరు చేయటం లేదు. రక్షణ వ్యవహారాల్లో జరుగుతున్న అవినీతి భాగోతాన్ని గత ఏడాది మార్చిలో తహల్కా డాట్‌కామ్ సాక్ష్యాలతో సహా వీడియో కెమెరాల్లో బంధించి బయటపెట్టింది. దేశంలో అన్ని శాఖలలో, అన్ని లావాదేవీలలో వేళ్లూనుకుపోయిన అవినీతిని ఎదుర్కోవటం ఎలా? అక్రమార్జనకు, అధికార దుర్వినియోగానికి పాల్పడకుండా రాజకీయం నడపటానికి నిధులను సమీకరించటం ఎలా? అనే చర్చను రేకెత్తించి, నిర్దిష్టమైన సమాధానాలను రాబట్టి, అమలు చేయటమే– తహల్కా సృష్టించిన సంచలనానికి సరైన సమాధానం కాగలదు. కానీ, పాలకపక్షం వారు దాన్నొక రాజకీయ సమస్యగా చూశారే తప్ప, దేశ సమస్యగా భావించలేదు. ఇరకాటం నుంచి బయటపడటానికి పాలకపక్షం వారు వ్యూహాలను అన్వేషించారేకాని, అవినీతి భూతాన్ని ఎదుర్కొనే సాహసం చేయలేదు. అన్ని పార్టీలవారు అక్రమంగా నిధులు వసూలు చేస్తున్నారని తెలిసినా ఎన్నికల సంస్కరణల్ని తలపెట్టలేదు.

అధికార క్రీడలో మైమరచిన పార్టీలకు ప్రజల ఇక్కట్లుగానీ, పాలనలో నిజాయతీగానీ పట్టవు. నిజానికి డబ్బుతో అధికారాన్ని, అధికారంతో డబ్బును విచ్చలవిడిగా సంపాదిస్తున్న ప్రధాన పార్టీలకు ఈ పరిస్థితిని మార్చాలన్న కోరికే లేదు. ఎమర్జెన్సీకి ముందు అధికారం, డబ్బు – రెండూ కేవలం కాంగ్రెస్ పార్టీకి పరిమితం. ఎమర్జెన్సీ తరువాత ఇతర పార్టీలకు కూడా అధికారాన్ని పంచుకునే అవకాశం వచ్చింది. కాబట్టి నిరంకుశ ధోరణులలో, దోపిడీలో, అవినీతిలో అందరూ భాగస్వాములయ్యారు. సమస్య పరిష్కారాన్ని అన్వేషించటం మాని, సమస్యను వేలెత్తి చూపినవారి మీద దాడులు ప్రారంభించారు. తహల్కాలో పెట్టుబడి పెట్టారన్న కారణంగా ఫస్ట్ గ్లోబల్ కంపెనీపైన రకరకాల కేసులు పెట్టారు. దాడులు చేశారు. అన్ని రకాల చట్టాలను వారి మీద ప్రయోగించి ఆ కంపెనీని దివాలా

స్థితికి తెచ్చారు. అధికారంలో ఉన్నవారిని ఎదిరించే సాహసం చేస్తే పతనం తప్పదని రుజువు చేశారు. ఇదంతా ఎమర్జెన్సీ కాలంలో జైళ్ళకు వెళ్లిన నాయకులతో ఏర్పడిన బి.జె.పి-ఎన్.డి.ఎ ప్రభుత్వ హయాంలో జరిగింది. ఇది అప్రకటిత ఎమర్జెన్సీ కాక మరేమిటి? ఎమర్జెన్సీ కాలంలో స్వేచ్ఛ కోసం వీరోచితంగా పోరాడి జైలుకు వెళ్ళిన లాలూప్రసాద్‌యాదవ్ అధికారంలోకి వచ్చాక చేసిన ఘనకార్యాలను తిలకిస్తే, ఎమర్జెన్సీ చీకటిరోజులు ఇంకా కొనసాగుతున్నాయేమోననే అనుమానం కలుగుతుంది. దాణా కుంభకోణంలో కోట్ల రూపాయల ప్రజాధనాన్ని లాలూ, ఆయన అనుయాయులు, అధికారులు ఎలా కొల్లగొట్టారో మనకు తెలుసు. కోర్టులో నేరారోపణ జరిగింది కాబట్టి లాలూ శిక్ష పడకపోయినా పదవి నుంచి వైదొలిగారు. కానీ, తన స్థానంలో తన భార్య రబ్రీదేవిని ఉత్సవ విగ్రహంలాగా కూర్చోబెట్టి నిజమైన అధికారాన్ని తాను చెలాయిస్తూ చక్రం తిప్పుతున్నారు. కుటుంబ పాలన, నియంతృత్వం కారణాలుగా ఆనాటి కాంగ్రెస్‌తో పోరాడిన నాయకులు అన్ని విధాలా ఆ కాంగ్రెస్ వైఖరినే అనుసరిస్తున్నారు. కొద్దిరోజుల క్రితం లాలూ కుమార్తె వివాహం జరిగినప్పుడు- ఆయన అనుయాయులు, బంధువులు చేసిన వీరంగం అంతా ఇంతా కాదు. పాట్నా నగరం నడిబొడ్డులో ఖరీదయిన కార్ల డీలర్లను బెదిరించి, షాపుల తాళాలు బద్దలుకొట్టి బలవంతంగా డజన్ల సంఖ్యలో కార్లను వారు ఎత్తుకుపోయారు. ఇవీ ఆనాటి ఎమర్జెన్సీ వ్యతిరేక హీరోల ప్రజాస్వామిక ధోరణులు! ఇక గుజరాత్‌లో మతతత్వ పాలన, పక్షపాత ధోరణులు, కంచే చేను మేసిన వైనాల గురించి ప్రత్యేకంగా వివరించనక్కర్లేదు. గత మూడు మాసాలుగా పత్రికలన్నీ కోడై కూశాయి. దేశ ఐక్యత, సమాజ సౌష్టవం, ప్రజల సుఖశాంతులు, సాంఘిక సామరస్యం మొదలైన వాటి కంటే మతం పేరుతో విభజించి పాలించడం పాలకులకు ఎంత ముఖ్యమో గుజరాత్ సంఘటనలు రుజువు చేశాయి. ఈ మధ్యనే జమ్ము-కాశ్మీర్‌లో మరో యువరాజుకు పట్టాభిషేకం జరిగింది. తన తండ్రి, ఆయన తండ్రి షేక్ అబ్దుల్లా నుంచి రాజకీయాధికారాన్ని వారసత్వంగా పొందగా, ఇప్పుడు ఒమర్ అబ్దుల్లా తన తండ్రి నుంచి కిరీటాన్ని పొంది ఆ రాచరిక సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు. ఈ వారసత్వాలు ఏవో కొన్ని పార్టీలకు, కొన్ని కుటుంబాలకు, లేకపోతే అగ్రస్థాయిలోని పదవులకు మాత్రమే పరిమితమయ్యాయని భావిస్తే పెద్ద పొరపాటు. మన రాష్ట్రంలోనే ఏ కారణంగానైనా ఓ శాసనసభ స్థానమో, లోక్‌సభ స్థానమో ఖాళీ అయితే ప్రతి సందర్భంలోనూ వారి సతీమణి గాని, సంతానం గాని, ఆ పదవుల్ని వారసత్వంగా పొందుతున్నారు. చట్టసభ సభ్యత్వం ఆధునిక జమిందారీగా, కుటుంబం పంచుకునే వారసత్వ ఆస్తిగా మారిపోయింది. ఇందులో అధికార పక్షం, ప్రతిపక్షం అనే తేడా లేకుండా పోయింది. పార్టీలలో అంతర్గత ప్రజాస్వామ్యం కాగితాలపైన కూడా లేదు. ఎక్కడ చూసినా కనిపించేది అంతులేని నిరంకుశత్వమే. ఇవన్నీ కేవలం కొందరు పాలకుల దుశ్చర్యల ఫలితమని భావిస్తే పొరపాటు. అధికారాన్ని అపరిమితంగా ఆరాధించటం మన సంస్కృతిలోనే ఉంది. రాజకీయ నాయకులనే కాదు, ఎన్నో పట్టాలు పుచ్చుకుని, పరీక్షలు రాసి, ఎంపికయిన అధికారుల చేష్టలను పరిశీలించినా ఇది అర్థమవుతుంది. 1981లో ముస్సోరీలోని లాల్‌బహదూర్ శాస్త్రి జాతీయ పాలనా సంస్థను అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ సందర్శించి, ఆనాటి యువ ఐఏఎస్ అధికారులతో చాలాసేపు సంభాషించారు. కొందరు యువ అధికారులు ఆమెతో 'ఐఏఎస్ అధికారులకు, కలెక్టర్లకు మరిన్ని అధికారాలిస్తే పాలన బాగుపడుతుంది కదా?' అని సూచించారు. అప్పుడామె 'ఎమర్జెన్సీ కాలంలో ఎన్నో అధికారాలిచ్చాం. ఆనాడు ఆ అధికారాలను దుర్వినియోగం చేసింది అధికార గణాలే కదా? ఆ అధికారుల నిరంకుశ చర్యలకు మూల్యం చెల్లించింది రాజకీయాల్లో ఉన్న మేమే కదా' అని సమాధానం చెప్పారు. ఆ మాటలు వాస్తవం. అధికారం అంటూ రావాలే గానీ, నూటికి 90 మంది అంతులేని అహంకారాన్ని ప్రదర్శిస్తారు. కాబట్టి ఇవేవో దుష్ట రాజకీయ శక్తుల వల్ల మాత్రమే జరుగుతున్నాయనుకోవటం పొరపాటు.

**నిరంతర జాగురూకత ముఖ్యం**

ఎమర్జెన్సీ మనకు నేర్పిన గుణపాఠాలేమిటి? అధికారం ప్రజల సంక్షేమం కోసం ఉపయోగపడాలంటే నిజాయతీతో సుపరిపాలన కొనసాగటం సాధ్యమయ్యే వ్యవస్థను మనం రూపొందించుకోవాలి. కోట్లు ఖర్చు చేసి పదవుల్ని పొందడం, మళ్ళీ ఆ అధికారాన్ని ఆసరాగా చేసుకుని అంతకు పదింతలు సంపాదించడం, ఆ అక్రమార్జన కోసం అధికార యంత్రాంగాన్ని పావుల్లాగా వాడుకోవడం, అమాయక ప్రజలను దోచుకోవడం, చట్టబద్ధపాలనను తుంగలో తొక్కడం మన రాజకీయాల్లో నిత్యకృత్యాలయ్యాయి. ముందుగా ఎన్నికల్లో అక్రమ ఖర్చు కోసం సరఫరా అయ్యే డబ్బుపైన నియంత్రణ ఉండాలి. అందుకు నిర్దిష్టమైన ఆచరణసాధ్యమైన సంస్కరణలున్నాయి. ఎన్ని నియంత్రణలున్నా పదవుల్ని ఆసరాగా చేసుకుని ఎడాపెడా ఆర్జించే మార్గాలున్నంత కాలం ఎన్నికల్లో అపరిమిత ఖర్చు, అర్హత లేనివారు సైతం అత్యుత్సాహంతో పోటీపడటం, గెలుపు కోసం అంతులేని అక్రమాలు కొనసాగుతూనే ఉంటాయి. కాబట్టి చట్టసభ నుంచి రాజ్యాధికారాన్ని వేరుచేయడం, దామాషా పద్ధతిన ఎన్నికలు జరపడమనే రెండు మౌలిక మార్పులను చేపట్టాలి. వీటితోపాటు నిరంతర జాగురూకతతో పౌరులు పాలకుల ఆగడాలకు అడ్డుకట్ట వెయ్యాలి. పాలనను వికేంద్రీకరించి ప్రజలకు జవాబుదారీగా ఉండేలా పెనుమార్పులకు శ్రీకారం చుట్టాలి. వ్యవస్థలో ఈ సమూల సంస్కరణల్ని సాధించేదాకా మన ప్రజాస్వామ్యం సార్థకం కాదు. ఎమర్జెన్సీ మనకు నేర్పిన నిజమయిన గుణపాఠం అదే. ఈ వ్యవస్థ వల్ల లాభపడుతున్న రాజకీయ నాయకులు, అధికారులు మార్పు కోసం సిద్ధపడరు. పరిస్థితులు మారితే నష్టం వారికే. కాబట్టి మార్పు ప్రజల నుంచి, మన మస్తిష్కం నుంచి రావాలి. మనం బాగానే ఉన్నాం కదా, ఎవరి పౌర హక్కులకు, జీవితాలకు ఏ నష్టం జరిగితే మనకేం- అని సంకుచిత దృష్టితో ఆలోచిస్తే అందరికీ మిగిలేది సంకెళ్ళే.

**(జేపీ 'భవిష్యత్ భారతం' కాలమ్‌లో భాగంగా జులై 01, 2001న ఈనాడులో ప్రచురితమైన వ్యాసం)**

**జూన్ 2022 - ఎమర్జెన్సీ విధించి 47 ఏళ్లు)**

# జిల్లాలో కొత్త రాజకీయ శక్తి ఏర్పాటు కావాలి: భీశెట్టి

**అధ్యక్ష,కార్యదర్శి గా బాధ్యతలు చేపట్టిన దామోదర్,ప్రసాద్,!!**

విజయనగరం జిల్లాలో ఒకప్పటి రాజకీయాలు నేటి రాజకీయాలు చూసినవారికి చాలా ఆవేదన కలుగుతుందని ప్రస్తుతం నడుస్తున్న కుటుంబ రాజకీయాల స్థానే జిల్లాలో కొత్త రాజకీయ శక్తిని ఏర్పాటు చేయాలని లోక్‌సత్తా పార్టీ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి అన్నారు పార్టీ జిల్లా కార్యాలయంలో జరిగిన జిల్లా పార్టీ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా అభివృద్ధి, పరిపాలన వ్యవస్థ కోసం మాట్లాడుకోవలసిన ప్రజలు ఎవరి కుటుంబం నుండి ఎవరు పోటీ చేస్తారు, ఎవరు ఎప్పుడు ఏ పార్టీ లోకి చేరిపోతారో మాట్లాడు కోవడం చూసి తాను ఆవేదన చెందుతున్నానని భీశెట్టి అన్నారు, విజయనగరం జిల్లా పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో లోక్‌సత్తాపార్టీ తరపున పెద్ద ఎత్తున ప్రజా సమస్యలపై ఉద్యమాలు చెయ్యాలని పార్టీ జిల్లా ప్రతినిధులకు సూచించారు, జిల్లాలో తాగునీటి ప్రాజెక్టులు ఎక్కడివక్కడే పెండింగులో ఉన్నాయని, కొత్త పరిశ్రమలు రాకపోగా ఉన్న పరిశ్రమలు మూతపడ్డాయని, నాయకులు ఎన్నికల్లో గెలుపుకోసం ఆలోచిస్తున్నారుగాని ప్రజా సమస్యలపై కనీసం స్పందించడం లేదని దుయ్యబట్టారు, పార్టీ జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికైన పార్టీ సీనియర్ నాయకులను,నగర కమిటీ ప్రతినిధులను ఆయన ఘనంగా సత్కరించారు!!

**జిల్లా నూతన అధ్యక్ష,కార్యదర్శులు,కార్యవర్గం!!**

లోక్‌సత్తాపార్టీ విజయనగరం జిల్లా అధ్యక్షుడుగా ఆకుల దామోదర్(బొబ్బిలి) కార్యదర్శిగా కాండ్రేగుల ప్రసాద్(ఎస్.కోట) ఏకగ్రీవంగా ఎన్నికైయ్యారు,జిల్లా ప్రతి నిధులుగా శ్రీమతి రాయి పద్మావతి, (నెల్లిమర్ల) జి.సత్యనారాయణ (చీపురుపల్లి)వగ్రీ విష్ణు(గజపతినగరం)మిడతాన అప్పారావు (ఎస్.కోట) ఏ.నాగభూషణం (విజయనగరం) సురేష్(బొబ్బిలి) కొత్త సునీల్(రాజాం)దేవర సత్యనారాయణ (ఎచ్చెర్ల) తో పాటుగా విజయనగరం నగర అధ్యక్షుడు, కార్యదర్శిగా తాత్రాజు రాజారావు, పి.ఎల్.ఎన్.రాజులను పార్టీ నాయకులు ఎన్నుకున్నారు.

**రాష్ట్రంలో రైతు కుటుంబాలు**

# సంక్షోభంలో ఉన్నాయి

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రైతు భరోసా రైతుల ఖాతాలో జమచేసిన ప్రతిసారి రాష్ట్రంలో రైతులు ఆనందంగా ఉన్నారని చెప్పడం సరికాదని రాష్ట్రంలో వరి పండించిన రైతులు గత ఖరీఫ్,రబీలో నానా ఇబ్బందులు పడ్డారని నేటికీ ధాన్యం అమ్ముకోలేక,అమ్మిన వాటికి డబ్బులు ప్రభుత్వం నుండి చేతికి రాక ఆందోళన చెందుతున్న రైతులు ఉన్నారని లోక్ సత్తాపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి ఆరోపించారు రైతు భరోసా పేరుతో 23, 875 కోట్ల రూపాయలు రాష్ట్రంలో ప్రయోజనం లేని పంపకాలు జరుగుతున్నాయని, తాను పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కావాలని,వ్యవసాయం లాభసాటి కావాలని రైతులు ఆశ పడుతున్నారని, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆ దిశగా అడుగులు వేయాలని,రాష్ట్రంలో చెరకు రైతులకు ప్రభుత్వం ఊహించని రీతిలో అన్యాయం చేసిందని 6 సహకార చక్కెర ఫ్యాక్టరీలు మూసివేసి, మరో 4 సహకార ఫ్యాక్టరీలను త్రిశంకుస్వర్గంలో ఉంచిందని, ముఖ్యమంత్రి వారిని ఆదుకుంటామని ఎన్నికల సమయంలో చెప్పి మాట తప్పారని భీశెట్టి అన్నారు,





# అమరవీరులకు ఘన నివాళి

తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా లోక్‌సత్తా పార్టీ తెలంగాణ రాష్ట్రశాఖ, తెలంగాణ ఉద్యమ సమితి సంయుక్తంగా అమరవీరుల స్తూపం వద్ద ఘనంగా నివాళులర్పించారు. లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు తుమ్మనపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ స్వపరి పాలన ఏర్పడి ఎనిమిదేళ్లయినా 1969 నాటి ఉద్యమ ఆకాంక్షలు నెరవేరలేదన్నారు. అనంతరం పీపుల్స్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో 1969 నాటి ఉద్యమకారులను సన్మానించారు. జంగంరావ్ గౌడ్, జయప్రకాశ్, అశోక్‌యాదవ్, డాక్టర్ జగన్మోహన్, డా. కె.వెంకట్‌రాజు, రాందాస్, కిషన్‌లాల్, కొండా స్వామి, శంకర్‌నారాయణ, దండు శంకర్, దయానంద్, అన్వర్‌ఖాన్, అశోక్ కుమార్, కాజుపేట సత్యనారాయణ, బత్తుల నారాయణ, డిల భైరవరెడ్డిలను సత్కరించారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలను ఆమోదించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు నందిపేట రవీందర్, పగిడి లక్ష్మీనారాయణ, పొల్లా అమర్, వంశీకృష్ణ, రంగాచారి, పార్థసారధి, రాజీవ్, ఆంజనేయులు, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

# నిర్లక్ష్యంతో నీరుగారుతున్న ఆశయం

## -గ్రామ న్యాయాలయాలపై అలక్ష్యం-

- ఏలేటి ప్రభాకర్‌రెడ్డి

దేశానికి పట్టుగొమ్మలైన గ్రామాలు సుదృఢ శాసన, కార్యనిర్వాహక వ్యవస్థలుగా, న్యాయపాలికలుగా పరిఢవిల్లాలన్నది జాతిపిత మహాత్మాగాంధీ ప్రగాఢ ఆకాంక్ష. పల్లెలో ఇంటి ముంగిళ్లలోనే గ్రామీణులకు సత్వర న్యాయం అందిస్తూ ఆ మహాత్ముడి కలలను సాకారం చేయాలన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం గ్రామ న్యాయాలయాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. రాష్ట్ర ప్రభుత్వాల ఉదాసీనతతో ఆ ఆశయం నీరుగారిపోతోంది. గ్రామాల్లోని పేదలకు సత్వర న్యాయం ఎండమావిగానే మిగులుతోంది. చిన్నచిన్న వివాదాలకూ పల్లెవాసులు కోర్టుల మెట్లు ఎక్కుతూ ఆర్థికంగా నష్టపోతున్నారు.

గ్రామాల్లో ఆర్థికంగా, సామాజికంగా వెనకబడిన వారితోపాటు ప్రతి ఒక్కరికీ న్యాయ సలహాలు, సత్వర న్యాయం దక్కాలన్న ఉద్దేశంతో కేంద్ర చట్టం ద్వారా 2009 అక్టోబరులో గ్రామ న్యాయాలయాల వ్యవస్థకు శ్రీకారం చుట్టింది. వాటిని ఏర్పాటు చేసుకునే అధికారాన్ని అన్ని రాష్ట్రాలకూ కల్పించిన కేంద్రం- ఒక్కో గ్రామ న్యాయాలయానికి రూ.18 లక్షలు మంజూరు చేస్తుంది. ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు తమ పరిధిలోని హైకోర్టు సూచనల మేరకు పల్లె న్యాయపాలికలను కొలువు తీర్చాలి. రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యంతో వాటి ఏర్పాటు, నిర్వహణ నిరాశాజనకంగా తయారయ్యాయి. 15 రాష్ట్రాల్లో తొలి విడతగా రూ.81.53 కోట్లతో 476 గ్రామ న్యాయాలయాలను ఏర్పాటు చేయాలని కేంద్రం నిర్ణయించింది. ప్రస్తుతం 256 మాత్రమే కొనసాగుతున్నాయి. తెలంగాణకు 55, ఆంధ్రప్రదేశ్‌కు 42, జమ్మూ కాశ్మీర్‌కు 20, లద్దాఖ్, గోవాకు రెండు చొప్పున గ్రామ న్యాయస్థానాలను కేటాయించినా, ఒక్కటీ ప్రారంభం కాలేదు. ఉత్తర ప్రదేశ్‌లో 113కు 43, మహారాష్ట్రలో 36కు 23, ఒడిశాలో 23కు 19, పంజాబ్‌లో తొమ్మిదికి రెండు, ఝార్ఖండ్‌లో ఆరుకు ఒక గ్రామ న్యాయాలయాన్నే నిర్వహిస్తున్నారు. మధ్యప్రదేశ్ (89), రాజస్థాన్ (45), కేరళ (30)లలో పూర్తిస్థాయిలో వాటిని ఏర్పాటు చేశారు. గ్రామ న్యాయాలయాల కోసం కేంద్రం తెలంగాణకు రూ.6.93 కోట్లు, ఆంధ్రప్రదేశ్‌కు రూ.4.36 కోట్లతో పాటు ఇతర రాష్ట్రాలకు నిధులు కేటాయించింది. చాలా రాష్ట్రాలు వాటి ఏర్పాటు గురించి పట్టించుకోవడం లేదని గత డిసెంబరులో కేంద్ర న్యాయశాఖ మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. కేంద్రం నిధులు ఇచ్చినా వాటిని సద్వినియోగం చేసుకోవడం లేదంటే గ్రామాల్లోని పేద, సామాన్య పౌరులకు న్యాయం అందించడంలో రాష్ట్ర ప్రభుత్వాలకు ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థమవుతుంది.

దేశంలో నేరాలు పోనుపోను పెచ్చరిల్లుతున్నాయి. జాతీయ



నేర గణాంక సంస్థ (ఎన్‌సీఆర్‌బీ) లెక్కల ప్రకారం, 2019తో పోలిస్తే 2020లో నేరాలు 28 శాతం పెరిగాయి. ఏటా అధికమవుతున్న నేరాల విచారణ న్యాయస్థానాలకు తలకుమించిన భారంగా మారుతోంది. కేసులు గుట్టలుగా పేరుకుపోతుండటంతో పౌరులకు సత్వర న్యాయం అందడం లేదని గతంలో ఎంతోమంది న్యాయమూర్తులు వ్యాఖ్యానించారు. సుప్రీంకోర్టులో 2021, డిసెంబరు 6 నాటికి 69,855 కేసులు, అన్ని రాష్ట్రాల్లోని హైకోర్టుల్లో గతేడాది డిసెంబరు 10 నాటికి 56,41,212 కేసులు పెండింగులో ఉన్నాయని కేంద్ర న్యాయశాఖ ఇటీవల పార్లమెంటుకు నివేదించింది. ఇక దేశంలోని దిగువ కోర్టుల్లో నాలుగు కోట్ల దాకా కేసులు అపరిష్కృతంగా పడి ఉన్నాయి. అన్ని న్యాయస్థానాల్లో కలిపి 2010-20 మధ్య పెండింగ్ కేసులు ఏటా 2.8 శాతం చొప్పున పెరిగాయి. కరోనా కారణంగా 2019-20 మధ్య కాలంలోనే హైకోర్టుల్లో 20 శాతం, కింది కోర్టుల్లో 13 శాతం పెండింగ్ కేసులు అధికమయ్యాయి. అలా పోగుపడే కేసులతో పేద, సామాన్య ప్రజలకు సత్వర న్యాయం ఎలా అందుతుందో రాష్ట్ర ప్రభుత్వాలు ఆలోచించాలి.

గ్రామాల్లో ఎక్కువగా భూ వివాదాలు, దాయాదుల మధ్య తగాదాలు, తల్లిదండ్రులు, భార్యాభర్తల మధ్య గొడవలకు సంబంధించిన అంశాలే ఉంటుంటాయి. రాజీ కుదుర్చుకునే చిన్నచిన్న వివాదాల్లోనూ కొందరు పంతాలు పట్టింపులకు పోయి, అవగాహన కొరవడి కేసులు నమోదు చేస్తున్నారు. కోర్టుల చుట్టూ తిరుగుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆరోగ్యాన్ని, విలువైన సమయాన్ని నష్టపోతున్నారు. ఈ తరుణంలో రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామాల్లో న్యాయాలయాలు ఏర్పాటుకు చొరవ చూపాలి. వాటి ద్వారా చిన్నచిన్న వివాదాల్లో రాజీకి ప్రయత్నించాలి. ఇళ్ల దగ్గరే అవసరమైన న్యాయ సలహాలు అందిస్తూ పల్లెల్లో శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పాలి.

(కర్టెసీ: ఈనాడు)

# పార్టీ పునర్నిర్మాణం - ఆరోగ్య తెలంగాణ కోసం కార్యక్రమాలు

## లోక్‌సత్తా రాష్ట్ర కార్యవర్గ సమావేశం తీర్మానాలు

**లోక్‌సత్తా/ ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్) రూపొందించిన సమగ్ర ఆరోగ్య పథకం అమలు ద్వారా ప్రజలందరికీ జేబు ఖర్చులేని ఆరోగ్యాన్ని అందించే లక్ష్యాన్ని సాధించే క్రమంలో జూన్/జులైలో ఆరోగ్య తెలంగాణ సంకల్ప సభను ప్రతినిధులతో నిర్వహించాలని లోక్‌సత్తా పార్టీ తెలంగాణ రాష్ట్ర విభాగం తీర్మానించింది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మనపల్లి శ్రీనివాసు అధ్యక్షతన లోక్‌సత్తా రాష్ట్ర కార్యవర్గ సమావేశం హైదరాబాద్ పీపుల్స్ ఎడ్యుకేషన్ ట్రస్ట్‌లో జరిగింది. సమావేశం ఆమోదించిన ఇతర తీర్మానాలు:**

- రాష్ట్రంలో త్వరలో చేపట్టనున్న 'ఆరోగ్య తెలంగాణ' కార్యక్రమాన్ని విజయవంతం చేయటానికి 100 పట్టణాలలో బాధ్యుల నియామకం. జిల్లాల్లో రాష్ట్ర కార్యవర్గ సభ్యులే బాధ్యత తీసుకోవటం.
- పార్టీ అనుబంధ విభాగాలను (యువసత్తా, మహిళాసత్తా, విద్యార్థిసత్తా, కార్మికసత్తా, లీగల్ సెల్, బీసీ సెల్, ఎస్సీ సెల్, ఎస్టీ సెల్, మైనారిటీ సెల్, ఐటీ సెల్ మొదలైనవి) బలోపేతం చేయటం. గతంలో సేవలందించినవారితో కూడా సంప్రదింపులు జరిపి తగు చర్యలు తీసుకునేందుకు పార్టీ నేతలు నందిపేట రవీందర్, మెట్ల జగన్, తీగలపల్లి రంగాచారి, వంశీ ప్రసాద్, రావెళ్ల రవికి బాధ్యతలు.
- లోక్‌సత్తా పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసి పునర్నిర్మాణం చేయటం. ఇందులో భాగంగా పార్టీ లక్ష్యాల సాధనలో సమాజ సేవకులను, వివిధ రంగాల ప్రముఖులను, అనుభవజ్ఞులను, వృత్తి సంఘాలను, ప్రజాసేవ పట్ల ఆసక్తి ఉండి సమయం ఇచ్చేవారిని కూడా భాగస్వాముల్ని చేయటం.
- రాష్ట్రంలో మహిళల సమస్యల పరిష్కారానికి ఒక రాష్ట్ర స్థాయి బృందం ఏర్పాటు. ఈ బాధ్యతల్ని శ్రీమతి పారిజాత తీసుకుంటారు.
- నారగోని ఆధ్వర్యంలో వివిధ పార్టీల భాగస్వామ్యంతో ఏర్పడిన 'తెలంగాణ బహుజన ఫ్రంట్'లో చేరాలని లోక్‌సత్తా పార్టీని ఆహ్వానించారు. అయితే లోక్‌సత్తా పనిచేస్తున్న ఎజెండా ప్రాతిపదికనే ఫ్రంట్‌తో కూడా కలిసి పనిచేసే అవకాశముంది. ఈ విషయంలో సాధ్యాసాధ్యాల చర్చ అనంతరం తుది నిర్ణయం లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ సూచనల మేరకే ఉంటుంది.
- ఎన్నికల్లో డబ్బు, మద్యం, బహుమతులు వంటివి విచ్చలవిడిగా పంపిణీ అవుతున్నాయి. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న ఆ రాజకీయాన్ని నిలువరించాలి. ఇందుకుగాను ఎన్నికల సంఘానికి లేఖలు రాయటంతోపాటు, ఎన్నికల సంస్కరణల కోసం ప్రజాభిప్రాయాన్ని కూడగట్టటం.
- రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యమంత్రి, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారాలకు కృషి చేయటం.

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్ని జూన్ 2న ఘనంగా నిర్వహించాలని సమావేశం తీర్మానించింది.

సమావేశాన్ని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నందిపేట రవీందర్ ప్రారంభించగా, మెట్ల జగన్, పార్థసారధి, అజయ్ మారుతిరావు, లక్ష్మీనారాయణ, ఇస్మాయిల్, ఆంజనేయులు, అమర్, మేకల నర్సింహారెడ్డి, వంగాల రంగాచారి, మిరియాల చంద్రశేఖర్ తదితరులు మాట్లాడారు.






# నేటి మన పెంపకమే.... రేపటి వారి భవిత!

ఆమె సింగిల్ పేరెంట్ . కొడుకు మూడేళ్ళ వయసులో ఉండగా భర్త చనిపోయాడు . కొడుకే తన భవిష్యత్తుగా బతుకుతోంది. అతడు ఐఐటీలో సీటు సాధిస్తే జీవితం స్థిరపడినట్టే అని భావించింది. ఐదో తరగతి దాకా బుద్ధిగా చదివే వాడు . తొంభై శాతానికి పైగా మార్కులు వచ్చేవి . కానీ వాడి మార్కులు ఈ మధ్య బాగా తగ్గిపోతున్నాయి . ఎంత చెప్పినా చదవడు. చదవమంటే విసుక్కొంటాడు . బలవంత పెడితే చదివి నట్టు నటిస్తాడు .ఒక్కో సారి తనపైకే తిరగబడుతాడు . ఇంటినుంచి పారిపోతానంటాడు . మొన్నటికి మొన్న పరీక్షల్లో నలభై మార్కులు కూడా రాలేదు . తాను చేసిన తప్పేంటో తనకు తెలియదు . భర్తతో పాటే తానూ చనిపోతే బాగుండనిపిస్తుంది . రాత్రుళ్ళు దిండు ఒక పక్క తడిసిపోతోంది . ఆమె కన్నీటికి అంతం ఎప్పుడు? ఎలా?

ఒక పట్టణంలో అదొక సింగల్ బెడ్ రూమ్ అపార్ట్మెంట్..అక్కడొక దిగువ మధ్య తరగతి కుటుంబం . తాము సరిగ్గా చదువు కోలేదు . కానీ పిల్లల్ని బాగా చదివించాలని ఊళ్లోని పొలం, ఇల్లు అమ్మి పట్నం వచ్చి పిల్లల్ని 'మంచి స్కూల్' లో చదివిస్తున్నారు . ఐఐటీ లో సీట్ కొట్టి ఏరోనాటికల్ ఇంజనీర్ అవుతానని పెద్దాడు , డాక్టర్ అవుతానని అమ్మాయి చెప్పేవారు. పెద్దాడు ఇప్పుడు పదోతరగతి . మాథ్స్ లో ముప్పై దాటడం లేదు . అసలు పదో తరగతి గండం గట్టెక్కుతాడన్న నమ్మకం పోయింది . మూడేళ్ళుగా తాను ఎంత మొత్తుకొంటున్నా వాడి ధోరణి వాడిదే !చిన్నది ఎనిమిదో తరగతి . పాత అప్పులాడు ఇంటి ముందు ఒక పక్క తిరుగుతుంటే తనకు ఆపిల్ ఫోన్ కావాలని, తన ఫ్రెండ్స్ సమ్మర్లో దుబాయ్ టూర్ వెళుతున్నారని మనం కూడా వెళుదామని ఒకటే గోల !' పిల్లలని ఎందుకు కన్నమురా దేవుడా ! ఇదేమి శిక్ష ? 'అని వారికి అనిపిస్తుంది . ఏమి చెయ్యాలో పాలు పోవడం లేదు .

అతనొక బడా కాంట్రాక్టర్..కోట్ల ఆస్తి..కొడుకు, కూతురు చదవి ఇంకొకరి ఉద్యోగం చేయాల్సిన అవసరం ఏం ఉంది? కొడుకు కూతురు ఎంబీఏచేసి తన తరువాత తన బిజినెస్ చూసుకొంటే చాలు . అందుకే ఇంటర్నేషనల్ స్కూల్ లో చదివించాడు . ఇద్దరినీ స్కూల్ లో డ్రాప్ చేయడానికి లగ్జరీకారు .డ్రైవర్ . అయిదేళ్ల క్రితం డ్రగ్స్ కేసులో కొడుకు పేరు పోలీస్ రికార్డ్స్ లోకిఎక్కింది . తన పరపతిని డబ్బు ను ఉపయోగించి దాన్నుంచి బయట పడవేసాడు .ఇప్పుడుపదకొండో తరగతి లో ఉన్న కూతురిదే అదే దారి. ముప్పై ఏళ్ళ క్రితం కట్టుబట్టల తో నగరానికి వచ్చాడు..కష్టనష్టాలు భరించి కోట్లకు అధిపతి అయ్యాడు. జీవితం లో విజేత అనుకొని బతుకుతున్న తనకు పిల్లలు పెద్ద జర్క్ ఇచ్చారు . వారు తనని తన జీవితాన్నిఫెయిల్యూర్ గా నిలిపేలా వున్నారు . ఏమైనా చేస్తాను . నేను గెలవాలి . కోట్లు ఖర్చుయినా పరవాలేదు . తాను ఫెయిల్ కాకూడదు . ఇదినయా శ్రీమంతుడి ఆలోచనలు .

సిటీ లో అదొక మిడిల్ క్లాస్ అపార్ట్మెంట్..ఇద్దరు అబ్బాయిల మధ్య సంభాషణ.



చిన్నప్పుడు స్కూల్నుంచి ఇంటికి రాగానే మమ్మీ ఎత్తుకొనేది . ముద్దాడేది . నేను కబుర్లు చెప్పేవాడిని . మా చెల్లి పుట్టింది. : మా అమ్మ, నాన్న ఎప్పుడూ మా చెల్లితోనే ఉంటారు... నా తో మాట్లాడేది తక్కువ . మాట్లాడినా ' హోమ్ వర్క్ అయ్యిందా ? ఎన్ని మార్కులు వచ్చాయి ? చదువు ఎలా ఉంది ? ఇంతే ఇంతకన్నా వారికి నాతో మాట్లాడడానికి ఏమీ ఉండదా ? సైన్స్లో 96 శాతం వచ్చాయి. మా నాన్న సంతోషిస్తాడనుకుంటే మిగతా మార్కులు గాడిదకు వదిలేసావా వెదవ ?చీరేస్తా ! అంటూ కోప్పడ్డారు. దీనికి అతని ఫ్రెండ్ .. ' అరేయ్! నీ పరిస్థితి బెటర్ . నాది మరీ ఘోరం . మా నాన్న ఎప్పుడు టీవీ తో బిజీ . ఆయన లోకంలో ఆయను ఉంటాడు.. మా నాన్నకు లెక్కలు బాగా వచ్చని ఏదైనా డౌటు అడిగితే టైమ్ లేదు మీ టీచర్ను అడగమంటారు. మా అమ్మ కిట్టీ పార్టీలు, వాట్సాప్లో బిజీ.

నేటి పిల్లలే తలిదండ్రుల పాలిట విలన్ లా ? లోపం ఎక్కడుంది ? తలిదండ్రుల్లోనా లేక పిల్లల్లోనా ? స్కూళ్లలోనా ? పెంపకం లోనా ? విద్య విధానం లోనా ? మొత్తం సమాజం లోనా ?

**పిల్లలు దేవుడు చల్లని వారే**

1 .పిల్లలను వేరే వారితో పోల్చవద్దు. చేప, పక్షిలా ఎగరలేదు. ఏనుగు, కోతిలా చెట్టెక్కలేదు. మీ బిడ్డ లోని నైపుణ్యాన్ని, ప్రత్యేకతను గుర్తించి, దానికి సానపెట్టండి .

2 . 'మా వాడు డల్' ..' మొద్దు' ..' సరిగా చదవడు' లాంటి నెగటివ్ మాటలు మాట్లాడొద్దు . అవి నెగటివ్ సజెషన్స్గా పని చేస్తాయి. వారి మెదడులో తిష్ట వేస్తాయి .ఆత్మ విశ్వాసాన్ని , సామర్థ్యాన్ని దెబ్బ తీస్తాయి . ఎప్పుడూ ప్రోత్సహించే మాటలు మాట్లాడండి . ఒక వేళ తక్కువ మార్కులు వస్తే ' నీ కెపాసిటీకి ఇంకా ఎక్కువ మార్కులు సాధించగలవు! ఈ సారి గట్టిగా ప్రయత్నించు.! తప్పక సాధిస్తావు!! ' లాంటి ప్రోత్సహించే మాటలు చెప్పండి. మీరు పదే పదే వారిలో పాజిటివ్ ఎనర్జీ నింపితే అది తప్పక పని చేస్తుంది. దీన్నే న్యూరో లింగ్విస్టిక్ ప్రోగ్రామింగ్ అంటారు .

3. ఐనిస్టీన్, సినిమా నటుడు కాలేదు. అమితాబ్, సైంటిస్ట్ కాలేదు. సచిన్, కర్ణాట కసంగీతం నేర్వలేదు . సుబ్బలక్ష్మి అమ్మ, ఫిజిక్స్ ప్రొఫెసర్ కాలేదు . అందరూ అన్ని రంగాల్లో రాణించరు. మన బిడ్డ అన్ని రంగాల్లో అద్భుత ప్రతిభ సాధించాలని ఆశ

పడకండి. హై స్కూల్ ముగిసే దాకా వారికి అన్నీ రుచి చూపాలి. అంటే అన్ని సబ్జెక్టులు, అన్ని రకాల క్రీడలు మొదలైనవి. వారి వారి ఆప్టిట్యూడ్‌ని బట్టి వారు కొన్ని రంగాల్లో ప్రతిభ కనబరుస్తారు . దాన్ని అర్థం చేసుకొని ఆ ఫీల్డ్‌లో వారు ముందుకు సాగేలా వారి కెరీర్‌ను ప్లాన్ చెయ్యండి. మీ అభిరుచిని పిల్లలపై బలవంతంగా రుద్దొద్దు .' మన వంశంలో ఎవరూ డాక్టర్ కాలేదు' .' నువ్వు డాక్టర్ కావాలి' .' పక్కింటి అబ్బాయి ఐఐటీ లో సీట్ సాధించి అమెరికా లో స్థిరపడ్డాడు . నువ్వు అదే దారిలో వెళ్లాలని టార్గెట్‌లు నిర్ణయించకండి.

4 . 'చదువు... చదువు 'అని అదేపనిగా రోజూ చెప్పకండి. ఇలా చేస్తే వారిలో చొరవ , సొంత కాళ్లపై నిలబడగలిగే, నాయకత్వ లక్షణాలు అభివృద్ధి చెందవు . రోజూ అదే పనిగా మీరు నస పెడితే, మీ మాటను వినడం, పట్టించుకోవడం మానేస్తారు. ముఖ్యంగా ఆరో తరగతికి వచ్చిన దశలో పిల్లలను దగ్గర కూర్చో పెట్టుకొని వారి భవిష్యత్తుకు చదువు ఎంత ముఖ్యమో ఒక అరగంట చెప్పండి. ' ఒకప్పుడు మన పూర్వీకులది గ్రామీణ జీవనం. కుల వృత్తి. పెద్దగా చదవకున్నా అదే వృత్తిలో రాణించే అవకాశం ఉండేది. ఇప్పుడలా కాదు. ఎంత ఆస్తి సంపాదించినా అది త్వరిత గతిన విలువ కోల్పోతుంది. చదువులో వెనుక బడితే మంచి ఉద్యోగం రాదు. లేదా వ్యాపార రంగం అయినా పెద్దగా ప్రగతి ఉండదు. అంతంత మాత్రం చదువు.. అత్తెసరు ఆదాయం.. బతుకు దుర్భరం అయిపోతుంది. ఇప్పుడైతే మేము సంపాదిస్తున్నాము. కొన్నేళ్ళకు మా ఆదాయం అడుగంటి పో తుంది. మేము గోడపై ఫొటోలుగా మారిపోతాము . అప్పుడు నీ కుటుంబం? పిల్లలు?.. రాబోయే రోజుల్లో ఏ రంగం అయినా పోటీ అధికం. రోబోలు సగం ఉద్యోగాలను ఎత్తుకెళ్ళి పోతాయి. మంచి ప్రతిభ పాటవాలను కనబరిచిన వారిదే భవిత. దీనికి పునాది నీ చదువు. నాకు తెలుసు నువ్వు బాగా చదవగలవు. రోజూ నేను చెప్పను . చెప్పాల్సిన అవసరం లేదు. స్కూల్ నుంచి వచ్చాక , సెలవు దినాల్లోనీ దిన చర్య / చదివే ప్రణాళిక నువ్వే తయారు చేసుకో. దాన్ని ఫాలోకా. నువ్వు చేస్తావు నాకు తెలుసు. అవసరంఅయితే నా సాయం అడుగు ' అని చెప్పండి.

5. తయారు చేసుకొన్న ప్రణాళిక వారు పాటిస్తున్నారా? లేదా ? గమనించండి. ఒక రోజు ప్రణాళిక తప్పితే వెంటనే హెచ్చరించకండి. వదిలెయ్యండి ! కానీ అదే పనిగా వారు దాన్ని ఉల్లంఘిస్తూ , సరిగ్గా చదవక కేవలం కాలక్షేపం చేస్తూ ఉంటే అప్పుడు మీ ఫీలింగ్స్ ను వారి ముందు పెట్టండి. కూల్‌గా చెప్పండి. 'నేను ఇన్ని చెప్పినా నువ్వు పట్టించుకోలేదు. సరే! నేను మాత్రం నా పనిఎందుకు చేయాలి ? వంట వండాలి అంటే నాకు కష్టం. బోర్.. ఈ రోజు వంట వండను. పడుకొంటాను. లేదా టీవీ ముందు కాలక్షేపం చేస్తాను . డ్యూటీ కి పోను . సస్పెండ్ అయినా ఉద్యోగంపోయినా లేదా వ్యాపారం లో నష్టం వచ్చినా పట్టించుకోను. నీకు నీ డ్యూటీ పై శ్రద్ధ లేనప్పుడు నేనెందుకు కష్టపడాలి? 'ఇలా సుతి మెత్తగా మీ బాధను, కన్సర్న్‌ను వారికి అర్థం అయ్యేలా చెప్పండి. సున్నితంగా వ్యవహరించండి. కసురుకోవద్దు. కొట్టొద్దు. తిట్టొద్దు. ఆలా చేస్తే వారిలో సున్నితత్వం దెబ్బ తింటుంది. మొద్దుబారి పోతారు. మీ మాటలు పట్టించుకోవడం మానేస్తారు. లేదా అబద్దాలు చెప్పడం మొదలు పెడుతారు. వారి భాద్యత తెలిసి వారి కాళ్ళ పై వారు నిలబడేలా ప్రోత్సహించండి.

6. సెల్ ఫోన్ పిల్లల చేతిలో బాంబు . అది ఎప్పుడైనా పేలుతుంది. దాన్ని వారికి ఇవ్వొద్దు . లాగేసుకోండి . ఇది వరకే బాగా అడిక్ట్ అయివుంటే వారికి కౌన్సిలింగ్ ఇప్పించండి. ఏదో కాసేపు ఆడుకొంటారు అనుకోకండి. తాగుబోతుల వ్యవహారం బీరు తోనే మొదలు అవుతుంది. అదీ ఎప్పుడో ఒక సారి.. ఫ్రెండ్ ప్రోత్సాహంతో.. జస్ట్ చూద్దాము అని.. అటు పైన హాట్ డ్రింక్స్.. ఒక పెగ్గు.. రెండు.. క్వార్టర్.. హాఫ్ బాటిల్.. చివరకు రోజంతా.. సెల్ ఫోన్‌ను మద్యపానంతో పోలుస్తున్నాను అని ఏమీ అనుకోకండి. ఇది అంతకంటే ఘోరం . డోపమైన్ అడిక్షన్.. రెండింటిలో కారణం. దీనికి తోడు ఇరవై అయిదు ఏళ్ళ లోపు వ్యక్తుల్లో ప్రీ ఫ్రంటల్ కార్టెక్స్ అనే మెదడు భాగం సరిగా అభివృద్ధి చెందివుండదు. అందుకే పిల్లలు దేనికైనా అడిక్ట్ అయితే దాని నుంచి వారిని బయటపడెయ్యడం చాలా కష్టం. సెల్ ఫోన్ అంటే అది హెల్ ఫోన్. అది పిల్లల పాలిట శాపం. వారి జీవితాన్ని నరకం చేస్తుంది. కష్టపడి కాదు .. ఇష్టపడి చదవాలి. పాఠశాలల్లో , పాఠాల్ని ఆసక్తికరంగా బోధిస్తే వారికి మరింత తెలుసుకోవాలనే కుతూహలం, తపన పెరుగుతుంది . బట్టి చదువులు కేవలం మార్కులు తెచ్చి పెడతాయి . అది వాపే కానీ, బలుపు కాదు. రోబోటిక్ యుగంలో జ్ఞాపక శక్తి ఆధారంగా వచ్చే మార్కులకు విలువ సున్నా . సమాచారాన్ని స్టోర్ చేయడం ప్రాసెస్ చేయడంలో మనిషి కంటే కృత్రిమ మేధ లక్ష రెట్లు బెటర్ . లైఫ్ స్కిల్స్, భవిష్యత్తు నైపుణ్యాలు కలిగిన చదువు అవసరం. పాఠ్య పుస్తకాలు , వారి వయస్సును బట్టి జెనరల్ పుస్తకాలు చదవడం అలవాటుచేయండి. నేర్చుకోవాలనే తపన వారిలో కలుగ చెయ్యండి. తాము నేర్చుకొన్న దాన్ని ఇతరులకు చెప్పడానికి పిల్లలు ఇష్టపడుతారు. ఒక సారి టీచ్ చెయ్యడం అంటే అయిదు సార్లు చదివినట్టే . 'ఇదేంటి' 'అదేంటి' .. 'నాకు తెలియదు .. చెప్పు' అని వారిని అడగండి . అపార్ట్‌మెంట్‌లో / వూళ్ళో/ ఇంట్లోని చిన్న పిల్లలకు వీరు ఉచితంగా పాటలు చెప్పేలా ప్రోత్సహించండి .

8. ఐఐటీ ఫౌండేషన్ కోర్స్ 20 వ శతాబ్దపు బాల్య వివాహం . బ్రిటిష్ కాలం వరకు ముక్కు పచ్చలారని పిల్లలకు పెళ్లి చేసేవారు . ఇది అలాంటిదే . ఒక విద్యార్థి ఆప్టిట్యూడ్ ఏంటి ? గణితమా ? హ్యుమానిటీస్ ?లేదా సోషల్ సైన్స్ ?అని తెలియడానికి కనీసం తొమ్మిదో తరగతి అవుతుంది . అందుకే ప్రభుత్వాలు , మేధావులు అలోచించి పదవతరగతి వరకు అన్ని సబ్జెక్ట్ లు పెట్టారు . ఆలా కాకుండా ఆరో తరగతిలోనే' మా వాడు ఐఐటీ లో సీటు కొట్టాలి 'అని చెట్టు పేరుచెప్పి

కాయలమ్ముకొనే కార్పొరేట్ కోళ్ల ఫారంలలో చేరిస్తే వారి ఆప్టిట్యూడ్ గణితంకాని పక్షం లో వారి ప్రగతి ఆగిపోతుంది . సబ్జెక్టు ను విశేషణాత్మకంగా బోధించాలి కానీ ఐఐటీ పేరుతో ఆరవ తరగతి వారికి ఎనిమిదో తరగతి పాఠాలు.. ఇలా రెండు మూడేళ్లు వయస్సుకు, క్లాసుకు మించి పాఠాలు చెప్పడం .. అయ్యో వీటిని మిస్ అయితే మన బిడ్డ వెనుక బడిపోతాడు అని తల్లిదండ్రులు వారిని కార్పొరేట్ పాఠశాలల్లో చేర్పించడం . ఆటలు , పాటలు యోగ ఇవేవీ లేక కనీసం ఇంగిత జ్ఞానం కొరవడిన లక్షలాది యువత నేడు తెలుగు రాష్ట్రాల్లో ఉన్నారంటే దానికి కారణం ఐఐటీ చదువులు . అవి చదువులు కావు . చావులు. టీచర్స్ కు టార్గెట్స్ పెట్టి బహుమానాలు ఆశ చూపే ఎంట్రన్సు పరీక్షలు పెట్టి మిమ్మల్ని బ్రెయిన్ వాష్ చేసి వారి కోట్ల వ్యాపారం సాగించేందుకు ప్రయత్నాలు జరుగుతాయి . తస్మాత్ జాగ్రత్త . వారి చదువు పైవారికి నమ్మకం ఉంటే ఎందుకు కోట లోనో మరో చోట చదివిన విద్యార్థి కి రాంక్ వస్తేకోట్లు పెట్టి కొంటున్నారు ? అసలు కార్పొరేట్ వారికి స్కూల్స్ వున్నాయి కదా ? మొత్తం రాంక్ లు అక్కడి నుంచే రావాలి కదా . ఎందుకు బాగా చదివే విద్యార్థులను ఆకర్శించడానికి స్కీం లు పెడుతున్నారు ? మెరిట్ విద్యార్థి ని ఎలాగైనా ఎత్తుకెళ్లాలని ప్రయత్నిస్తున్నారు ? అసలు వారికి వచ్చే రాంక్ ల లో అధిక శాతం మంచి స్కూల్స్ లో పదవ తరగతి దాకా చదివి ఇంటర్లో విధి లేక అక్కడ చేరిన వారివి కావా ? ఆరు నుంచి వారి దగ్గర ఐఐటీ ఫౌండేషన్ తీసుకొన్న వారు ఎంత మంది ? దీనిలో రాంక్ లు వచ్చిన వారు ఎంత మంది ? జీవితాన్ని నాశనం చేసుకొన్న వారుఎంత మంది ? సమాచారం సేకరించండి .

9 .పిల్లలను అతిగారాబం చెయ్యొద్దు . మనం పడ్డ కష్టాలు పిల్లలకు తెలియకూడదు అనుకోవడం సరికాదు . కష్టం ఏంటో , పిల్లలకు చూపించండి . సమాజం లో బడుగు బలహీన వర్గాల, పేదల జీవితాలు ఎలా వుంటాయో వారికి చూపించండి . అర్థం అయ్యేలా చేయండి . బీదవారు , దివ్యంగులు , వృద్దులు ఇలాంటి వారి పట్ల వారికి సహానుభూతి వచ్చేలా చేయండి . సానుభూతి కాదు . సహానుభూతి అంటే వారి అవతలి కోణం నుంచి ఆలోచించి వారిని అర్థం చేసుకోవడం . మీ కష్టాన్ని , మీ బాల్యాన్ని , మీ గ్రామం , వంశం , పూర్వీకులు .. ఇలా అన్నింటి పై అవగాహన వచ్చేలా వారిని పెంచండి .

10 . ఆంగ్ల బాష విశ్వ బాష . దాన్ని నేర్వాలసిందే . కానీ ఇంట్లో పిల్లలతో మాతృ బాషలోనే మాట్లాడండి . ఇంగ్లీష్ బాష పై మోజు తో మీరు బాల్యం లో పిల్లలతో ఇంగ్లీష్ లో మాట్లాడితే వారు మాతృభాషకు దూరం అవుతారు . మీ సంస్కృతీ సంప్రదాయం, చివరకు మీకు కూడా దూరం , అయ్యే ప్రమాదం వుంది . పిల్లలు మూడు భాషలు చాలా సులభంగా నేర్చుకొంటారు . స్కూల్ లో ఇంగ్లీష్ . ఇంట్లో మాతృ భాష ఇదీ పద్దతి . రెండు కంటే ఎక్కువ భాషలు నేర్చుకొన్న పిల్లల గ్రహణ/మేధో శక్తి అధికంగా ఉంటుంది .

11 . పిల్లలతో సమయం గడపండి . వారు వయసుకు తగ్గ ఆటలు ఆడండి . కథలు చెప్పండి . మీ బాల్యం గురించి, మీ జీవితం గురించి చెప్పండి . మీ బడ్జెట్ బట్టి పార్క్ లేదా అమ్మమ్మ వూరు ఊటీ ఇలా ఎక్కడికైనా అప్పుడప్పుడు కనీసం సమ్మర్ హాలిడేస్ లో తీసుకొని వెళ్ళండి . ఎక్కడికి పోయామనేది కాదు . ఎంత క్వాలిటీ టైం గడిపాం అనేది ముఖ్యం .

12. ఎదిగిన పిల్లలతో స్నేహితుల్లా వ్యవహరించండి . అదే సమయం లో వారు చేస్తున్నది తప్పు .. పదేపదే చెప్పినా చెప్పినా మీ మాట పట్టించుకోవడం లేదు అంటే స్ట్రిక్ట్ గా వ్యవహరించండి .

13 .టీన్ ఏజ్‌లో అడుగుపెట్టిన పిల్లలు ఎవరితో స్నేహం చేస్తున్నారో ఒక కంట కనిపెట్టి వుండండి . ఎక్కువ మందిచెడిపోయేది చెడుస్నేహాల వల్లే . తప్పు దారిలో పయనిస్తున్న పిల్లలు ఒకరికి కొకరు అండగా ఉంటూ తల్లిదండ్రుల్ని మిస్ లీడ్ చేస్తారు . 'లేదు ఆంటీ .. మీ అబ్బాయి తప్పు పనులు చేయడం లేదు . కేవలం కంబైన్డ్ స్టడీస్ కోసం బయటకు వెళుతున్నాము' అని దొంగ సాక్షాలు చెబుతారు . జాగ్రత్త.

14. తప్పుదారిలో పయనిస్తున్న పిల్లలు ఏకాంతాన్ని కోరుకొంటారు. గదిలో ఒంటరిగా ఉండడం , ముభావంగా ఉండడం . మీరు బయటకు వెళదామని చెప్పినా' నేను ఇంట్లోనే వుంటాను' అంటే ఏదో తేడా ఉందని అనుమానించండి .

15. పిల్లలను మంచి మార్గంలో పెట్టడానికి టీచర్ల సాయం తీసుకోండి .

16 . పిల్లలు ఎక్కువ సమయం గడిపేది పాఠశాలలో . అక్కడే వారి భవితకు పునాది పడుతుంది . మంచి పాఠశాలను ఎంపిక చేయడం ఎలా ? నన్ను అడిగితే మా పాఠశాలకు మించినది ప్రపంచంలో లేదని గాఫ్కా కొడుతాను . అడ్మిషన్లు తీసుకురాకపోతే జీతం రాదని మీ ఇంటికి వచ్చి మిమ్మల్ని అడ్మిషన్స్ కోసం అభ్యర్థించే వారు నిజాలు చెప్పగలుగుతారా ? ఒక పాఠశాల గురించి నిజాలు తెలియాలి అంటే ఆ పాఠశాలలో తమ పిల్లల్ని చదివిస్తున్న తల్లిదండ్రుల్ని అడగండి . ఇప్పుడు కార్పొరేట్ పాఠశాలలు తల్లిదండ్రులకు కూడా ఎరవేస్తున్నాయి . ఇన్ని అడ్మిషన్స్ తెస్తే ఇంత ఫీజు తగ్గిస్తాము అని మభ్యపెడుతున్నాయి . పెద్దవారు అబద్దాలు చెబుతారేమో కానీ పిల్లలుచెప్పరు. ఒక పాఠశాల వదిలే సమయానికి అక్కడికి వెళ్లి బయటకు వస్తున్న పిల్లలని అడగండి . మీ పాఠశాల ఎలా వుంది ? మీరు ఇష్టపడి స్కూల్ కు వెళుతున్నారా ? పాఠాలు అర్థం అవుతున్నాయా ? అని అడగండి . నిజాలు తన్నుకొని వస్తాయి .

**పిల్లలు దేవుడు చల్లని వారే ..**
**కల్లకపటమెరుగని కరుణామయులే !**
**నేటి మన పెంపకమే రేపటి వారి భవిత !**
**తల్లితండ్రులు , గురువులు , స్నేహితులు, ఇరుగుపొరుగు ..**
**ఇవే వారి భవిషత్తు భవనానికి నాలుగు పిల్లర్స్ .**

**వాసిరెడ్డి అమరనాథ్ , స్లేట్ ది స్కూల్.. వ్యవస్థాపకులు**
**(సేకరణ: వాసిరెడ్డి అమరనాథ్ ఫేస్‌బుక్ నుంచి)**

# ఆవేశాన్ని ఆలోచనతో కలపండి

## మెరుగైన జీవితం మన లక్ష్యం కావాలి.. కోనసీమ వాసులకు జేపీ విజ్ఞప్తి



కోనసీమ అనగానే మనందరికీ చక్కటి పల్లె సీమలు, పచ్చటి పైరు పొలాలు సంవత్సరం పొడవునా మూడు పంటలు పండించే ఏర్పాటు , ఓ పక్క కొబ్బరి చెట్లు లేకపోతే కంద మొక్కలు, ఇళ్ల మధ్యలో రోడ్డు,, ఓ పక్క కాలువలు. తెలుగునాట అంత అందమైన ప్రదేశం మరోటి లేదు. బహుశా మన దేశంలో ఒక్క కేరళలో మాత్రమే కొన్ని చోట్ల అలాంటి పరిస్థితులు ఉన్నాయి. చాలా ప్రశాంత జీవనం గడిపే గ్రామీణ ప్రజలు. అరమరికలు లేకుండా ప్రతీ వాళ్లు ఒకళ్లనొకళ్లు సొంత బంధుత్వం లేకపోయినా వేర్వేరు కులాలు, వర్గాలు అయినా కూడా బాబాయి, మావ, అత్తా, అన్నా అని పిలుచుకునే సాంప్రదాయం. అలాంటి పచ్చటి కోనసీమలో ఈవేళ కుల వివక్షలు, విద్వేషాలు తలెత్తి, విధ్వంసకాండ జరుగుతుందంటే నిర్ఘాంత పోయాను. దాని వెనుకాల కారణం జిల్లాకు ఏ పేరు పెట్టాలనే అంశం. అంబేద్కర్ గారి పేరే కావాలని ఆ మహానాయకుడి స్మృతికి చిహ్నంగా ఉండాలని దళితులు ఓ పక్కన వాదిస్తుండగా, ఆ పేరు పెట్టడానికి వీల్లేదని ఇతర వర్గాలు మరోపక్కన. నేను అందరికీ సవినయంగా మనవి చేస్తున్నా. ఏ పేరు ఉన్నా, ఏ పేరు లేకపోయినా జిల్లా మారదు. ప్రజల జీవితం అదే. మనం పట్టించుకోవాల్సింది ఏ ప్రభుత్వం ఉన్నా కూడా మన పన్నుల డబ్బుతో మంచి విద్య అందిస్తోందా లేదా? ఉచిత విద్యే కాదు మంచి విద్య , పనికొచ్చే విద్య, కోనసీమలో ప్రతీ గ్రామంలో ప్రతీ కులంలో తల్లిదండ్రుల డబ్బుతో, చదువుతో నిమిత్తం లేకుండా తెలివితేటలు వికసించే చదువు ప్రతీ బిడ్డకు అందుతుందా? లేదా? మనందరికీ మంచి ఆరోగ్యం పైసా ఖర్చు లేకుండా అందుతుందా? లేదా? జీవితంలో రేపు ఏమవుతుందా అనే భయం లేకుండా మన పిల్లలకు ఉపాధి అవకాశాలు వస్తున్నాయా ? లేదా? మంచి మౌలిక సదుపాయాలు రోడ్లు, ఇళ్లు, తాగునీరు, రవాణా, విద్యుత్ అందరికీ అందే ఏర్పాటు ఉందా? లేదా? వ్యవసాయం ఎంత పచ్చగా ఉన్నా కోనసీమలో క్రమక్రమంగా పరిశ్రమలు రాకపోతే, సేవా రంగం విస్తరించకపోతే అందరూ వ్యవసాయ రంగంలోనే పనిచేయడం సాధ్యం కాదు. ఆ అవకాశాలు మన పిల్లలకు వస్తున్నాయా? ఆ పెట్టుబడులు వస్తున్నాయా? ఇవి మన జీవితాన్ని శాసించేది.

జిల్లా పేరు మన బతుకుల్ని శాసించదు. ఏపార్టీ వచ్చినా, ఏ పార్టీ లేకున్నా ..అది మన జీవితంలో మార్పు తీసుకురాదు. నాకిప్పటికీ ఆ జిల్లాలో ప్రతీ మండలం గుర్తు ఉంది. ఆ రోజుల్లో కాకినాడ, రాజమండ్రికి మధ్య పెద్ద పోరాటం జరిగింది. ఆరోజుల్లో పోరాటం అంటే ఈ రోజుల్లో నవ్వొస్తోంది. టెలికమ్ డివిజనల్ ఆఫీసు పెట్టాలి. అది రాజమండ్రిలో పెట్టాలా? కాకినాడలో పెట్టాలా? అనేది సమస్య. ఎవరికి వారు తమ పట్టణంలో పెట్టాలని వివిధ రూపాల్లో ఆందోళనలు చేశారు. నేను అందర్నీ పిలిచి నచ్చజెప్పాను. ఫోన్లు దొరకడమే ఆ రోజుల్లో చాలా గొప్ప. ఎవరో లక్షాధికారులు దగ్గర మాత్రమే ఉండేవి. దేశం మొత్తం మీద ఆనాడు కేవలం 70 లక్షల ఫోన్లు ఉన్నాయి. మనం ఫోన్లు కావాలని కోరుకోవాలి. ఉన్న ఫోను నిరంతరం సమర్థంగా పని చేయాలని కోరుకోవాలి. ఆ ఫోను ఖరీదు ఎక్కువ ఉండకూడదు. కాల్ చార్జీలు శక్తికి మించి ఉండకూడదని కోరుకోవాలి. అంతేకానీ టెలిఫోన్ ఆఫీసు ఎక్కడ ఉంటే మనకు ఏం పోయిందని నచ్చచెబితే అర్థం చేసుకుని ఆ ఉద్యమానికి స్వస్తి పలికారు.

ఇవాళ జేబులో ఫోను లేని వారు లేరు. కోనసీమలో కానీ రాజమండ్రిలో కానీ, కాకినాడలో కానీ ప్రతీ కుటుంబంలో రెండో మూడో ఫోన్లు ఉన్నాయి. కొంతమంది దగ్గర రెండు మూడు ఫోన్లు ఉన్నాయి. అతి చవకగా ఫోన్లు అందుబాటులోకి వస్తున్నాయి. ఏ సిఫార్సులు లేకుండా, తక్కువ ఖర్చుతో దొరుకుతున్నాయి. ప్రపంచ ప్రమాణాలతో అందుబాటులోకి వచ్చాయి. స్మార్ట్ ఫోన్లు కూడా చాలా మంది దగ్గర ఉన్నాయి. ఇంటర్నెట్ సౌకర్యం కూడా ఉంది. అది మనకు ముఖ్యం. కులం అనేది ఇవాళ వచ్చింది కాదు. సమాజంలో మనం బాధపడే ముఖ్యమైన అంశాల్లో కుల వ్యవస్థ ఒకటి. పుట్టుకతోనే ఒక మనిషిని అంచనా వేయడం. ఆ మనిషి తెలివితేటలను బట్టి, ఆ మనిషి పడే కష్టాన్ని బట్టి, ఆ మనిషి వల్ల పదిమందికి కలిగే ప్రయోజనాన్ని బట్టి కాకుండా పుట్టుకను బట్టి అంచనా వేయడం అనేది కుల వ్యవస్థలో ఉన్న చాలా దారుణమైన స్వభావం. అది ఎవరి తప్పు కాదు. ఈ దేశంలో పుట్టగానే ఆ కులానికి బందీ అయిపోతున్నాం. ముక్కుపచ్చలారని చిన్నారుల తప్పు కాదు. తల్లిదండ్రులు నూటికి 99శాతం మంది ఆ కులానికి చెందిన వారే. సాధారణంగా బంధువులంతా ఆ కులానికి చెందిన వారే. కావాలని ఎంచుకోకపోయినా ఆ కులంవారితోనే స్నేహాలు . నూటికి 95 శాతం ఆ కులంలోనే పెళ్లిళ్లు. కాబట్టి ఈ కుల వ్యవస్థ మనల్ని పూర్తిగా వశం చేసుకుంది. ప్రభుత్వాలు ప్రయత్నం చేస్తున్నాయి. చట్టాలు వచ్చాయి. ఉదాహరణకు కులాంతర వివాహాలు ప్రోత్సహించేందుకు ప్రభుత్వాలు సాయం చేస్తున్నాయి. కానీ ఒక సమాజంలో మార్పు ప్రభుత్వాల వల్ల, చట్టాల వల్ల ఒక్క రోజులో రాదు. కాలక్రమేణా వస్తోంది. యువత నాజీవితంలో ఏం కావాలి. ఎలాగైతే టెలిఫోన్ ఆఫీసు ముఖ్యమా? మెరుగైన టెలిఫోన్ సేవలు ముఖ్యమా? ఆ ప్రశ్న సరిగా వేసుకుంటే పరిష్కారం సులభం..అలాగే నాజీవితంలో ఎదిగే అవకాశాలు నాకు కావాలా? మంచి ఆదాయంతో గౌరవంగా బతికే అవకాశం కావాలా? నా నైపుణ్యం, ప్రతిభ వికసించి ఆత్మగౌరవంతో బ్రతికే అవకాశం రావాలా? లేకపోతే జిల్లా పేరు కావాలా? ఆ ప్రశ్న మనం వేసుకోవాలి. యుక్త వయస్సుకు వచ్చిన యువత పెళ్లి చేసుకోవాల్సి వచ్చినప్పుడు ఆలోచించాల్సింది ఏ కులమని కాదు. మీ కులాన్ని వద్దని నేను పోరాడడం లేదు. అది కాలక్రమేణా పోతోంది. ఒక్కరోజులో పోయేది కాదు. కానీ నాజీవితంలో నా ఆనందం కోసం ఎవరితో సహచర్యం బాగుంటుంది. ఎలాంటి జీవిత భాగస్వామిని నేను ఎంచుకోవాలి. సమాజ ఉద్ధరణ కోసం కాదు. నా జీవితంలో ఆనందం కోసం ఆ ప్రశ్న వేసుకుని తగిన జీవిత భాగస్వామిని ఎంచుకుని, తలెత్తుకుని మీ కాళ్లపై నిలబడగలిగితే క్రమక్రమంగా కుల వ్యవస్థ అంతరిస్తోంది. కానీ సమాజంలో కొంతమందికి ఆ కులం ఆలంబనగా కలిసొస్తే ఆ కులాన్ని ఉపయోగించుకోవడం వేరు. కులం పేరుతో మనందరం ఆవేశం, ఆగ్రహం పెరిగిపోయి ప్రభుత్వ ఆస్తులు తగలెట్టడం, వ్యక్తుల ఆస్తులు ధ్వంసం చేయడం ఒకరిపై ఒకరు దాడులు చేసుకోవడమో, హింసకు పాల్పడడమో, రక్తపాతానికి దారి తీయడమో, ప్రాణాలు తీసుకోవడమో ఇది ఏరకంగాను మన మంచికి సరైంది కాదు. ఈ రకంగా మనం ప్రవరిస్తే, మన వేళ్లతో మన కళ్ళు పొడుచుకుంటే లోకం అంతా గుడ్డిదైపోతోంది. వినమ్రంగా అర్థిస్తున్నా..మీ భవిష్యత్తు కోసం మన జీవితాలు బాగు పడాలంటే ప్రభుత్వాలు ఏం చేయాలి..దాని మీద శ్రద్ధ పెట్టండి. ఏ పేరుతో వచ్చింది.. ఏ కులంలో పుట్టారు ఇలాంటి అంశాలు పక్కన పెట్టండి. కులం అనేది ఒక్కరోజులో పూర్తిగా తొలగించలేకపోయినా ..తగ్గించండి. మీ భవిష్యత్తు గురించి, మీ పిల్లల భవిష్యత్తు గురించి ఆలోచించండి. ఆవేశాన్ని ఆలోచనతో కలపండి దీర్ఘకాలంలో మన కుటుంబాలకు ఏది మంచని అనిపిస్తే ఆ మార్గంలో వెళ్లే ప్రయత్నం చేయండి. ఒక్కసారి మనసు పెట్టి ఆలోచించమని, మీ భవిష్యత్తు కోసం ఈ కులం, మతం, వర్గం పార్టీ కంటే అతీతంగా మన ప్రయోజనాలున్నాయి. మన కుటుంబాలున్నాయి. మన భవిష్యత్తును కాపాడుకోవడం ఎలా అనేది మనసు పెట్టి ఆలోచిస్తారని ఆశిస్తున్నాను.

# మౌలిక మార్పుల దిశగా కృషి సాగించాలి

## తెలంగాణ ప్రజలకు ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు




కొత్త రాష్ట్రం ఏర్పడి ఎనిమిదేళ్లయ్యింది. తెలంగాణకు విశిష్టమైన సంస్కృతి చరిత్ర, సాహిత్యం, అన్నిటిని మించి స్వపరిపాలన కావాలనే బలమైన ఆకాంక్ష ఉన్నాయి. ఆ కారణంగానే సుదీర్ఘ పోరాటం తర్వాత శాంతియుతంగా , ఈ రాజ్యాంగ వ్యవస్థలో భాగంగా, దేశ ఐక్యతకు ఏ రకంగాను ఇబ్బంది కలగకుండా తెలంగాణ ప్రజలు సొంత రాష్ట్రాన్ని సాధించుకున్నారు. ఈ ఎనిమిదేళ్ల కాలంలో కొత్త రాష్ట్రం వల్ల కొన్ని మంచి ఫలితాలు వచ్చాయి. ఒకప్పుడు కేవలం హైదరాబాద్ మీదే ఉండే దృష్టి కొన్ని ఇతర నగరాలు, పట్టణాలకు వ్యాపించింది. కొంతమేరకైనా ప్రజల జీవన స్థితిగతులను బాగుచేయాలన్న ఆకాంక్ష పార్టీలకతీతంగా ఎన్నికైన వారిలో, అధికార యంత్రాంగంలో పెరిగింది. మౌలిక సదుపాయాలు కొన్ని కచ్చితంగా గణనీయంగా బాగుపడ్డాయి. విద్యుత్ అందరికీ నిరంతరం అందడం ఓ ఉదాహరణ. ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసి సామాన్యుడికి తాత్కాలికంగా అయిన ఊరట కలిగించే ఏర్పాటు జరుగుతోంది. ఇవన్నీ అభినందించదగిన అంశాలు. కానీ లోక్‌సత్తా తొలినుంచి చెబుతూ వస్తోంది. అసలు అధికారమే ప్రజల చేతుల్లో ఉంటే ఏ ఊరికి ఆ ఊరు, ఏ జిల్లా కి ఆ జిల్లా, ఏ పట్టణానికి ఆ పట్టణం తమ పన్నుల డబ్బుతో, తాము ఇచ్చిన ఓటుతో ఎక్కడికక్కడ నిర్ణయాలు తీసుకుని అక్కడి పరిస్థితులను మార్చుకునే అవకాశం ప్రజలకు ఉంటే అద్భుతమైన నాయకత్వమూ వస్తోంది. పరిస్థితులు బాగుపడతాయి. అలా కాకుండా కేవలం రాజధానే మారినంత మాత్రాన లేదా రాష్ట్రం పేరు, విస్తీర్ణం మారినంత మాత్రాన మనకు అద్భుతాలు జరుగుతాయనుకుంటే చాలా పొరపాటు. నిజమైన అధికార వికేంద్రీకరణ అంటే ప్రతీ పట్టణం, ప్రతీ జిల్లాని జిల్లా ప్రభుత్వంగా, పట్టణ ప్రభుత్వంగా గుర్తించి అక్కడ వనరులను అధికారాలను బాధ్యతలను అప్పగించి జవాబుదారీగా ఉండేలా ఏర్పాటు చేస్తే ప్రతీ ఊళ్లో ఎక్కడి సమస్యకు అక్కడ పరిష్కారం దొరకుతోంది. అంతా హైదరాబాద్‌కు తిరగాల్సిన అవసరం లేదు. మనకు హన్మకొండ అవసరం, మనకు హుస్నాబాద్ అవసరం, సిద్దిపేట అవసరం, సూర్యాపేట అవసరం, మహబూబ్‌నగర్ అవసరం, నల్లగొండ అవసరం. ఎక్కడికక్కడ తమ జీవితాల్ని సరిదిద్దుకునే అవకాశం ప్రజలకి కావాలి. మన దేశంలో రాష్ట్రస్థాయిలో అధికారాలు చాలా పెరిగాయి. గతంలో రాష్ట్రాలు చాలా బలహీనంగా ఉండేవి. స్వతంత్రం వచ్చిన కొత్తలో యూనియన్ అధికారాలు చాలా బలంగా ఉండేవి. కాలక్రమంలో కొందరు మహాయోధుల పోరాట ఫలితంగా మంచి నాయకత్వం, ప్రజల ఆకాంక్షల వల్ల రాష్ట్రాలు మరింత బలపడ్డాయి. నిజానికి రాష్ట్ర ప్రభుత్వాలు తలచుకుంటే రాష్ట్రాల భవిష్యత్తును పూర్తిగా మార్చే అధికారం, అవకాశం వారి చేతుల్లో ఉన్నాయి. కానీ ఎంతసేపటికి ' మా ఇంటికి వస్తే ఏం తెస్తావు..మీ ఇంటికి వస్తే ఏం ఇస్తావనే ' తీరులో అధికారం తమ చేతుల్లో ఉండాలని కోరుకుంటున్నాయి. కానీ స్థానిక ప్రభుత్వాలకు బాధ్యతలు,

నిజమైన అధికారాలు కట్టబెట్టడంలో తాత్సారం చేస్తున్నాయి. రాష్ట్రస్థాయిలో కూడా మళ్లీ కేబినెట్ స్థాయిలో మొత్తం ముఖ్యమంత్రి చుట్టూ అధికారం కేంద్రీకృతం అవుతోంది. దేశం అంతా ఈ పరిస్థితి ఉంది. మన రాష్ట్రంలో ఆ పరిస్థితి కనిపిస్తోంది. మనం దీన్నుంచి బయటపడి నిజంగా ప్రజలకి పాలనాధికారం ఇవ్వాలి. తమ సమస్యల పరిష్కారాన్ని వారి చేతుల్లో పెట్టాలి. అప్పుడు బలమైన నాయకత్వం వస్తోంది. సమర్థులు మన సమాజంలో సమస్యలను పరిష్కరించగలిగిన వాళ్లు చాలా మంది ఉన్నారు. వారందరినీ అభ్యర్థులుగా, దరఖాస్తుదారులుగా పరిగణించడం కాకుండా నాయకులుగా నిర్ణయాలు చేసే నేతలుగా స్థానికంగా మార్పు తెచ్చే సామాజిక కార్యకర్తలుగా మనం గుర్తిస్తే, అవకాశం ఇస్తే అద్భుతాలు జరుగుతాయి.

**రెండోది:** బీదరికం పోవాలంటే మంచి ప్రమాణాల విద్య, జేబులో నుంచి ఖర్చు కాకుండా మంచి ప్రమాణాల ఆరోగ్యం, వీటి నుంచి వచ్చే నైపుణ్యం, పెట్టుబడులు, ఉపాధి, ఉపాధి వల్ల కలిగే ఆదాయం తప్ప వేరే మార్గం ఏదీ లేదు. మనం అన్నీ తాత్కాలికమైన తాయిలాల మీదే దృష్టిపెట్టి ఓట్ల కోసం అని చెప్పి ప్రజాధనం మొత్తాన్ని జీతాలకి, తాత్కాలిక తాయిలాలకీ మాత్రమే ఖర్చుపెట్టి అద్భుతాలు చేశామని భ్రమిస్తే బీదరికం కొనసాగుతోంది. తాత్కాలికంగా బీదరికం వల్ల కలిగే బాధకు ఉపశమనం కలిగించొచ్చు. కానీ బీదరికం తొలగదు. మనం కోరుకునేది ప్రతీ కుటుంబంలోనూ మన పిల్లలు మనకంటే ఉన్నతంగా ఎదగాలి. మనకంటే ఉన్నత స్థానంలో గౌరవంగా, ఆత్మగౌరవంతో తల ఎత్తుకుని బతకాలి. తమ కాళ్లపై తాము నిలబడాలి. అది జరగాలంటే నిజమైన ఆర్థికాభివృద్ధి, విద్య, ఆరోగ్యం, ఉపాధి కల్పన ప్రతీ ఒక్కరూ కూడా స్వయంశక్తితో బతికే శక్తి, ఆత్మగౌరవం అలాంటి సమాజం కోసం ప్రయత్నం చేయకుండా ఇటీవల కాలంలో చాలా రాష్ట్రాలలో ప్రజల్ని పూర్తిగా తాత్కాలికమైన తాయిలాలకి ఆధారపడేటట్టుగా చేసి ఓటర్లను బిచ్చగాళ్లగా మార్చేస్తున్నారు. ఇది మారకపోతే ఎన్ని రాష్ట్రాలు ఏర్పడినా, ఎన్ని జిల్లాలు ఏర్పడినా ప్రజాస్వామ్యం సార్థకం కాదు. అధికారం కేంద్రీకృతం అవుతోంది. పెద్దగా మార్పు లేకుండా ప్రజల జీవన స్థితిగతులు కొనసాగుతూ ఉంటాయి. బీదలు బీదలుగానే ఉంటారు. సంపన్నులు ఎదుగుతూ ఉంటారు.

**మూడోది:** ప్రజాస్వామ్యం అంటే చట్టబద్ధ పాలన. డబ్బు ఉందా? లేదా? పట్టణమా? గ్రామమా? కులం ఏంటి , ప్రాంతం ఏంటి? మతం ఏంటి? ఏ పార్టీ ? వీటికి అతీతంగా చట్టం అందరినీ సమానంగా చూడాలి. చట్టం అందరికంటే ఎత్తున ఉండాలి. పదవితో, డబ్బుతో నిమిత్తం లేకుండా ప్రతీ ఒక్కళ్లు చట్టానికి లోబడి పనిచేయాలి. మనదేశంలో ఆ పరిస్థితులు లేవు. తెలంగాణలో శాంతిభద్రతలను కాపాడుతున్నారు. సమర్థంగా పోలీసు యంత్రాంగం పనిచేస్తోంది. కొన్ని చొరవలు తీసుకుని కొత్త పుంతలు తొక్కుతున్నారు. కానీ మౌలికంగా మన దేశంలో కానీ మన రాష్ట్రంలో కానీ నిజమైన చట్టబద్ధ పాలన కాగితం మీద ఉంది కానీ వాస్తవరూపం ధరించడం లేదు. పోలీసు యంత్రాంగంలో కావొచ్చు, ప్రాసిక్యూషన్‌లో కావొచ్చు, కోర్టుల్లో కావొచ్చు పనితీరులో మౌలికమైన మార్పులు తీసుకురాకపోతే ప్రజాస్వామ్యం సార్థకం కాదు. ప్రజాస్వామ్యం అంటే కేవలం ఓటు వేయడము, నిరసన తెలిపే హక్కు ప్రదర్శించడం ఈ రెండు మాత్రమే ప్రజాస్వామ్యం అయితే మన దేశంలో పుష్కలంగా ప్రజాస్వామ్యం ఉంది. నిజమైన ప్రజాస్వామ్యంలో ఎదిగే అవకాశం కావాలి. అధికార వికేంద్రీకరణ కావాలి. దిద్దుబాటు చేసే అవకాశం కావాలి. చట్టబద్ధ పాలన కావాలి. అవి లేకపోతే అది పూర్తి ప్రజాస్వామ్యం కాజాలదు. లోపభూయిష్టమైన ప్రజాస్వామ్యం అవుతోంది. ఎందరో నాయకులు 1960 దశకం నుంచి దీర్ఘకాలం రాజీలేని పోరాటం చేసి కొంతమంది చివరికి కుటుంబాలను కూడా నిర్లక్ష్యం చేసి నిరుపమానమైన త్యాగాలు చేసి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నారు.


ఒక రాష్ట్రం అన్నది పేరు మారితేనో, పటం మారితోనో చాలదు. ప్రజల జీవితాలు మారాలి..ఆత్మగౌరవం పెరగాలి. అందరి స్వేచ్ఛా వికసించాలి. స్వతంత్ర భారతంలో దేశ ఐక్యతకు భంగం కలగకుండా ఈ దేశంలో అంతర్భాగంగా ఉంటూ, ఈ రాజ్యాంగ విలువలను పాటిస్తూనే, రాజ్యాంగ హక్కులను అందరికీ అందేటట్టు చేస్తూనే ఏరాష్ట్రానికి ఆ రాష్ట్రం, ఏ పట్టణానికి ఆ పట్టణం స్వయం సంపన్నం కావాలి. స్వయం సమృద్ధం కావాలి. స్వయం పాలనకి పూర్తిగా అంకితం కావాలి. అలాంటి ఏర్పాట్లు చేస్తే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు లక్ష్యం నెరవేరినట్టు. అందుకోసమే వేలాదిమంది ఎన్నో త్యాగాలు చేశారు. వాళ్లు చేసిన త్యాగాలను మనసారా అభినందిస్తూ వారందరికీ అంజలి ఘటిస్తూ ఆ త్యాగాలు వృథాగా పోకుండా , ఆస్ఫూర్తిని నింపుకుని నిజమైన ప్రజాస్వామ్యం, వ్యక్తుల ఎదుగుదల, నివారించదగిన క్లేశాన్ని తొలగించడం , ప్రతీ బిడ్డకి కులంతో కుటుంబంతో నిమిత్తం లేకుండా ఎదిగే అవకాశాల్ని కల్పించడం, ఒక సామరస్య వాతావరణంలో చట్టబద్ధ పాలనతో ప్రతీ పౌరుడు సగౌరవంగా బతికే ఏర్పాటు చేయడం సాధ్యమవుతోందని నమ్ముతూ అందుకోసం మనం కృషి చేస్తే బహుశా ఒక దశాబ్దంలో తెలంగాణ రాష్ట్రంలో మౌలికమైన మార్పులు తేవచ్చు..అవి దేశానికి ఆదర్శం కావొచ్చు. అందుకు కృషి చేయాలని మనసారా అర్థిస్తూ రాష్ట్రం ఏర్పాటై ఎనిమిదేళ్లు నిండిన సందర్భంగా, అందరి మిత్రులకు శుభాకాంక్షలు . తెలంగాణ ప్రజలకు , లోక్‌సత్తా కార్యకర్తలకు, ఈ రాష్ట్రం కోసం పోరాడిన యోధానుయోధులందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు.

గత సంచిక తరువాయి

# అందరికీ ఆరోగ్యానికి ఆచరణసాధ్య నమూనా

## సమర్థవంతం / అందుబాటు / అతి తక్కువ వ్యయం

**జూలై 2021** (తెలుగులో స్థూల అనువాదం)



**(గమనిక: ప్రజలపై ఎటువంటి ఆర్థిక భారం లేకుండా భారతదేశంలో అందరికీ నాణ్యమైన ఆరోగ్యాన్ని జీడీపీలో అతి తక్కువ వ్యయంతో అందించేందుకు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ నేతృత్వంలో ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్) ఇంగ్లీషులో రూపొందించిన సమగ్ర ఆరోగ్య విధానానికి స్థూలంగా తెలుగులో చేసిన అనువాదమిది. ఇందులో పట్టికలు, గణాంక పటాలు, అనెగ్జర్ల వివరాలుండవు. ఆరోగ్య విధానంపై రూపొందించిన పుస్తకంలో పూర్తి సమాచారం ఉంటుంది)**

### 4.2.2.9.2. ఔషధాల సరఫరా - ప్రతి సెంటర్ (10 ఎఫ్.పిలు)లో ప్రయివేటు డిస్పెన్సరీ

ప్రయివేటు వర్గాల ఆధ్వర్యంలోని స్థానిక ఔషధశాలల భాగస్వామ్యంతో మందుల సరఫరాకు పటిష్ఠ ఏర్పాట్లు చేయవచ్చు. 8-10 ఎఫ్.పిలతో ఉండే ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో (1,00,000 - 1,50,000), ప్రభుత్వం సేకరించిన ఔషధాలని ప్రభుత్వం నిర్ణయించిన ధరల్లో సరఫరా చేసేందుకు ఒక ఉమ్మడి డిస్పెన్సరీని ఏర్పాటు చేయవచ్చు. ఖర్చులు భర్తీ అయ్యేలా, సమంజసమైన స్థాయిలో నికర ఆదాయం ఉండేలా సుమారు 10 శాతం కమీషన్‌ని సముచితంగా అనుమతించవచ్చు. ఆ ఔషధశాలలను ప్రయివేటు ఔత్సాహికులు ఏర్పాటు చేస్తారు. ప్రత్యేకించిన (క్యాప్టివ్) మార్కెట్‌తోపాటు, అమ్మకాల్లో సముచిత డిమాండ్ ఉంటుంది కాబట్టి, అనేకమంది ఔత్సాహికులను ఇది ఆకర్షిస్తుంది. భారతదేశం మొత్తంలో, 8,50,000 చిల్లర మందుల దుకాణాలు ఉన్నాయి. భారతదేశ ఔషధ మార్కెట్ విలువ రూ. 1,50,000 కోట్ల మేర ఉంటుంది. ఒక్కో చిల్లర దుకాణంలో ఏడాదికి రూ.18 లక్షల దాకా అమ్మకాలు జరుగుతూంటాయి. ప్రతిపాదిత ప్రాథమిక ఆరోగ్య నమూనాలో, 10,000 సెంటర్లలో (చిన్న పట్టణాలు) దాదాపు 1,00,000 ఎఫ్.పిలు ఉంటారు. ప్రతి పట్టణంలోని 10 ఎఫ్.పిలు రోజుకు 400-500 ఔట్‌పేషెంట్లకు సేవలందిస్తారు. ఔట్‌పేషెంట్లకు సరఫరా చేసిన ఔషధాల మొత్తం విలువ ఏటా రూ.8500 కోట్ల దాకా ఉంటుంది. ఎఫ్.పి నేతృత్వంలో నడిచే ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థలోని ప్రతి ప్రయివేటు మందుల దుకాణం ఏడాదికి సుమారు రూ.85 లక్షల మేర అమ్మకాలు చేస్తుంది. చిల్లర మందుల అంగళ్లలోని సగటు అమ్మకాల కంటే ఇది నాలుగు రెట్లు ఎక్కువ. ఈ స్థాయి ప్రత్యేకించిన మార్కెట్ వ్యాపారంతో ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థలోని ఔట్‌పేషెంట్లకు సేవలను అందించటం కోసమే ప్రయివేటు, చిల్లర దుకాణాలను ఏర్పాటు చేయటం.. ఎంతో ఆచరణసాధ్యమైన, ఆకర్షణీయమైన అవకాశం.

వైద్య సేవలు అందుబాటులో ఉండటమంటే, ఉచిత ఔషధాలు కూడా జీవితకాలం అందుబాటులో ఉండటం అందులో భాగం కావాలి. వయసు మీరుతున్న జనాభా, పెరుగుతున్న ఎన్.సి.డిలు కాలక్రమంలో శాశ్వత ప్రిస్క్రిప్షన్ ఔషధాల వినియోగాన్ని మరింత పెంచుతాయి. అంతిమంగా, ఔషధాల ఖర్చు భారం ఖజానాపై పెద్దఎత్తున పెరిగే అవకాశం ఉంది. కాలక్రమంలో, ఆరోగ్య సంరక్షణ ఖర్చుల్లో పెరుగుదలకు ఇది దారి తీస్తుంది.

పట్టిక 4.11లో చూపినట్లు, ఇటలీలో ఒక నిర్దిష్ట బ్రాండ్

వైద్య ఉత్పత్తికి చికిత్సలో ప్రత్యామ్నాయం లేకుంటే తప్ప, క్రియాశీల ఔషధ మూల పదార్థం (యాక్టివ్ ఇంగ్రీడియెంట్) పేరుతోనే డాక్టర్లు మందుల్ని రాయాలి. నాణ్యమైన జనరిక్ ఔషధాలని తక్కువ ధరలో రోగులకు సరఫరా చేయటానికి వీలుగా అటువంటి విధానాన్ని ప్రజారోగ్య వ్యవస్థలో ప్రవేశపెట్టాలి. జనరిక్ ప్రత్యామ్నాయం అందుబాటులో ఉన్నప్పటికీ ఒక రోగి బ్రాండెడ్ ఔషధాన్నే కోరుకుంటే, ఖరీదులో తేడాని సహ చెల్లింపుగా వసూలు చేయాలి.

ప్రపంచవ్యాప్తంగా అనుసరిస్తున్న సహ చెల్లింపుల నమూనాలు భారతీయ పరిస్థితులకు తగిన ఒక అత్యుత్తమ నమూనాను రూపొందించటంలో తోడ్పడతాయి (పట్టిక 4.11). అన్ని ఔషధాల కొనుగోళ్లపై స్వల్ప సహ చెల్లింపులు సేవల్లో నాణ్యతను పెంచి, మితిమీరిన వినియోగాన్ని తగ్గిస్తాయి. ఎఫ్.పి విచక్షణను అనుసరించి నిరుపేద రోగులకు సహ చెల్లింపుల నుండి మినహాయింపునివ్వవచ్చు.

ప్రాథమిక ఆరోగ్య స్థాయిలో పంపిణీ చేసే ఔషధాలు వ్యయానికి తగ్గ ఫలితాలనిచ్చేలా ఒక ఏర్పాటును వ్యవస్థీకరించటం వివేకవంతమైన చర్య అవుతుంది. ఇందుకు ఒక ఆచరణసాధ్య నమూనా వివరాల్ని దిగువన 'సేవలకు నామమాత్రపు ఫీజు' విభాగంలో ఇవ్వటమైంది. మార్కెట్ ధరలతో పోలిస్తే గణనీయ స్థాయి తగ్గింపు ధరలకు రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్రీకృతంగా మందుల్ని, ఎక్కువ శాతం జనరిక్ ఔషధాలను సేకరిస్తున్న నేపథ్యంలో, ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థలోని మందుల దుకాణాల ద్వారా సరఫరా చేసే జనరిక్ మందుల ధరలతో ప్రభుత్వం ఒక జాబితాను వెలువరిస్తుంది. మందుల సేకరణ, పంపిణీకి ప్రభుత్వం చేసే వ్యయం ఆధారంగా, డిస్పెన్సరీలకు అనుమతించే 10 శాతం అదనపు చెల్లింపు ఆధారంగా ఆ జాబితాలోని ధరలు నిర్ధారితమవుతాయి. మొత్తం ఔట్‌పేషెంట్ సేవల్లో డ్రగ్స్‌ని తక్కువ ధరకు, రూ.100 గరిష్ట పరిమితితో 25% మేర రోగి సహ చెల్లింపు ఉండేలా సరఫరా చేయవచ్చు. తక్కువ ధర మందుల్ని కూడా కొనలేని నిరుపేద రోగులకు ఉచితంగా సరఫరా చేయవచ్చు. ఎఫ్.పి ఫిజీషియన్ నిర్ణయానికి అనుగుణంగా, మొత్తం ఔట్‌పేషెంట్ల సంఖ్యలో 10 శాతానికి మించకుండా ఈ ఉచిత సరఫరా ఉంటుంది. దీర్ఘకాల ఎన్.సి.డి రోగులు ఉచిత ప్రిస్క్రిప్షన్ మందులను కొద్దిమేర సహచెల్లింపుతో, ధరలో 25 శాతం చెల్లింపుతో, నెలవారీ పరిమితి రూ.100 మించకుండా పొందవచ్చు. ఎఫ్.పి నిర్ధారించిన నిరుపేద రోగులకు, క్షయ, హెచ్.ఐ.వి – ఎయిడ్స్, కుష్టు లాంటి దీర్ఘకాల అంటువ్యాధుల చికిత్స పొందే రోగులందరికీ పూర్తి ఉచితంగా, ఎటువంటి సహ చెల్లింపులు లేకుండా మందుల్ని సరఫరా చేస్తారు. పైన వివరించినట్లు ఫిజీషియన్లు ఔషధాలని బ్రాండెడ్ పేర్లతో కాకుండా ఔషధ మూల పదార్థాలతోనే ప్రిస్క్రయిబ్ చేస్తారు. జనరిక్ ప్రత్యామ్నాయం అందుబాటులో ఉన్నా కూడా బ్రాండెడ్ డ్రగ్ కావాలని ఎవరైనా రోగి పట్టుపట్టితే, ఔషధం ధరలో తేడాని సహ చెల్లింపుగా భరించాల్సి ఉంటుంది.

**(పట్టిక 4.11: ఎంపిక చేసిన దేశాల్లో ఔషధాల పంపిణీ నమూనాలు)**

### 4.2.2.10. సేవలకు నామమాత్రపు ఫీజు

ప్రాథమిక స్థాయిలో అందించే మూడు సేవలు– వైద్య సంప్రదింపు, రోగ నిర్ధారణ పరీక్షలు, ఔషధాలకు– నామమాత్రపు సహ చెల్లింపుల్ని వసూలు చేయటాన్ని ఈ దిగువ మూడు కారణాల రీత్యా కీలక అంశంగా పరిగణలోకి తీసుకోవాల్సుంది.

1. ప్రజలకు జవాబుదారీకావటం – ప్రభుత్వ సేవలను అందుకోవటానికి నామమాత్రంగానైనా రోగులు ఫీజు చెల్లిస్తే వారికి ప్రశ్నించే అవకాశం లభిస్తుంది. వాళ్లు వ్యవస్థలో ప్రత్యక్ష భాగస్వాములై వైద్యుల నుండి జవాబుదారీతనాన్ని డిమాండ్ చేయగలుగుతారు. ఎంపిక, పోటీ కలగలిసిన సహ చెల్లింపు వ్యవస్థ.. జవాబుదారీతనానికి ఒక బలమైన సాధనంగా మారుతుంది.
2. వ్యయ నియంత్రణ– అభివృద్ధితో పాటు మెరుగైన ఆరోగ్యానికి డిమాండ్ పెరుగుతుండటం, చికిత్సల ప్రక్రియల వ్యయాలు నిరంతరం పెరుగుతుండటం అనే రెండు అంశాలూ ఆరోగ్యాన్ని అందించటంలో ప్రభుత్వంపై భారాన్ని అనివార్యంగా పెంచుతాయి. చివరికి కొనసాగించటం కష్టంగా మారుతుంది. వ్యయ నియంత్రణకు ఈ దశలోనే ఒక సరికొత్త యంత్రాంగాన్ని ఏర్పాటు చేయటం వ్యూహాత్మకంగా సులువవుతుంది. కాబట్టి, ఈ దశలోనే వ్యయ నియంత్రణ ఏర్పాటును వ్యవస్థీకృతం చేయటం విజ్ఞతతో కూడిన పని.
3. అతి వినియోగాన్ని నియంత్రించటం– ఆరోగ్యాన్ని చిట్టచివరి పౌరునికి కూడా అందుబాటులో ఉంచటానికి ఆటంకం కాని రీతిలో కొంత నామమాత్రపు ఫీజుని అమలు చేస్తే.. అనవసరమైన మందుల్ని, డయాగ్నొస్టిక్ పరీక్షల్ని, మితిమీరి మందులను ప్రిస్క్రయిబ్ చేసే ధోరణులను అది నిలువరిస్తుంది.

అటువంటి రుసుము దేశంలో ఇంకా విస్తృత సంఖ్యలో ఉన్న పేదలు ఆరోగ్య సేవలు అందుకోవటానికి అవరోధం కాకుండా నామమాత్రంగా ఉండాలనే విషయాన్ని ఏ దశలోనూ విస్మరించకూడదు. బాగా వెనుకబాటుతనమున్న, అవకాశాలు కొరవడిన ప్రాంతాలలో చిన్నపాటి సహ చెల్లింపు కూడా భరించలేరు. అలాంటప్పుడు రోగులు ఎఫ్.పిలను సందర్శించటానికి కూడా వెనుకంజ వేసే అవకాశం ఉంది. లేదా స్థానికంగా అందుబాటులో ఉండే అనధికార, శిక్షణలేని వైద్య సేవలదారుల వైపు మొగ్గు చూపే అవకాశముంది. అటువంటి ప్రాంతాల్లో సహ చెల్లింపుల్ని మొత్తంగా మాఫీ చేయాలి.

(ఇంకా ఉంది...)


కులాంతర, మతాంతర వివాహాల్ని
ప్రోత్సహిద్దాం,
మన పరువును పెంచుకుందాం!
సరూర్‌నగర్‌లో
పరువు హత్య
యువకుడిని కిరాతకంగా చంపిన యువతి బంధువులు!
నడిరోడ్డుపై రాడ్లతో కొట్టి దారుణం
మతాంతర వివాహం కారణమనే అనుమానాలు
మతం.. వ్యక్తిగత విశ్వాసం
కులం .. కృత్రిమం
మనసుకి నచ్చిన మనిషితో జీవితాన్ని పంచుకోవడం.. ఆనందదాయకం,
ఆరోగ్యకరం, గౌరవప్రదం
- డాక్టర్ జయప్రకాశ్ నారాయణ్
ప్రజాస్వామ్య పీఠం (FDR ), లోక్ సత్తా వ్యవస్థాపకులు

RNI. Regd No. 69976/98 Postal Reg. No. HD-913/2021-2023 Published on 10th June, 2022 Posting Date 15 &16th of every month




# ప్రజలకు ఆరోగ్యం అందించకుండా క్యాపిటలిజాన్ని తిడితే ప్రయోజనమేంటి?




మన దేశంలో పేదరికానికి, కొందరికే అవకాశాలు అందటానికి క్యాపిటలిస్టు మార్కెట్ వ్యవస్థే కారణమని బూచిగా చూపిస్తున్నారు. వారి వాదన పూర్తిగా వాస్తవ విరుద్ధం. మనం ఆర్థిక వ్యవస్థ మౌలిక సూత్రాలను అర్థం చేసుకోవాలి. క్యాపిటలిజం అంటే స్వేచ్ఛా మార్కెట్, పోటీ వ్యవస్థ, వినియోగదారులకు ఎంచుకునే స్వేచ్ఛ. దీనివల్ల ప్రజలకు నష్టం ఎలా వస్తుంది, లాభం తప్ప!

క్యాపిటలిజం వల్ల కొందరు వ్యక్తులకి ఎక్కువ లాభం రావచ్చు, కొందరు నష్టపోవచ్చు.. కానీ ప్రజలు కచ్చితంగా లాభపడతారు. ఉదాహరణకు మొబైల్ ఫోన్లు. మొబైల్ ఫోన్లు తయారుచేసేవారికి భారీ లాభం వస్తుందేంటి అని ఆలోచించాలా, ఆ ఫోన్ల ద్వారా మనతో సహా కోట్లాది ప్రజానీకం లాభపడుతున్నారని గుర్తించాలా? మరీ గుత్తాధిపత్యం పెరిగిపోతే మరో సంస్థను పోటీగా తేవచ్చు తప్ప.. స్వేచ్ఛా మార్కెట్ వద్దనటం మూర్ఖత్వం పిచ్చి సోషలిజంతో ఆర్థిక తేడాలని బూచిగా చూపించి మానవ సహజ ఈర్ష్యను రెచ్చగొట్టి రాజ్య వ్యవస్థ తాను చేయాల్సిన విద్య, ఆరోగ్యం, నాణ్యమైన పౌర సేవలు, చట్టబద్ధపాలన వంటి పనుల్ని సవ్యంగా చేయకుండా తప్పించుకుంటుండటం వల్లే మన దేశంలో పేదరికం ఇప్పటికీ పెద్దఎత్తున కొనసాగుతోంది.

కేవలం ఆరోగ్యం అందకపోవటం వల్ల పవిత్ర భారతదేశంలో ఏటా 6 కోట్ల మంది ప్రజలు పేదరికంలోకి జారిపోతున్నారు. ఇందులో తెలంగాణ నుండి 19 లక్షలు, ఆంధ్రప్రదేశ్ నుండి 26 లక్షల మంది ఉన్నారు. రాజ్యం తాను చేయాల్సిన పనుల్ని సవ్యంగా చేసి అందరికీ ఆరోగ్యం అందించి ఉంటే ఈ దారుణం జరిగేదే కాదు. ప్రభుత్వాల తప్పిదానికి క్యాపిటలిజాన్ని నిందించటంలో అర్థమేముంది?

ఇప్పటికైనా అలాంటి ధోరణులకు స్వస్తి చెప్పాలి. 75వ స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకుంటున్న ఈ ఏడాదైనా ప్రజలందరికీ ఆరోగాన్ని జేబుఖర్చు లేకుండా అందించేందుకు ఎఫ్‌డీఆర్/లోక్‌సత్తా రూపొందించిన సమగ్ర ఆరోగ్య విధానాన్ని ప్రభుత్వాలు అమలు చేయాలి.

- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్,
ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు

*If undelivered please return to:*
*LOKSATTA UDYAMA SAMSTHA,*
*H.NO. 6-3-678,B-106,*
*PASHA COURT 71, Somajiguda,*
*Behind TRIBHUVANDAS*
*JEWELLERS (TBZ),*
*Hyderabad - 500 082*

Edited, Printed and Published by Dr. Jayaprakash Narayan, National Coordinator, Loksatta for and behalf of Foundation for Democratic Reforms, H.NO. 6-3-678,B-106,PASHA COURT 71, Somajiguda, Behind TRIBHUVANDAS JEWELLERS (TBZ), Hyderabad- 500 082. Printed at Kala Jyothi Process Pvt Ltd, 1-1-60/5, RTC "X" Roads, Hyderabad 500 020